నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెదజల్లిన విజ్ఞానం, సాహిత్యం
2015
11th Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

500 శాతం సుంకాల బిల్లు
రష్యా నుంచి చమురు కొనకుండా ప్రోత్సాహకాలు
సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రకటన 02

సంపుటి 28, సంచిక: 198 | శుక్రవారం | 09-01-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## అదానీ, అంబానీలకు ప్రజలను
# కూలీలుగా మార్చేందుకే...

### మహాత్మాగాంధీ ఉపాధి హామీ రద్దు

● వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్ ● అధికారం ఉందికదా అని ప్రజలను అణచివేస్తామంటే కుదరదు ● ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాలి ● రైతు చట్టాలు, ఉపాధి హామీ చట్టాలపై ప్రధాని క్షమాపణ చెప్పాలి ● టిపిసిసి విస్తృతస్థాయి సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ ● సామ్రాజ్యవాదులకంటే బిజెపి ప్రమాదకరం : డిప్యూటీ సిఎం భట్టి ● జి రామ్ జికి వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం చేస్తాం : మహేశ్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ, అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. వికసిత్ భారత్ కాదు, సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి రోజు రాష్ట్ర ఎంపిలు నిరసన తెలపాలన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) విస్తృతస్థాయి సమావేశం గురువారం గాంధీభవన్‌లో జరిగింది. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, మహ్మద్ అజారుద్దీన్, ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్, నాయకులు ప్రవీణ్ చక్రవర్తి, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవ రావు, వేం నరేందర్ రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పిఎసి) సభ్యులు, టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి తరువాయి 2లో

### ములుగులో సభకు సోనియాగాంధీ

సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలి. ఈ నెల 20 నుంచి 30 వరకు ప్రతి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలి. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలి. ఫిబ్రవరి 3 నుంచి తొమ్మిది జిల్లాల్లో భారీ బహిరంగ సభలుఏర్పాటు చేస్తున్నాం. ములుగులో ఏర్పాటు చేసే బహిరంగ సభకు సోనియా, రాహుల్ , ప్రియాంక గాంధీని ఆహ్వానిస్తున్నాం.

– సిఎం రేవంత్‌రెడ్డి

### అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం 02

విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





### పురపాలక సంస్థలకు రూ.10 కోట్లు

నిధులు విడుదలచేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఆర్థిక సంఘం పరిధిలో పురపాలక సంస్థలకు సహాయం అందించేందుకు రూ.10 కోట్ల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (యుఎల్‌బి) శాఖ గురువారం జి.ఓ ఆర్‌టి నెంబర్. 33ను జారీ చేసింది. ఇప్పటికే తరువాయి 12లో



### ధాన్యం నిల్వలకు సైలో వ్యవస్థ

● అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం యోచన ● ఈ పద్ధతితో ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వెయ్యికోట్ల ఆదాయం ● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతు చేతికి అందిన ధాన్యం నష్ట పోకుండా ఉండేందుకు ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో వ్యవస్థను అమలులోనికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మనుషుల జోక్యం లేకుండానే సైలో పద్ధతిలో ఉండే ఇంటిగ్రేటెడ్ క్లీనర్లు, డ్రైయర్లతో రెండు సంవత్సరాల వరకు ధాన్యాన్ని నిలువ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తరువాయి 2లో



### ఎసిబికి చిక్కిన ఎస్ఐ

రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్

హన్మకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ శ్రీకాంత్ ఎసిబి అధికారుల వలకు చిక్కాడు. పేకాట కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసి తీసుకుంటున్న సమయంలో హన్మకొండ ఎసిబి అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ తరువాయి 2లో

### మేడారం జాతరకు రండి..
# కెసిఆర్‌కు ఆహ్వానం

ఎర్రవెల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రికను అందజేసిన మంత్రులు సీతక్క, సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు రావాల్సిందిగా బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావును రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖలు ఆహ్వానించారు. కెసిఆర్‌ను ఆహ్వానించేందుకు వారు ఎర్రవెల్లిలోని ఆయన నివాసానికి గురువారం వెళ్లారు. ఇంటికి వచ్చిన మంత్రులను కెసిఆర్ తరువాయి 2లో





### రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

తెలంగాణలో తీసుకున్న చర్యలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వివరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ రాజధానిలోని భారత మండపంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగిన 'రవాణా అభివృద్ధి మండలి (టిడిసి) 43వ సమావేశం'లో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో రవాణా రంగ ప్రక్షాళన, రహదారి భద్రత, మౌలిక వసతుల కల్పనపై తరువాయి 2లో



### ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

**న్యూఢిల్లీ :** ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త, పశ్చిమ కనుమల పరిరక్షణ యోధుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత మాధవ్ గాడ్గిల్ (83)కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన పుణెలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు మాధవ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. కాగా, ప్రపంచంలోనే అత్యంత జీవ వైవిధ్యాన్ని కలిగిన పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు ఆయన ఎనలేని కృషి తరువాయి 2లో

# సమస్యల్లో యూనివర్సిటీలు

● విశ్వవిద్యాలయాల అభివృద్ధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి ● విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న పాలకులు ● రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నూతన జాతీయ విద్యావిధానం ● ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్





ప్రజాపక్షం/కెయు క్యాంపస్

ఏ సమాజానికైనా అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలు ఇచ్చే సాధనం విద్య అని, ఆ విద్యనే నేటి పాలకులు భ్రష్టుపట్టిస్తున్నారని, సమస్యల సుడిగుండంలో యూనివర్సిటీలు ఉన్నాయని, విశ్వవిద్యాలయాల అభివృద్ధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తున్నాయని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ అన్నారు. సకల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని కాపాడలేని నిస్సహాయ స్థితిలో పాలక వర్గాలున్నాయని, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఎ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని దానిలో భాగంగానే నూతన జాతీయ విద్యావిధానంను తీసుకువచ్చి పార్లమెంట్‌లో వికాసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఎ) బిల్లు 2025ని ప్రవేశపెట్టిందని, రాష్ట్ర సర్కారు విద్యా సంవత్సరం ముగింపులో కూడా పెండింగ్ ఫీజులు చెల్లింపులు చెయ్యకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా అని, ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయని ఆయన విమర్శించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్ హౌస్‌లో తరువాయి 12లో



## మున్సిపల్‌లో పొత్తుకు కలిసొస్తే స్వాగతిస్తాం..

### లేదంటే ఒంటరి పోరే!

సిపిఐ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మున్సిపల్ ఎన్నికల్లో పొత్తులతో కలిసి వచ్చే వారిని స్వాగతిస్తామని, లేదంటే పంచాయతీ ఎన్నికల్లో మాదిరిగానే ఒంటరి పోరుకైనా సిద్ధమే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చెప్పారు. సిపిఐపై కొందరు విమర్శలకు తరువాయి 12లో

### 66 యుఎన్ సంస్థల నుండి
# వైదొలగిన అమెరికా

ఇది స్వార్థపూరిత చర్య : పర్యావరణవేత్తల ఖండన



**వాషింగ్టన్:** వాతావరణ మార్పుల సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి తరపున కృషి చేస్తున్న 'కాప్' సహా అనేక సంస్థల నుండి వైదొలగుతున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ సంస్థలలో 31 సంస్థలు ఐక్యరాజ్యసమితికి చెందినవికాగా, మరో 35 ఇతర సేవాసంస్థలున్నాయి. ఈ సంస్థలవల్ల అమెరికాకు ఎలాంటి ప్రయోజనం లేదని, ఈ సంస్థల పనితీరు అసమర్థంగా ఉండటమే కాకుండా శత్రు ఎజెండాను ప్రోత్సహించేవిగా ఉన్నాయని వైట్‌హౌస్ అధికారయంత్రాంగం ప్రకటించింది. ట్రంప్ ఇప్పటికే అనేక బహుళపాక్షిక సంస్థలకు అమెరికా నిధులను నిలిపివేశారు. భూగోళంపై మానవనిర్మాణాల వల్ల సంభవించిన, సర్వత్రా ఏకాభిప్రాయం ప్రకటించిన వాతావరణ మార్పుల శాస్త్రీయ ఆలోచన కూడా బూటకమైదని ట్రంప్ తిరస్కరించారు. ఐక్యరాజ్యసమితి వాతావరణ సమస్య పరిష్కారానికి కృషి చేసే అంగీకృత సంస్థ యుఎన్‌ఎఫ్‌సిసిసి (యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఫర్ క్లైమేట్ ఛేంజ్) సహా 66 అంతర్జాతీయ సంస్థల నుండి అమెరికా తరువాయి 12లో

### ఐప్యాక్ ఆఫీస్‌పై
# ఇడి దాడులు

● సంస్థ డైరెక్టర్ ప్రతీక్‌జైన్ నివాసంలోనూ సోదాలు ● బొగ్గు అక్రమ రవాణా కుంభకోణం కేసులో దర్యాప్తు సంస్థ చర్యలు ● హుటాహుటిన ఐ ప్యాక్ కార్యాలయానికి వెళ్లిన సిఎం మమతా బెనర్జీ ● రాజకీయ పార్టీల డేటాను సేకరించే పనికూడా ఇడిదేనా అంటూ మండిపాటు



**కోల్‌కతా :** వందల కోట్ల రూపాయల బొగ్గు అక్రమ రవాణా కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం కోల్‌కతాలోని రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ కార్యాలయం, సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు నిర్వహించింది. అయితే ఇడి దాడులు జరుగుతున్న సమయంలోనే నాటకీయంగా తరువాయి 2లో

## అమెరికా దాడిలో 100 మంది మృతి

### వెనిజులా మంత్రి అధికారిక ప్రకటన



**కారకస్:** అమెరికా చేసిన దాడిలో 100 మంది మరణించారని వెనిజులా దేశీయాంగమంత్రి డియోస్డాడో కాబెల్లో ప్రకటించారు. మరణించిన వారికి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు ఫొటోలను కూడా విడుదల చేశారు. జనవరి మూడో తేదీ అర్థరాత్రి వెనిజులా అధ్యక్ష భవనంపై అమెరికా డెల్టా ప్రత్యేకదళం దాడిచేసి ఆయన భద్రతా బృందాలను నిర్మూలించింది. వారితో పాటే అనేకమంది కూడా మరణించారు. వీరిలో క్యూబా దేశానికి చెందిన జాతీయులు 32 మంది నికొలస్ మదురోకు ప్రత్యేక రక్షణబృందంగా ఉన్నారు. ఈ దాడిలో వారు కూడా మరణించారు. వెనిజులాకు చెందిన 23 మంది సైనికులు కాల్పుల్లో మరణించారు. చాలా నిర్దాక్షిణ్యంగా, అమానవీయ పద్ధతులలో అందరినీ అమెరికా సైన్యం చంపిందని మంత్రి చెప్పారు. రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన మూడు రోజులకు వెనిజులా మంత్రి కాబెల్లా గురువారం అధికారికంగా ఈ విషయం ప్రకటించారు. తొలుత సైనిక అధికారులు 56 మంది మరణించారని ప్రకటించారు. ఐతే చికిత్సపొందుతూ మరణించినవారు, మృతదేహాల సేకరణ తర్వాత తుది లెక్కలు తేల్చారు. ప్రస్తుతం నికొలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్ న్యూయార్క్ జైలులో ఉన్నారు. వారిపై మార్చి 17వ తేదీన రెండో విడత కోర్టు విచారణ ప్రారంభం అవుతుంది.

## గ్రీన్‌లాండ్ కొనుగోలుపై వచ్చే వారం చర్చలు


**న్యూయార్క్ :** గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసే విషయంపై డేనిష్ వర్గాలతో వచ్చేవారం చర్చలు జరిపేందుకు అమెరికా ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్దదైన అత్యంత ప్రకృతి సంపదగల ఆ దీవిని స్వాధీనం చేసుకోవడానికి అవసరమైతే సైనిక చర్యకైనా సిద్ధపడే ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలిస్తాని కొద్ది గంటల క్రితమే ప్రకటించిన వైట్‌హౌస్ తాజాగా ఆ విషయం పక్కనపెట్టి చర్చల మార్గం పట్టింది. ఆరు నూరైనా గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు మార్కో రుబియో గురువారం ప్రకటించారు. గ్రీన్‌లాండ్‌ను ఏ విధంగా కొనుగోలు చేయాలనే విషయంపై డెన్మార్క్ నాయకులతో వచ్చే వారం సంభాషణలు చేస్తామని చెప్పారు. ఈ దిశగా వైట్‌హౌస్ ముమ్మర సన్నాహాలు చేస్తోంది. ఐతే డెన్మార్ ప్రభుత్వం మాత్రం ఒకేమాటపై నిలబడింది. డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లతోపాటు యూరప్ నాయకులు కూడా అమెరికా ఆలోచనలను ప్రతిఘటించినప్పటికీ మార్కోరుబియో తాజాగా తెరమీదకు వచ్చారు. గ్రీన్‌లాండ్ చాలా వ్యూహాత్మకమైన ప్రాంతమని, చైనా, రష్యా, ఉత్తర కొరియా ప్రత్యర్థులను ప్రతిఘటించడానికి ఈ ప్రాంతం తమ అధీనంలో ఉండాల్సిందేనని రుబియో అన్నారు. ఈ విషయంలో ఇప్పటివరకూ ఎటూ తేల్చుకోలేక సందిగ్ధంలో ఉన్న యూరప్ దేశాల నాయకులలో చాలామంది ఇప్పుడు గ్రీన్‌లాండ్ సార్వభౌమాధికారాన్ని కాపాడాలనే ఆలోచనతో డెన్మార్క్‌కు మద్దతు ప్రకటించారు.

# 500 శాతం సుంకాల బిల్లు

### రష్యా నుండి చమురు కొనకుండా ప్రోత్సాహకాలు

### సెనేటర్ లిండ్‌స్లే గ్రాహమ్ ప్రకటన

**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్ సహా రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు దేశాలపై భారీ ఎత్తున 500 శాతం వరకు సుంకాలు విధించే ఆంక్షల బిల్లును అమెరికా ప్రభుత్వం సిద్ధం చేసింది. వచ్చేవారంలో ఈ బిల్లు అక్కడి ఉభయసభల్లో ఆమోదం పొందితే రష్యా నుండి చమురు దిగుమతి చేసుకోవడం భారత్‌కు అతిపెద్ద సమస్యగా మారుతుంది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే చైనా,భారత్,బ్రెజిల్ దేశాలు రష్యా చమురు కొనుగోలు చేయకుండా కట్టడి చేసేందుకు వైట్‌హౌస్ పాలనాయంత్రాంగానికి అపరిమిత అధికారాలు వస్తాయని అధికార రిపబ్లికన్‌పార్టీ సెనేటర్ లిండ్‌స్లే గ్రాహమ్ గురువారం ఎక్స్ వేదికగా చెప్పారు. ఈ దేశాలు రష్యా నుండి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేయకుండా ప్రోత్సాహకాలు ఇవ్వడానికి వీలు కలుగుతుందని కూడా చెప్పారు. ఉక్రేన్‌లో శాంతి స్థాపనకు రష్యాను కట్టడి చేయాలంటే ఆ దేశంతో చమురు వ్యాపారంచేసే ఖాతాదారులను కూడా అదుపు చేయాల్సి ఉంటుందని, అందుకే ఈ బిల్లు తెస్తున్నామని లిండ్‌స్లే గ్రాహమ్ పేర్కొన్నారు.



''శాంతి సాధనకోసం ఉక్రేన్ కూడా రాయితీలు ఇస్తోంది, పుతిన్ మాటలతో కాలక్షేపం చేస్తూ ఉక్రేన్‌లో అమాయకులను చంపుతున్నారు, అందువల్ల ఇప్పుడు ఇదే సరైన తరుణం, ఈ ఆంక్షల బిల్లును ఆమోదిస్తే చైనా,భారత్,బ్రెజిల్ దేశాలకు ప్రోత్సాహకాలు ఇవ్వవచ్చు, రష్యా నుండి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేయకుండా వారిని అడ్డుకోవచ్చు'' అని చెప్పారు. అమెరికా కాంగ్రెస్‌లో అధికార ప్రతిపక్షాలన్నింటినీ ఏకం చేసి అందరి ఆమోదంతో బిల్లుకు చట్టరూపం తీసుకురాగలమన్న బలమైన ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుండి తాము చమురు కొనుగోళ్ళను బాగా తగ్గించేశామని, ఈ విషయం ట్రంప్‌కు తెలియజేసి భారత్‌పై విధించిన సుంకాల భారం తగ్గించాలని అమెరికాలో ఉన్న భారత రాయబారి వినయ్ కత్వా చెప్పారని వారం రోజుల క్రితం గ్రాహం ప్రకటించారు.



చైనా,భారత్,బ్రెజిల్ దేశాలే ప్రధానంగా రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగించడానికి పరోక్ష సహాయం చేస్తున్నాయని, ఈ దేశాలను కట్టడిచేసి రష్యా ఆర్థిక వనరుల మార్గాలను మూసివేస్తామని గడచిన ఆదివారం ఎయిర్‌ఫోర్స్–1లో వాషింగ్టన్‌కు వస్తూ ట్రంప్ పాత్రికేయులకు చెప్పారు. ఆ సమయంలోనే లిండ్‌స్లే గ్రాహం ఈ ఆంక్షల బిల్లు గురించి చెప్పారు. ఇప్పటికే ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ప్రపంచంలో ఏ దేశంపైనా ఇంత ఎక్కువ సుంకాలను అమెరికా వసూలు చేయడంలేదు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానాగా 25 శాతం సుంకాలు భారత్‌పై వసూలు చేస్తోంది.

## కొలంబియా అధ్యక్షుడికి ట్రంప్ ఫోన్

### చర్చలకు రావాలని ఆహ్వానం



**వాషింగ్టన్:** నిన్నటిదాకా కొలంబియాను బెదిరించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంతలోనే స్వరం మార్చారు. చర్చలకు రావాలని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోకు గురువారం ఆహ్వానం పలికారు. ''చర్చిద్దాం వైట్‌హౌస్‌కు రండి'' అని పెట్రోను ఆహ్వానించి ప్రపంచదేశాలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. కొలంబియా అధ్యక్షుడితో తాను ఫోన్‌లో మాట్లాడానని ట్రంప్ సోషల్ మీడియా వేదిక ''ట్రూత్ సోషల్'' ద్వారా వెల్లడించారు. గడచిన వారం రోజులుగా ఉద్రిక్తతలకు దారితీసిన విషయాలు కూడా తమ ఫోన్ సంభాషణలో చోటు చేసుకున్నాయని ఆయన చెప్పారు. తమ మధ్య ఉన్న పరస్పర భిన్నాభిప్రాయాల గురించి కూడా మాట్లాడుకున్నామన్నారు. ''కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోతో ఫోన్‌లో సంభాషించడం తనకు ఒక గొప్ప గౌరవం, మాదక ద్రవ్యాల సమస్యవల్ల తలెత్తిన పరిస్థితులు, ఆ దేశంతో ఉన్న ఇతర భిన్నాభిప్రాయాల గురించి మాట్లాడా, సవివరంగా ఈ సమస్యపై చర్చించేందుకు వైట్‌హౌస్‌కు రావాలని ఆహ్వానించా'' అని చెప్పారు. ''అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో, కొలంబియా విదేశీమంత్రిత్వశాఖాధికారులు వైట్‌హౌస్‌లో త్వరలో జరిగే చర్చలకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేస్తారు'' అని ట్రంప్ పేర్కొన్నారు.

వెనిజులాపై దాడి చేశాక తదుపరి లక్ష్యం కొలంబియా, మెక్సికో,క్యూబా దేశాలేనని ట్రంప్ ప్రకటించిన తర్వాత గుస్తావో పెట్రో కూడా ట్రంప్‌కు ప్రతిసవాలు చేశారు. దేశకోసం, దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడంకోసం తాను తిరిగి ఆయుధాలు చేపడతానని ఒకనాటి గెరిల్లా పోరాట యోధుడు పెట్రో ప్రకటించారు. ఈ పరస్పర విమర్శల ఉద్రిక్త వాతావరణం మధ్య మాదక ద్రవ్యాల సమస్యపై చర్చిద్దాం రండి'' అని ఆహ్వానించారు. ''కొలంబియా ఆర్థికంగా మంచానపడిన దేశం, ఆ దేశానికి ఒక రోగిష్ఠి పాలకుడు అధ్యక్షుడుగా ఉన్నాడు, ఆ దేశాధ్యక్షుడు స్వయంగా కొకైన్ అక్రమ వ్యాపారం చేస్తున్నాడు'' అని వెనిజులాపై దాడి ఘటన తర్వాత గుస్తావో పెట్రోపై ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు.

65 ఏళ్ళు వయసుగల గుస్తావో పెట్రో కొలంబియాకు 2022నుండి అధ్యక్షుడుగా ఉన్నారు. లాటిన్ అమెరికా దేశాలపై అమెరికా పన్నాగాలను ఆయన ఎండగడుతూనే ఉంటారు. వెనిజులాపై దాడి జరిగిన తర్వాత ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసి తక్షణం భద్రతామండలి సమావేశం ఏర్పాటు చేయించారు. ఆయన నాస్తిక వాది. 17 ఏళ్ళ చిరుప్రాయంలోనే ఆయుధాలు చేపట్టిన గెరిల్లా యోధుడు.

## కూలీలుగా మారాలా? 

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగిస్తూ నిబంధనల మార్పు ముసుగులో మహాత్మా నరేగా పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. 'అధికారం ఉందని ప్రధాని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం. మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిది. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది' అన్నారు. పేదలపై కక్షతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా? అని సిఎం ప్రశ్నించారు. కేంద్రం తెచ్చిన నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదలలేదని, ఇప్పుడు ఉపాధి హామీ చట్టం విషయంలోనూ ప్రధాని క్షమాపణ చెప్పాల్సిందేనని సిఎం డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని బిజెపి నేతలు ప్రచారం చేశారని, అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారని, తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారని, కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారని, విమర్శించారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో బిజెపి 240 సీట్ల వద్ద ఆగిపోయిందని, దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్‌ఐఆర్ తీసుకొచ్చారని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని సిఎం హెచ్చరించారు.

**సామ్రాజ్యవాదుల కంటే బిజెపి ప్రమాదకరం: డిప్యూటీ సిఎం**

''భారతదేశ స్వాతంత్రం కోసం గాంధీజీ నాయకత్వంలో దేశంలో అనేక పోరాటాలు, ఆందోళన జరిగితే సామ్రాజ్యవాదులైన బ్రిటిష్ పాలకులు ఏ ఒక్క రోజు గాంధీజీ పై లాఠీ కూడా ఎత్తలేదు. అలాంటిది స్వాతంత్రం వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే పట్టపగలు ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులు గాంధీజీని కాల్చి చంపారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కంటే ఆర్‌ఎస్‌ఎస్ భావజలం కలిగిన బిజెపి ఈ దేశానికి అత్యంత ప్రమాదకరం''అని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఉపాధి చట్టం దానివల్ల జరిగే నష్టాలు గ్రామ గ్రామాన వివరించాలి, కొత్త ఉపాధి హామీ చట్టం రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలి కొత్త ఉపాధి హామీ పథకం రద్దు ఉద్యమంలో రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలందరూ పాల్గొంటారని డిప్యూటీ సీఎం చెప్పారు.

రాష్ట్రంలోని ప్రజలందరికి వివరించాలన్నారు. కొత్త ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతున్న మొట్టమొదటి ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎఐసిసి సూచన మేరకు జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకిస్తూ నిరసనలు ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. సంక్రాంతి తర్వాత 20 నుంచి 30 వ తేదీల్లో అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని, కరపత్రాలు నిర్వహించాలన్నారు.

## ఎసిబికి చిక్కిన ఎస్ఐ

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఒక హోటల్‌లో ఎస్ఐని ఎసిబి అధికారులు పట్టుకున్నారు. పేకాట కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని వేధిస్తూ కేసును తేలిక చేయాలంటే డబ్బులు ఇవ్వాలని ఎస్ఐ శ్రీకాంత్ లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ట్రాప్ నిర్వహించారు.

## మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అభివృద్ధి పేరిట అక్కడ జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై అలుపెరగని పోరాటం చేశారు. పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషికిగానూ 2024 ఏడాదికి సంబంధించి ఐక్యరాజ్యసమితి (ఐరాస) అత్యున్నత పర్యావరణ పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్' ఆయనకు వరించింది. ఇప్పుడు ఆయన మృతితో దేశ పర్యావరణ రంగంలో ఓ శకం ముగిసిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## కెసిఆర్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా వారు కెసిఆర్‌కు 'జాతర ఆహ్వాన పత్రిక' ను అందజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసి జాతర అయిన మేడారం మహా జాతరకు తప్పనిసరిగా రావాలని వారు కెసిఆర్, ఆయన సతీమణి శోభమ్మను ఆహ్వానించారు. అలాగే ఆలయ ప్రసాదమైన బంగారం, నూతన వస్త్రాలను వారు కెసిఆర్ దంపతులకు బహుకరించారు. కాగా మంత్రులు సీతక్క, కొండాసురేఖకు కెసిఆర్, శోభ దంపతులు పసుపు, కుంకుమ, వస్త్రాలు, తలంబ్రాలతో సంప్రదాయ రీతిలో సత్కరించారు. కొద్దిసేపు పరస్పర యోగక్షేమాలు అడిగి తెలసుకున్నారు. కెసిఆర్‌ను కలిసిన తర్వాత మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా భక్తుల కోరికలు తీర్చే తల్లుల జాతర మేడారమని, ఈ మహాజాతరకు కెసిఆర్‌ను సతీసమేతంగా రావాలని ఆహ్వానించామని, తమ ఆహ్వానాన్ని స్వీకరించి, జాతరకు వస్తానని కెసిఆర్ చెప్పినట్లు వెల్లడించారు.

## అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందజేత

### 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' లో బాలికలకు ప్రాధాన్యం

### విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్‌ఎస్) మొదటి విడతలో పూర్తయ్యే వాటిలో బాలికలకు ఎక్కువ స్కూల్స్ కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలోనూ బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున వైఐఐఆర్‌ఎస్‌ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం బాలికలకు స్కూల్స్ కేటాయించిన నియోజకవర్గంలో మరో విడతలో బాలురకు కేటాయించాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం సాయంత్రం విద్యా శాఖపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వైఐఐఆర్‌లో సోలార్ కిచెన్ల నిర్మాణాన్ని సిఎం కుసుమ్‌లో చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని సిఎం అధికారులకు సూచించారు. వైఐఐఆర్‌ఎస్‌ల నిర్మాణాలకు సంబం ధించి బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని సిఎం ఆదేశించారు.

ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలలో స్వచ్ఛంద సంస్థల ద్వారా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని తెలంగాణ వ్యాప్తంగా అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సిఎం ఆదేశించారు. తగినంత స్థలం, అవసరమైన మద్దతు అందజేస్తే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయగలమని అక్షయపాత్ర ప్రతినిధులు సిఎంకు తెలియజేశారు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి అందరికీ సకాలంలో భోజనం అందేలా ప్రణాళికలు రూపొందించాలని సిఎం అధికారులను ఆదేశించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయింపు లేదా 99 సంవత్సరాలకు లీజు తీసుకునే అంశంపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడి త్వరగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 నూతన పాఠశాల భవనాల నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాచుపల్లి పాఠశాల స్థలం కేవలం అర ఎకరం మాత్రమే ఉండడంపై సిఎం ఆరా తీశారు. ఎక్కడైనా పాఠశాలకు కనీసం ఎకరన్నర స్థలం ఉండాలని, బాచుపల్లి ప్రస్తుతం ఉన్న స్థలం సమీపంలో ఎకరన్నర ఆ పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని సిఎం ఆదేశించారు.

ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్ మార్పుపై కసరత్తును వెంటనే ప్రారంభించాలని సిఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం పనులు వేగవంతం చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో నూతన కోర్సులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకున్నందున దానిని త్వరగా అమలయ్యేలా చూడాలని సిఎం ఆదేశించారు.

పాలిటెక్నిక్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉద్యోగం లభించేలా సిలబస్, బోధన ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవ రావు, పి.సుదర్శన్ రెడ్డి, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సిఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సైలో వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత సన్న బియ్యం పంపిణీ, సన్నాలకు రూ 500 బోనస్ వంటి సంస్కరణలతో దేశవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిందన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో భారత ఆహార సంస్థ,రాష్ట్ర పౌర సరఫరాల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా కేంద్రప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వంపైన నెట్టేసి మిల్లింగ్ అయిన బియ్యాన్ని కేంద్రం కొనుగోలు చేయడంతో కొనుగోలుకు మిల్లింగ్ కు మధ్యన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.5 వేల కోట్లు నష్ట పోతుందని వివరించారు. సైలో పద్ధతిని అమలులోకి తెస్తే రూ 5 వేల కోట్ల భారాన్ని అధిగమించడంతో పాటు రూ. 1,000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పద్ధతిని అమలులోకి తీసుకువాలని యోచిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సైలో పద్ధతిలో బియ్యం ,మొక్క జొన్న, సోయాబీన్ వంటి పంటలను కూడా నిల్వ చేసుకునే ఆస్కారం ఉంటుందన్నారు. చేతికొచ్చిన పంట భద్రతకోసం ఆధునిక పరిజ్ఞానంతో నిలువ చేసేందుకు రూట్ మ్యాప్ రూపొందిస్తున్నామని. తద్వారా రైతుకు భరోసా కల్పించడంతో పాటు ఆహార భద్రతను పెంపొందించడం సులభమవుతుందని వివరించారు. యావత్ భారత దేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలువడంతో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని పరిరక్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకు పంపడంతో మిల్లింగ్‌లో జరుగుతున్న జాప్యంతో ధాన్యం చెడి పోయి నష్టం వాటిల్లుతుందని,మిల్లులలో శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేసే అవకాశం లేక పోవడంతోటే ఈ నష్టం జరుగుతుందన్నాని వివరించారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో పద్ధతిలో ఉండే డ్రైయర్ల ద్వారా తేమను తొలగించడంతో పాటు దాన్యన్ని దీర్ఘకలికాంగ పరిరక్షించుకోవచ్చన్నారు. పాత బియ్యానికి మార్కెట్‌లో అధిక ధర లభిస్తుందని, ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పుల ప్రభావం దేశవ్యాప్తంగా చూపుతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## విప్లవాత్మక మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రికి ఆయన సమగ్ర నివేదికను సమర్పించారు. తెలంగాణలో రవాణా రంగాన్ని బలోపేతం చేసేందుకు మంత్రి ప్రభాకర్ ప్రధానంగా మూడు విజ్ఞప్తులను కేంద్రానికి సమర్పించారు. రాష్ట్రంలో అత్యాధునిక డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐడిటిఆర్) ఏర్పాటు, రవాణా మౌలిక వసతుల కోసం రూ.175 కోట్ల ఎస్ఎఎస్‌సి నిధుల మంజూరు, మోటార్ వాహనాల చట్టంలో ప్రతిపాదిత సవరణలపై చర్చ. ఈ అంశాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందిస్తూ, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.

**భవిష్యత్ ప్రణాళికలు – విజన్ 2047**

రాష్ట్రంలో రోడ్ సేఫ్టీ క్లబ్‌లు, చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. విజన్ 2047 లో భాగంగా 5 లక్షల మంది నైపుణ్యం కలిగిన హెవీ వెహికల్ డ్రైవర్లను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైదరాబాద్ చుట్టూ ట్రక్ టెర్మినల్స్, అత్యాధునిక బస్ టెర్మినల్స్, పాస్‌పోర్ట్ ఆఫీసుల తరహాలో ఆధునిక ఆర్‌టిఓ కార్యాలయాలను నిర్మించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాల స్క్రాపింగ్ తప్పనిసరి చేస్తూ, పాత వాహనాల స్క్రాపింగ్‌పై పన్ను మినహాయింపులు ఇస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో 100 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే లక్ష్యం

కాలుష్యనివారణకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో దశలవారీగా కేవలం ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే తిరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మొదట ఆర్‌టిసి బస్సులను, ఆ తర్వాత టాక్సీలు, ఆటోలను ఈ విధానంలోకి మారుస్తారన్నారు. 2020లో రాష్ట్రంలో కేవలం 4,376 (0.03 శాతం) ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలు, 2024లో తెచ్చిన కొత్త ఈవీ పాలసీతో 2025 నాటికి 2,58,325 (1.42 శాతం) కి పెరిగాయన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇడి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఐప్యాక్ అధిపతి ప్రతీక్ జైన్ నివాసానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేరుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ టిఎంసికి సంబంధించిన అంతర్గత పత్రాలు, హార్డ్ డిస్కులు, ఎన్నికల వ్యూహానికి సంబంధించిన సున్నితమైన డేటాను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. తన ఐటి సెల్ ఇన్‌ఛార్జ్ అయిన జైన్ నివాసం, కార్యాలయాలపై జరిగిన ఈ దాడి రాజకీయ ప్రేరేపితం, రాజ్యాంగ విరుద్ధమమన్నారు. టిఎంసి అధినేత్రి కూడా అయిన బెనర్జీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మ అక్కడికి చేరుకున్న కొద్ది నిమిషాలకే మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో జైన్ నివాసానికి చేరుకున్నారు. ఆమె 20–25 నిమిషాల పాటు అక్కడే ఉండి, చేతిలో ఆకుపచ్చ ఫోల్డర్‌తో బయటకు వచ్చారు. ఇడి అధికారులు తమ ఐటి సెల్ ఇన్‌ఛార్జ్ నివాసం, కార్యాలయాలపై దాడి చేశారని, తమ పార్టీ పత్రాలు, హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకుంటున్నారు, వాటిలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పార్టీ అభ్యర్థుల వివరాలు ఉన్నాయని, తాను వాటిని తిరిగి తీసుకువచ్చానని మమతా బెనర్జీ విలేకరులతో చెప్పారు. అధికార పార్టీకి చెందిన హార్డ్ డిస్కులు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, అభ్యర్థుల జాబితాలు, అంతర్గత వ్యూహాత్మక పత్రాలను ఇడి అధికారులు తీసుకువెళ్లారని ఆమె ఆరోపించారు. రాజకీయ పార్టీల డేటాను సేకరించడం ఇడి విధినా? అని ఆమె ప్రశ్నించారు. టిఎంసికి రాజకీయ సలహాలు ఇవ్వడంతో పాటు, ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐప్యాక్) పార్టీ ఐటి, మీడియా కార్యకలాపాలను కూడా నిర్వహిస్తుంది. కాగా, నాయకత్వంపై తీవ్ర స్థాయిలో మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సోదాలను రాజకీయ కక్ష సాధింపు చర్యగా అభివర్ణించారు. ప్రతిపక్ష పార్టీలను బెదిరించడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. 'ఇది చట్టాన్ని అమలు చేయడం కాదు. దేశాన్ని రక్షించలేని, ఎన్నికలకు ముందు వేధించడానికి ఏజెన్సీలను పంపుతున్న ఈ అత్యంత నీచమైన, దుష్ట హోంమంత్రి ఇలాగేనా పనిచేసేది? అని ఆమె మండిపడ్డారు. సాల్ట్ లేక్‌లోని సెక్టార్ 5లో ఉన్న ఐప్యాక్ కార్యాలయంలో కూడా తెల్లవారుజాము నుండి ఇడి సోదాలు నిర్వహించింది. కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో ఉదయం 6 గంటల ప్రాంతంలో దాడులు ప్రారంభమయ్యాయని బెనర్జీ ఆరోపించారు. లోపల ఎవరూ లేనప్పుడు వారు సోదాలు ప్రారంభించారని, వారు మా డేటా, ఎన్నికల వ్యూహాలు, సమాచారాన్ని వారి సిస్టమ్‌లోకి బదిలీ చేశారని, ఇది ఒక నేరం అని, సెక్టార్ 5 కార్యాలయాన్ని సందర్శించిన తర్వాత ఆమె ఆరోపించారు. 'కార్యాలయం నుండి అన్ని పత్రాలను తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. ఆ పత్రాలను మళ్లీ తయారు చేయాలంటే చాలా సమయం పడుతుంది. అప్పటికి ఎన్నికలు కూడా ముగిసిపోతాయి. వారు ఇలా చేయడం న్యాయమేనా? అని ఆమె ప్రశ్నించారు. టిఎంసి ఒక రిజిస్టర్డ్ రాజకీయ పార్టీ అని, క్రమం తప్పకుండా ఆదాయపు పన్ను చెల్లిస్తుందని బెనర్జీ అన్నారు. తమకు ఎన్నికైన ప్రతినిధులు ఉన్నారని, ఇడికి ఏదైనా అవసరమైతే, వారు ఆదాయపు పన్ను శాఖ నుండి వివరాలు తీసుకోవచ్చని సూచించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపినాయకులకు నోటీసులు ఎందుకు పంపడం లేదని టిఎంసి అధినేత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'బిజెపి అతిపెద్ద దొంగల పార్టీ. బెంగాల్‌లోని బిజెపి పార్టీ కార్యాలయాలపై దాడులు చేసి ఇడి సోదాలకు మేము ప్రతీకారం తీర్చుకుంటే ఏం జరుగుతుంది; మేము సంయమనం పాటిస్తున్నాము. కానీ, మా సంయమనాన్ని మా బలహీనతగా భావించకూడదు' అని ఆమె అన్నారు. తమ ఎన్నికల వ్యూహం, ఎస్ఐఆర్ డేటా, ఇతర వివరాలను తీసుకున్నారని, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోయి, తాము మళ్లీ కొత్తగా ఎన్నికల ప్రణాళికలు రూపొందించాల్సి వస్తే, దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని పద్ధతి ప్రకారం బలహీనపరుస్తోందని బిజెపిపై ఆరోపించిన బెనర్జీ, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుండి పెద్ద ఎత్తున ఓటర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా 15 లక్షల మందికి పైగా పేర్లను తొలగించారని, ఓటర్లను తొలగించి, రాజకీయ పార్టీల ఐటి సెల్ కార్యాలయాలపై దాడులు చేయడం ద్వారా రాష్ట్రాన్ని స్వాధీనం చేసుకోవచ్చని వారు భావిస్తున్నారా? అని ఆమె అన్నారు. బెంగాల్‌ను గెలవాలనుకుంటే, మాతో రాజకీయంగా పోరాడాలని బిజెపికి సవాల్ విసురుతున్నానన్నారు. జైన్ వచ్చి తిరిగి పని ప్రారంభించే వరకు తాను ఐప్యాక్ కార్యాలయంలోనే ఉంటానని కూడా ఆమె తెలిపారు.

ఇడి దాడులకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రతి బ్లాక్‌లో నిరసనలు తెలియజేయాలని బెనర్జీ పార్టీ కార్యకర్తలను కోరారు. జైన్ తన కార్యాలయానికి వచ్చిన తర్వాత, ఆమె సాయంత్రం 4:14 గంటల ప్రాంతంలో ఐప్యాక్ కార్యాలయం నుండి బయలుదేరారు.

# త్యాగాల చరితకు వందేళ్లు

**ఖమ్మంలో ముగింపు ఉత్సవాలు**
**ట్రంప్‌కు భయపడుతున్న మోదీ**
**పోలవరం నిర్వాసితుల కోసం పోరాటం**
**సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ**




**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ త్యాగాల చరితకు వందేళ్లు నిండాయని, ఆవిర్భాల నుంచి నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు కె.రామకృష్ణ తెలిపారు. భూమి భుక్తి ప్రజల కోసం పోరాడిందని తెలంగాణ సాయుధ పోరాటంలో 4,500 మంది కార్యకర్తలు రక్తతర్పణం చేశారని ఆయన తెలిపారు. పోరాటాల పురిటిగడ్డ ఖమ్మంలో సిపిఐ శత వసంతాల ముగింపు వేడుకలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయని జనవరి 18న గొప్ప బహిరంగ సభ జరుగుతుందని 19న సిపిఐ జాతీయ కార్యవర్గం, 20న జాతీయ స్థాయి సెమినార్ జరుగుతుందని రామకృష్ణ తెలిపారు. గురువారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో ప్రస్తుత పరిస్థితులు వామపక్షం ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జనవరి 20న జరిగే సెమినార్‌లో ప్రధాన వామపక్షాల కార్యదర్శులు ఎంఏ బేబీ, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య సహా ప్రధాన వామపక్షాల నేతలు పాల్గొంటారన్నారు. ట్రంప్ బెదిరింపులకు మోదీ భయపడుతున్నాడని ఆయన ఏమి చెప్పినా సరే ఆనడం తప్ప సమాధానం చెప్పలేని స్థితిలో మోదీ ఉండడంతో భారతదేశ విలువలు ప్రపంచ వ్యాప్తంగా పడిపోతున్నాయని రామకృష్ణ తెలిపారు. అలీన దేశంగా కీర్తిగడించిన భారత్ మోదీ నాయకత్వంలో ట్రంప్‌కు తలవంచే పరిస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు. వెనిజులా అధ్యక్షుడు మధురో ఆయన భార్యను బంధిస్తే కనీసం నోరు విప్పలేని స్థితిలో దేశ ప్రధాని ఉన్నారని భవిష్యత్తులో ట్రంప్‌తో భారతదేశం సైతం ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి వస్తుందని రామకృష్ణ హెచ్చరించారు. చర్చల ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవచ్చునని రెండు ప్రభుత్వాలు కూర్చుని చర్చించుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు. వివాదాలకు పోవడం వల్ల రెండు రాష్ట్రాలు నష్టపోతాయని, ఇప్పటికే సముద్రంలో రెండువేల టిఎంసిలు కలుస్తున్నాయని బేషజాలకు పోకుండా పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా జల వివాదాలను పరిష్కరించుకోవాలని రెండు ప్రభుత్వాలు ఇందుకు పూనుకోవాలని రామకృష్ణ సూచించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తానని చెబుతున్న చంద్రబాబు నిర్వాసితులకు పరిహారం ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. 72 శాతం ప్రాజెక్టు పూర్తయిందని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని, కానీ పరిహారం చెల్లింపు మాత్రం 21 శాతం మాత్రమే జరిగిందని ఇలా ఎందుకు జరుగుతుందని రామకృష్ణ ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. పోలవరం ముంపు మండలాల్లో పర్యటించి త్వరలో పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**కార్పొరేట్ల కోసమే కగార్ :**
కార్పొరేట్ శక్తులకు ఖనిజ సంపదను కట్టబెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను తీసుకువచ్చిందని రామకృష్ణ ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను కాల్చి చంపుతున్నారని ఈ క్రమంలోనే హిడ్మాను కూడా ఆంధ్రప్రదేశ్‌లో కాల్చి చంపారని ఆయన తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మావోయిస్టుల కారణంగా రక్షించబడిన అటవీ సంపదను ఇప్పుడు కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రశ్నించే వారిని అర్బన్ నక్సలైట్ల పేరుతో నిర్బంధాలకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. బిజెపి నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడాల్సిన బాధ్యత వామపక్షాలతో పాటు అన్ని ప్రజాతంత్ర శక్తులపై ఉందని రామకృష్ణ తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, బిజి క్లెమెంట్, పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ముస్సిపల్ ఎన్నికలకు ఇసి సన్నాహాలు పూర్తి

### వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా షెడ్యూల్ విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసి) సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా ప్రచురణకు సంబంధించి కీలక షెడ్యూల్‌ను ఎస్‌ఈసి ఖరారు చేసింది. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా తయారీ, వార్డుల విభజన, పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉన్న 6 మున్సిపల్ కార్పొరేషన్లు (366 వార్డులు), 117 మున్సిపాలిటీలు (2,630 వార్డులు) పరిధిలో ఓటర్ల తుది జాబితా విడుదలకు ఈ షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు ఎస్‌ఈసి ప్రకటించింది. ఈమేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి వివరాలను వెల్లడించారు.
**వేడెక్కుతున్న రాజకీయం..** మున్సిపల్ ఎన్నికలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో ఎన్నికల సంఘం సమావేశాలు నిర్వహించింది. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవడంతో రాష్ట్ర రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. పార్టీ గుర్తులతో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి వంటి ప్రధాన పార్టీలన్నీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీల నేతలు క్షేత్రస్థాయిలో ప్రచారానికి దిగారు. ఈసారి మున్సిపల్ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పరిధిలో బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 124 మున్సిపాలిటీలు, 9 గ్రేటర్ కార్పొరేషన్లు ఉండగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగియనుంది. వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు సిద్దిపేట, జడ్చర్ల, కొత్తూర్, అచ్చంపేట, నకిరేకల్ మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు వచ్చే ఏడాది మే వరకు ఉంది. ఈ పది ప్రాంతాలను మినహాయిస్తే, మిగిలిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు ఈ ఏడాది జనవరిలోనే ముగియడంతో ప్రస్తుతం అక్కడ స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోంది. మొత్తం కలిపి 52.71 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు ముసాయిదా ఓటర్ల జాబితాను ఇప్పటికే ఎస్‌ఈసి విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తోంది.

**జనవరి 12, 2026 :** మున్సిపాలిటీ చట్టం–2019 (సెక్షన్ 195ఏ) ప్రకారం వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా ప్రచురణ.
**జనవరి 13, 2026 :** పోలింగ్ స్టేషన్‌ల వివరాల ముసాయిదా జాబితా విడుదల చేసి, టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్.
**జనవరి 16, 2026 :** ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను పోలింగ్ స్టేషన్‌ల వారీగా సంబంధిత మున్సిపల్ కమిషనర్లు అధికారికంగా ప్రచురిస్తారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
మెట్రోజోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్-63
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ స్పేస్ No.eMZ-37, eMZ-38 and eMZ-39 of 2025-26
టెండర్ నోటీస్ No.33/25-26 (పేపర్ నోటిఫికేషన్)
ఇ-టెండర్ కోసం అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించబడ్డాయి. ఓవర్‌లోడ్ యొక్క విభజన a) జనరల్ కేటగిరీ eMZ-37/25-26 కింద బంజారాహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ సర్కిల్ లోని 33/ KV కళ్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11 KV స్టేట్ హోమ్ ఫీడర్. b) eMZ-38/25-26 జనరల్ కేటగిరీ కింద 33/ KV అత్తాపూర్ సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11 KV హుడా కాలనీ ఫీడర్ మరియు c) హైదరాబాద్ సౌత్ సర్కిల్ చార్మినార్ డివిజన్‌లోని ఎస్‌టి రిజర్వ్ కేటగిరీ కింద eMZ 39/25-26 కింద 33/11 KV పేట్ల బురుజు SS నుండి వెలువడే 11/ KV హుస్సేనీఆలం ఫీడర్ T&D కింద అసలు పనులకు మెరుగుదలలు. దీనికి సంబంధించి ఏదైనా మరింత సమాచారం కోసం www.tender.telangan.gov.in మరియు www.tgsouthernpower.org వెబ్‌సైట్‌లను చూడగలరు.
సం/- చీఫ్ ఇంజినీర్, ఆపరేషన్, మెట్రో జోన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 13301-PP/CL/ADVT/1/2025-26, Date: 08-01-2026

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**
**అమరచింత మున్సిపాలిటీ, వనపర్తి జిల్లా, (టిఎస్)**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద 1 పని కొరకు టెండర్‌ను ఆహ్వానించడమైనది. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 09.01.2026న ఉ.10:30గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరి తేది:** 19.01.2026న సా.4:30గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. **బిడ్స్ ఆహ్వానించే కార్యాలయం:** కమిషనర్, అమరచింత మున్సిపాలిటీ, తెలంగాణ స్టేట్. ఫోన్: 9346048760, 7330690290.
సం/- కమిషనర్, అమరచింత మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 13316-PP/CL/ADVT/1/2025-26, Date: 08-01-2026

**శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం**
కీసరగుట్ట, కీసర (గ్రామం & మండలం), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
ఆర్.సి.నెం. 60/SLRSD/2025, తేదీ: 08.01.2026
మహాశివరాత్రి సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కీసర (గ్రామం & మండలం), కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ క్రింది పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించబడమైనది. మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 09.01.2026, బిడ్ డౌన్‌లోడ్ చివరి తేదీ (సమర్పణ): 23.01.2026.

| పని పేరు | అంచనా మొత్తం (లక్షలలో) |
|---|---|
| (05) రోజుల కాలానికి కొండ కింద తాత్కాలిక విద్యుత్ దీపాల ఏర్పాటు | 9.90 |
| (05) రోజుల కాలానికి కొండ పైన తాత్కాలిక విద్యుత్ దీపాల ఏర్పాటు | 9.90 |
| (05) రోజుల కాలానికి తాత్కాలిక పందిళ్ల (చలువ పందిళ్లు) ఏర్పాటు | 9.90 |

సం/- కార్యనిర్వహణాధికారి
సెల్ నెం: 9491000699
DIPR R.O. No. : 13332-PP/CL/ADVT/1/2025-26, Date: 08-01-2026

## సిపిఐ వంద సంవత్సరాల చరిత్ర మహోన్నతమైనది



**సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా 'జనసేవాదళ్ భారీ కవాతు'**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసమానత, దోపిడీ, మతతత్వం, కార్పొరేట్ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రతరం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ పిలుపునిచ్చారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా 'జనసేవాదళ్ భారీ కవాతు' నిర్వహించనున్న నేపథ్యంలో హైదరాబాద్, నారాయణగూడలో 'సిపిఐ జనసేవా దళ్ శిక్షణ కార్యక్రమాన్ని' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సిపిఐ పతాకాన్ని ఈ.టి. నరసింహ గురువారం ఆవిష్కరించి, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
అనంతరం ఈ.టి నరిసంహ మాట్లాడుతూ వలసవాద వ్యతిరేక ప్రతిఘటన, రాజీలేకుండా కార్మికులు, రైతుల చేపట్టిన పోరాటాల ద్వారా నిర్మించిన సిపిఐ వంద సంవత్సరాల చరిత్ర మహోన్నతమైనదని వివరించారు. శతాబ్ది అంటే కేవలం ఒక చరిత్ర గురించి మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు, సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని మరింతగా పెంచుకునేందుకు, మతతత్వం, ఫాసిజం, అసమానత శక్తులను ప్రతిఘటించేందుకని ఆయన చెప్పారు. కార్మికులు, రైతులు, మహిళలు, అణగారిన వర్గాల గొంతుకగా ఎర్ర జెండా సమానత్వం, లౌకికవాదం, గౌరవం కోసం నిలుస్తుందన్నారు. ఈ శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటం, ప్రజల జీవనోపాధి కోసం బలమైన పోరాటాలు కొనసాగిస్తూనే ఉండాలని సూచించారు.
సిపిఐ శతాబ్ది ముగింపు సందర్భంగా ఈనెల 18న ఖమ్మం నగరంలో లక్షలాదిమందితో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నరసింహ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్. ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నెర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, షంషుద్దీన్, హైదరాబాద్ జిల్లా సమితి శక్రి భాయ్, ఆరుట్ల రాజ్ కుమార్, జనసేవాదళ్ శిక్షకులు మేకల శ్రీనివాస్, మారుపాక అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెనిజులా అధ్యక్షుడిని వెంటనే విడుదల చేయాలి




**కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వెనిజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను అమెరికా అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే వారిని విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని ఖండిస్తూ గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.బాల్‌రాజ్(ఎఐటియుసి), పాలడుగు భాస్కర్(సిఐటియు), జె.వెంకటేష్, విజయ్‌కుమార్ యాదవ్(ఐఎన్‌టియుసి), అంజాద్(హెచ్‌ఎమ్‌ఎస్), అనురాధ(ఐఎఫ్‌టియు), ప్రవీణ్(టియుసిఐ), శ్రీనివాస్(బిఆర్‌టియు) తదితరులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల సరఫరా తదితర అభియోగాలు మోపి, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా అమెరికా సైన్యం వెనిజులా భూభాగంలోకి చొరబడి మదురోతో పాటు ఆయన భార్యను అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. వెనిజులాలో ఉన్న చమురు నిక్షేపాలను దోచుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ విధమైన చర్యలు అవలంభించడం తగదని హెచ్చరించారు. కొలంబియా, వియత్నాం, క్యూబా, నికరగువా, మెక్సికో దేశాలపై కూడా ఇలాగే దాడులు కొనసాగించిందని, ప్రపంచ దేశాలు అమెరికా సామ్రాజ్యవాద విదానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. భారత ప్రధాని మోదీ మౌనం వీడి, వెనిజులాకు మద్దతు తెలిపాలని, మధ్యవర్తిత్వం వహించి వెంటనే మదురోతో పాటు ఆయన భార్యను విడుదల చేసేలా ప్రయత్నాలు జరపాలని సూచించారు.

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..
**చలో ఖమ్మం**

**2026 జనవరి 18**
**సిపిఐ శతవార్షికోత్సవ సభకు**
**వేలాదిగా తరలి రండి!**

## 1933–1943 పార్టీ చరిత్రలో మైలు రాళ్ళు

1925 డిసెంబర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక మహాసభ కాన్పూర్‌లో జరిగి అఖిలభారత పార్టీ ఏర్పడినా బ్రిటీష్ వలసపాలన సాగుతున్న ఆ రోజుల్లో పార్టీ లీగల్, సెమీలీగల్ పరిస్థితుల్లో పనిచేయాల్సి వచ్చింది. అంటే పార్టీపై నిషేధం పూర్తిగా, పాక్షికంగా ఉండేది. నిరంతరం పోలీసు నిఘా కింద పనిచేయాల్సి వచ్చేది. అందువల్ల 1942 జులైలో సిపిఐపై నిషేధం ఎత్తివేసిన తదుపరిగాని 1943 మే–జూన్‌లో బొంబాయిలో పార్టీ తొలి కాంగ్రెస్ (జాతీయ మహాసభ) జరుపుకునే అవకాశం లభించలేదు. అయితే పార్టీ అనుభవాల నుండి నేర్చుకుంటూ తప్పులు దిద్దుకుంటూ 1940వ దశకంనాటికి బలపడింది. తగినంత పరిపక్వత సాధించింది. పార్టీ చరిత్రలో అది చారిత్రక కాలం కూడా. ఆ కాలాన్ని అతి సూక్ష్మంగా అవలోకించుదాం.

మీరట్ కుట్ర కేసు (1929–33)లో 31మంది అత్యంత ప్రముఖ, అనుభవజ్ఞులైన కమ్యూనిస్టు – కార్మిక నాయకులను బ్రిటీష్ ప్రభుత్వం నిర్బంధించింది. నెహ్రూ, ఇతర జాతీయవాద నాయకులు వారి తరఫున వాదించారు. మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన డిఫెన్స్ కమిటీ ఏర్పడింది. బోనులో నుంచి బ్రిటీష్ పాలకులను బోనులో నిలబెడుతూ కమ్యూనిస్టు నాయకులు చేసిన వాదనలు దేశంలో కమ్యూనిస్టు భావాల వ్యాప్తికి, పార్టీ నిర్మాణానికి దోహదం చేశాయి. గాంధీజీ సైతం ఖైదీలను కలుసుకున్నారు. మీరు కోరినట్లు సంపూర్ణ స్వాతంత్ర్యం తీర్మానాన్ని లాహోర్ కాంగ్రెస్ సభలో ఆమోదించబోతున్నామని గాంధీ చెప్పారు. మనమధ్య ఇంకా భేదాభిప్రాయాలేమున్నాయి? అని ప్రశ్నించారు. "రానున్న ఉద్యమం క్రమంలో మరో చౌరాచౌరీ జరిగితే మీరేం చేస్తారు? ఉద్యమం ఉపసంహరిస్తారా? అని డాంగే ప్రశ్నించగా, గాంధీజీ ఒక నిమిషం ఆలోచించి, "లేదు" అని సమాధాన మిచ్చారు. ఈ కుట్ర కేసు ఖైదీల్లో అత్యధికులు 1933 చివరకు విడుదలైనారు. ఈలోపు, కమ్యూనిస్టు గ్రూపుల మధ్య సంబంధాలు లేక, గైడ్ చేసే పరిపక్వ నాయకత్వం లేక సిపిఐ నిర్మాణం, రాజకీయ రీత్యా భారీ నష్టాలకు గురైంది. అనేక గ్రూపులు ఏర్పడి తమ సొంత త్రోవలో పనిచేయసాగాయి. మీరట్ ఖైదీల విడుదల తదుపరి 1933 డిసెంబర్‌లో కలకత్తాలో చెల్లాచెదురైన పార్టీ గ్రూపుల చిన్న సమావేశం జరిగింది. ఆ సమావేశంలో తాత్కాలిక కేంద్ర కమిటీ ఎన్నుకున్నారు. ఘాటే జైల్లో ఉన్నందున డా.అధికారిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కొద్ది నెలలకే ప్రభుత్వం అధికారిని అరెస్టు చేయటంతో, మిరాజ్‌కార్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆయన్ను సింగపూర్‌లో అరెస్టు చేయటంతో, సోమనాథ్ లాహిరి బొంబాయి వెళ్లి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారు.

సంవత్సరం లోపు ఆయన్నూ అరెస్టు చేశారు. 1935 డిసెంబర్ – 1936 జనవరిలో సూరత్‌లో జరిగిన సమావేశంలో పి.సి.జోషిని ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

సిపిఐ బహుముఖ అభివృద్ధి, శీఘ్రతర వృద్ధికి అది నూతన దశను ప్రారంభించింది. జాతీయోద్యమంతో, కాంగ్రెస్‌తో సంబంధాలు ఎంతో మెరుగైనాయి. పార్టీ ముఖ్యమైన జాతీయ శక్తిగా అవతరించింది.

* కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) ఏర్పాటులో, కార్యకలాపాల్లో సిపిఐ కీలక భూమిక పోషించింది. సిఎస్‌పి 1934లో పాట్నాలో జాతీయోద్యమ వేదికగా ఉన్న కాంగ్రెస్‌లోపల ఏర్పాటైంది. అది కమ్యూనిస్టులు, సోషలిస్టులు, అతివాద కాంగ్రెస్‌వాదులు, ఇతర జాతీయవాదుల ఐక్యవేదికగా పనిచేసింది.

* 1936 'మరీ ముఖ్యమైన సంవత్సరం. ఎఐకెఎస్ (అఖిలభారత కిసాన్ సభ), ఎఐఎస్‌ఎఫ్ (అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్), పిడబ్ల్యుఎ (అభ్యుదయ రచయితల సంఘం) ఆ సంవత్సరంలో ఏర్పడ్డాయి. ఈ సమష్టి ప్రజాసంఘాల ఏర్పాటులో జోషీ కీలకపాత్ర పోషించారు. అదే కాలంలో కళాకారులు, రచయితలు, రంగస్థల, సినిమా వర్కర్స్, కళాకారులు, సాహితీవేత్తలు, చరిత్రకారులు, శాస్త్రవేత్త లు, మహిళలను కమ్యూనిస్టు భావాలు ఆకర్షించాయి. బాల సంఘాలు సైతం ఏర్పడ్డాయి.

* 1936 జులైలో ఆల్ ఇండియా స్టేట్స్ (రాజసంస్థానాల) పీపుల్స్ కాన్ఫరెన్స్ లక్నోలో నిర్వహించబడింది. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పార్టీ అనే ప్రతిష్టను సిపిఐ సంతరించుకుంది. ఎస్.ఎ.డాంగే, ఆర్‌డి భరద్వాజ్, అజయ్‌ఘోష్,

ఇఎంఎస్ నంబూద్రిపాద్, ఎస్.జి. సర్దేశాయి, పి.సుందరయ్య, సి.రాజేశ్వరరావు, భవానీసేన్, కల్పనాదత్, సింగారవేలు, ఎస్‌విఘాటే, అమీర్ హైదర్ ఖాన్, సోమనాథ్‌లాహిరి, ఇంకా అనేక మంది జాతీయ రాజకీయ రంగంలో వెలుగులోకి వచ్చారు.

* సిపిఐ స్వతంత్ర వైఖరిని, నిర్మాణాన్ని నిలుపుకుంటూనే కాంగ్రెస్‌లో చేరి పనిచేయాలన్న నిర్ణయం మంచి ఫలితాలనిచ్చింది. అనేక పిసిసిల్లో, ఎఐసిసిలో కమ్యూనిస్టులు ముఖ్యమైన పదవుల్లోకి వచ్చారు. వివిధ రాజకీయ సైద్ధాంతిక, సంస్థాగత అంశాలపై పి.సి.జోషీ–గాంధీజీ మధ్య సంవత్సరంపాటు (1943–44) మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు గాంధీ–జోషీ కరస్పాండెన్స్ ఈ సందర్భంగా ప్రసిద్ధం. మార్క్సిజం–గాంధీయిజం మధ్యనున్న తీవ్రమైన భేదాభిప్రాయాలను, అలాగే ఏకీభావాంశాలను అది ప్రతిబింబించింది.

* సోహన్‌సింగ్ జోష్ ప్రచురిస్తున్న కీర్తి (1926) పత్రికలో పనిచేస్తుండగా భగత్‌సింగ్ శాస్త్రీయ సోషలిజం ప్రభావంలోకి వచ్చారు. ఆయన ఆ తర్వాత ఎస్.జి.సర్దేశాయి తదితర కమ్యూనిస్టు నాయకులను కలుసుకున్నారు. అజయ్‌ఘోష్ ఆయనకు అత్యంత సన్నిహితుడు. భగత్‌సింగ్ ఏర్పాటు చేసిన హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ (అసోసియేషన్ కూడా) పేరులో ఆయన ఒత్తిడిపైన 'సోషలిస్టు' అనే పదం చేర్చారు.

* 1933–34 నాటికి, విప్లవకారులు, స్వాతంత్ర్య యోధులు, కమ్యూనిస్టులు పెద్ద సంఖ్యలో అండమాన్స్‌లోని సెల్యులార్ జైలుకు పంపబడ్డారు. వారిలో అత్యధికులు జుగాంతర్, అనుశీలన్ గ్రూపులకు చెందినవారు, కమ్యూనిస్టులు. దాదాపు 400 మంది ఖైదీలతో 1935లో అండమాన్స్ జైల్లో 'కమ్యూనిస్టు కన్సాలిడేషన్ కమిటీ' ఏర్పడింది.

బటుకేశ్వర్ దత్, విజయ్‌కుమార్ సిన్హా, శివ వర్మ, ధన్వంతరి, విశ్వనాథ్ మాథుర్, గణేశ్ ఘోష్ తదితర ప్రసిద్ధులు ఆ కమిటీలో ఉన్నారు. అక్కడ ఖైదీలకు కమ్యూనిజంలో శిక్షణా తరగతులు జరిగాయి. 1937లో ప్రధాన భూభాగంలోకి విడుదలైన ఖైదీల్లో చాలామంది ఆ తర్వాత సిపిఐలో చేరారు.

* రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం మరో మలుపు. 1939 సెప్టెంబర్ 1న పోలెండ్‌పై జర్మనీ దాడితో అది ప్రారంభమైంది. హిట్లర్ ఫాసిస్టు శక్తులు 1941 జూన్ 22న తొలి సోషలిస్టు రాజ్యం సోవియట్ యూనియన్‌పై పెద్ద ఎత్తున దాడిచేశాయి. దాంతో యుద్ధ స్వభావం మారిందన్న అంచనాకు వచ్చిన సిపిఐ ఫాసిస్టు వ్యతిరేక ప్రజా యుద్ధానికి పిలుపు ఇచ్చింది.

బ్రిటీష్‌వారు రష్యా, అమెరికా, ఫ్రాన్స్‌లతో మిత్ర రాజ్యకూటమి భాగస్వామిగా ఫాసిస్టు శక్తులతో పోరాటంలో ఉన్నందున ఇక్కడ మనదేశంలో బ్రిటీష్ యుద్ధ కృషికి ఎటువంటి ఆటంకం కలిగించరాదనేది ఆ పంథా. అయితే ఇది ఆచరణలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం మనదేశ ప్రజలు పోరాడుతున్న నేపథ్యంలో కమ్యూనిస్టుల నిజాయితీపై అపార్థాలకు దారితీసింది. ఆవిధంగా పార్టీపై మితవాదులు నిందా ప్రచారం చేశారు.

ఆ పంథా పార్టీకి నష్టం చేసింది. ముందు ఫాసిస్టు శక్తులను ఓడిద్దాం, ఆ తర్వాత బ్రిటీష్ వారిని ఓడిద్దామన్న పంథాను పార్టీ 1942–43లో స్టాలిన్‌గ్రాడ్ పోరాటంలో హిట్లర్ సైన్యాలను ఎర్రసైన్యం ఓడించాక మార్చుకుంది. 1934లో నిషేధించబడిన సిపిఐపై బ్రిటీష్ వలసపాలకులు 1942 జులైలో ఎత్తివేశారు.

రెండవ ప్రపంచ యుద్ధం యూరప్‌లో 1945 మే 8న ముగిసింది. కాగా హిరోషిమా, నాగసాకీలపై ఆగస్టు 6,9 తేదీల్లో అమెరికా అణుబాంబులు వేశాక–సెప్టెంబర్ 2న జపాన్ లొంగుబాటు ఒడంబడికపై సంతకం చేయటంతో ఆ యుద్ధం ముగిసినట్లైంది.

ఈలోపు మనదేశంలో 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమం సాగింది. కాంగ్రెస్ నాయకులందరినీ ప్రభుత్వం జైళ్లలో పెట్టినా, సిపిఐ నాయకురాలు అరుణా అసఫాలీ ఆగస్టు 9న బొంబాయి ఆజాద్ మైదాన్‌లో జాతీయ జెండా ఎగురవేశారు. అయినా కాంగ్రెస్‌లోని మితవాదులు సిపిఐపై దుష్ప్రచారం కొనసాగించారు.

* ఇదిలా వుండగా, సిపిఐ బహిరంగంగా పనిచేస్తున్న పరిస్థితుల్లో 1943 మే 23 నుంచి జూన్ 1వరకు తన తొలి కాంగ్రెస్‌ను కోలాహలంగా–ఒక సాంస్కృతి కోత్సవంలాగా బొంబాయిలో జరుపు కుంది. ఈ సందర్భంగానే, మే నెలలో బొంబాయిలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ (ఇప్టా – ప్రజానాట్యమండలి) ఏర్పడింది. పార్టీని క్యాడర్ పార్టీ నుంచి మాస్ పార్టీగా అభివృద్ధి చేయాలని ఈ కాంగ్రెస్ తొలిసారి పిలుపునిచ్చింది.

పార్టీ కాంగ్రెస్ 22మందితో సెంట్రల్ కమిటీని, ముగ్గురితో (పిసి జోష్, డాక్టర్ అధికారి, బిటి రణదివె) పోలిట్ బ్యూరోను ఎన్నుకుంది. ప్రధాన కార్యదర్శిగా పి.సి.జోషిని ఎన్నుకుంది.

*1943–1948 మధ్యకాలంలో చరిత్రాత్మకమైన కయ్యూరు. తెలంగాణ, పున్నప్ప–వాయిలార్, తేభాగ పోరాటాలు చేబట్టి అనన్య త్యాగాలు చేసింది. వాటి గూర్చి రేపు తెలుసుకుందాం.*

— ఎమ్మెస్సార్



డా.అధికారి | మిరాజ్‌కార్ | సోమనాథ్‌లాహిరి | పి.సి.జోషి




### బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు
## అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువుల పైన జరుగుతున్న దాడులను అరికట్టాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ డిమాండ్ చేశారు. తక్షణమే మోదీ ప్రభుత్వం సంకుచిత రాజకీయాలు వీడి, అక్కడున్న హిందువులకు రక్షణ కల్పించాలంటే ఆదేశ హై కమిషనర్,పాలకులతో మాట్లాడి దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హైదరాబాద్‌లోని మార్వెల్ ఫంక్షన్ హాల్ నుండి వైఎంసిఎ నారాయణగూడ వరకు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన షేక్ హసీనా ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేశారని, తద్వారా హసీనా దేశం విడిచి పారిపోయే పరిస్థితి నెలకొన్నదని, తాత్కాలిక ఏర్పాడిన యూనిస్ ప్రభుత్వం వల్ల శాంతియుత వాతావరణం నెలకొంటుందని అందరూ బావిస్తే, అందుకు భిన్నంగా కొన్ని మతశక్తుల ప్రమేయంతో నిరంతరం మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని దుయ్యబట్టారు. రాజకీయ ప్రత్యర్థులపైన ,పత్రికా కార్యాలయాలపైన కూడా దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. మైనార్టీ వర్గాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని నరసింహ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జన సేవాదళ్ సబ్ కమిటీ సభ్యులు మేకల శ్రీనివాసరావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపెల్లి శ్రీనివాస్, షేక్ శంషుద్దీన్, హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొమురెల్లి బాబు, చెట్టుకింది శ్రీనివాస్, ఆరుట్ల రాజ్ కుమార్,జెరిపోతుల కుమార్, కాశన్న సైఫ్,చైతన్య, నరసింహ, కళ్యాణ్, అనిల్,రాజు,హైమద్,కృష్ణ, అరుణ్, ఉదయ్, సుమన్,భగత్‌సింగ్,గౌస్, అరుణ్, భాను, రేవంత్, రాహుల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## 'టెలిమెట్రీల' ఏర్పాటు వేగవంతం చేయండి : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కృష్ణా జలాల వినియోగ లెక్కలు తేల్చేందుకు టెలిమెట్రిల కోసం కేటాయించిన రూ.4.18 కోట్ల నిధులను కెఆర్‌ఎంబి దారి మళ్లిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జూన్ 2016లో జరిగిన కెఆర్‌ఎంబి సమావేశ నిర్ణయం ప్రకారం మొదటి దశలో 18 చోట్ల టెలిమెట్రి పరికరాలను ఏర్పాటు చేయగా, రెండో దశలో మరో 9 చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికి ఇప్పటి వరకు అమలు కాకపోవడం దురదృష్టకరమని హరీశ్ రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడాల్సిన కెఆర్‌ఎంబి రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని తెలంగాణకు అన్యాయం చేస్తుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ, ఎపి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాలు కలిసి టెలిమెట్రిల ఏర్పాటును నిర్లక్ష్యం చేస్తూ, తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. రూ. 4.18 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులను వెంటనే రికవరి చేసి, టెలిమెట్రిల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నిర్బంధించడాన్ని నిలిపివేసి, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, అరెస్టు చేసిన నిరుద్యోగులను భేషరతుగా విడుదల చేయాలని హరీశ్‌రావు అన్నారు.

## హెచ్‌టి పత్తి విత్తనాల విక్రయాలు అరికట్టాలి : మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం నిషేధించిన హెచ్‌టి పత్తి విత్తనాల విక్రయాలను అరికట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు. పత్తి విత్తనాల ప్యాకేట్లపై వ్యవసాయశాఖ అధికారులతో హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి తుమ్మల గురువారం సమీక్ష నిర్వహించారు. హెచ్‌టి/బిజి 111 పత్త రకాన్ని అమెరికాకు చెందిన మోన్సాంటో కంపెనీ కనుగొన్నప్పటికి, ఫీల్ ట్రయల్స్ లో ఆ పత్తి విఫలమవ్వడంతో పాటు పర్యావరణానికి కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ పత్తి రకాన్ని నిషేధించిందన్నారు. రాష్ట్రంలో దాదాపు 52 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకుని దళారులు హెచ్‌టి విత్తనాలు, కల్తీ విత్తనాలను రాష్ట్రంలోకి తెచ్చే అవకాశం ఉన్నందున, ఈ నెల నుంచే సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీములను ఏర్పాటు చేసి,పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టే విధంగా నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కోమార్కెటింగ్ కు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు హెచ్‌టి పత్తి విత్తనాలను అనధికారకంగా రైతులకు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌టి పత్తి విత్తనాలను రైతులు కొనుగోలు చేయకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కలుపును తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందని హెట్‌టి పత్తి విత్తనాలను కొనుగోలు చేయవద్దని మంత్రి తుమ్మల కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డా.గోపితో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఒసి) జారీకి కొత్త మార్గదర్శకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన అనుమతి గడువు ముగిసినప్పటికీ అనుమతించిన ప్లాన్‌ల ప్రకారమే నిర్మాణం పూర్తిచేసిన నాన్ హైరైజ్ భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఒసి) జారీకి మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) గురువారం మార్గదర్శకాలను విడుదల చేసింది. భవన అనుమతులు పొంది, గడువు లోపల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందలేకపోయినప్పటికీ అనుమతించిన ప్లాన్‌ల మేరకు నిర్మాణం పూర్తి చేసిన భవనాలకు ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకపోవడం వల్ల నీటి, విద్యుత్ కనెక్షన్లు (జలమండలి, టిఎస్‌ఎస్‌పిడిసిఎల్) పొందడంలో కొనుగోలుదారులు, భావి గృహ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో పాటు, బ్యాంకు రుణాల విషయంలో కూడా సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. అదనపు పెనాల్టీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, నాన్ హైరైజ్ భవనాలకు మాత్రమే వర్తించేలా ఒకే విధమైన ప్రక్రియను అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను 2026 జనవరి 8న జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

### జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణలోనూ
# త్వరలోనే ప్రత్యేక విద్యా విధానం
### హిమాచల్‌ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ ఠాకూర్‌కు వెల్లడించిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ విద్యను అందించే విధానాన్ని అమలు చేయనున్నట్టు తెలంగాణ ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి రోహిత్ ఠాకూర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందానికి తెలిపారు. జాతీయ విద్యా విధానం తరహాలోనే తెలంగాణలోనూ త్వరలోనే ప్రత్యేక విద్యా విధానం తీసుకురానున్న విషయాన్ని తెలిపారు. విద్యా విధానం కోసం ఇప్పటికే ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించామని, త్వరలోనే ఆ పాలసీని అమలులోకి తీసుకొస్తామని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో తీసుకుంటున్న చర్యలను ముఖ్య మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ ప్రారంభించడమే కాకుండా పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లడానికి రవాణా సౌకర్యం కల్పించే ఆలోచన కూడా చేస్తున్నట్టు సిఎం వెల్లడించారు. రాష్ట్రంలోని ఐటిఐలను ఎటిసిలుగా తీర్చిదిద్దుతున్న వివరాలను, అలాగే ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. విద్యా రంగంలో సమూల మార్పుల్లో భాగంగా చేపడుతున్న సంస్కరణలతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న వివరాలను తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల రూపాయల వ్యయంతో 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ స్థాయిలో ఈ స్కూల్‌ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఏటీసీగా మార్చిన మల్లేపల్లి (ఐటిఐ)ని సందర్శించాలని ఈ సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్ మంత్రికి సిఎం సూచించారు. రాష్ట్రంలో నెలకొల్పుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపైన ఆసక్తి చూపించిన హిమాచల్‌ప్రదేశ్ మంత్రి అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని కోరారు. ప్రభుత్వ రంగంలో విద్యా వ్యవస్థను పటిష్టపరచాలనే సిఎం రేవంత్ రెడ్డి విజన్‌ను మంత్రి రోహిత్ ఠాకూర్ అభినందించారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### నీళ్లపేరుతో కాంగ్రెస్, బిఆర్‌ఎస్
# పొలిటికల్ డ్రామాలు
### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** నీళ్ల పేరుతో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలపై చర్చ జరగకుండా కాంగ్రెస్ , అవినీతిపై విచారణ లేకుండా బిఆర్‌ఎస్ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తిలోని శుభం గార్డెన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి విషయంలో బిఆర్‌ఎస్ తీరుపై ఉద్యమం చేసింది బిజెపియేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏనాడైనా ఉద్యమాలు చేసిందా? అని ప్రశ్నించారు. తెలంగాణకు నీళ్ల అన్యాయం చేసిన మొట్టమొదటి దోషి కాంగ్రెస్సేనన్నారు. ఉమ్మడి ఏపిలో క్రిష్ణా వాటాలో 811 టిఎంసిలుంటే ఏనాడూ తెలంగాణకు 200 టిఎంసిలకు మించి నీటిని వాడుకోకుండా ఇక్కడి ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. గోదావరిలో 1486 టిఎంసిల నీటి వాటా ఉంటే తెలంగాణలో ఎన్నడూ 500 టిఎంసిలకు మించి వాడుకోలేదన్నారు. రాష్ట్ర విభజన యాక్టులోనూ తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్సేనని, ఏపి పునర్విభజన యాక్ట్ సెక్షన్ 89 ప్రకారం రాష్ట్ర విభజన నాటికి నిర్మాణంలో ప్లాన్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులపై అభ్యంతరం తెలపొద్దని స్పష్టంగా ఉందన్నారు. పునర్విభజన బిల్లు ఏపిలోని 4, తెలంగాణలోని 2 ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను పొందుపర్చారని, తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పొందుపరచలేదని ప్రశ్నించారు. ఏపి ప్రభుత్వానికి అమ్ముడుపోయి క్రిష్ణా జలాలను తాకట్టు పెట్టాడని, క్రిష్ణా జలాల్లో తెలంగాణకు 575 టిఎంసిల వాటా రావాల్సిఉంటే 299 టిఎంసిలకే ఒప్పుకుని సంతకం చేసి దక్షిణ తెలంగాణకు తీరని ద్రోహం చేసిన మోసగాడు కెసిఆర్ అన్నారు. ఏపికి కెసిఆర్ అమ్ముడుపోయి అపెక్స్ కౌన్సిల్ సాక్షిగా 299 టిఎంసిల నీళ్లు చాలని చేసిన సంతకం చేశాడని స్పష్టం చేశారు. కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల క్రిష్ణా నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందంటూ కేంద్రం అనేక సార్లు హెచ్చరించిందని, నీళ్ల విషయంలో పాలకుల తప్పిదాలను సరిదిద్దడానికి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లను ఏర్పాటు చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతిపై సిబిఐ విచారణ జరపాలని రేవంత్‌రెడ్డి ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పాలకులు చేసిన అన్యాయంపై అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేలకు అవకాశం సైతం ఇవ్వడం లేదన్నారు. మాజీ మేయర్ సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు ప్రవీణ్‌రావు తదితరులున్నారు.

# కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు
### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగిస్తూ జారీ చేసిన జిఒ నెంబర్ 12 ను సవరించి, కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల సహజ మరణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని, సిఎస్‌సి హెల్త్ టెస్టులను సైతం రద్దు చేయాలని కోరారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం అవుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం లాంటి స్కీములను జిఒ నెంబర్ 12 ద్వారా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ రూ. 346.36 కోట్ల క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం కార్మికులకు అన్యాయం చేయడమేనన్నారు. సిఎస్‌సి హెల్త్ కేర్ టెస్టుల వల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు లేదని, మళ్లీ వైద్యం కోసం వెళితే ఏ హాస్పిటల్ వాళ్ళు అయిన టెస్టులు చేసిన తర్వాతనే వైద్యం చేస్తున్నారని, వెంటనే సిఎస్‌సి సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అవసరం ఉన్నా లేకున్నా ప్రతి కార్మికుడి పేరు మీద రూ. 2,309 ప్రీమియం చెల్లిస్తూ పోతే బోర్డు నిధులు రోజురోజుకు తరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సిఎస్‌సి హెల్త్ చెకప్ పేరుతో రూ. 500 కోట్లు కాజేశారని, కార్మికులకు మాత్రం ఇవ్వాల్సిన నష్టపరిహారాలు వేల సంఖ్యలో పెండింగ్ లో ఉంటే, వాటిని పరిష్కరించే తీరిక ప్రభుత్వానికి, అధికారులకు లేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణ రంగ కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, గడువు దాటిన 13 లక్షల కార్డులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేసే ప్రయత్నాలు విరమించుకోవాలని కోరారు. భవననిర్మాణ కార్మికుల సహజ మరనానికి రూ. 5 లక్షలు ఇవ్వడంతో పాటు 50 ఏళ్లు దాటిన కార్మికులకు కనీస పెన్షన్ సౌకర్యం అమలు చేయాలని వివాహం, కానుపు స్కీం కింద రూ. 1 లక్ష ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

**లేబర్ చట్టాలను రద్దు చేయాలి..**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 18 వ తేదీన ఖమ్మంలో జరిగే కార్మిక వర్గ పక్షపాతి కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల బహిరంగ సభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు మారగొని ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మోటె నరసింహ, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, ఆఫీస్ బేరర్స్ కమతం యాదగిరి, జి.పరమేష్, ఎస్.మల్లేష్, పిట్టల సమ్మయ్య, కడారి రాములు, ఎం.శివకుమార్, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ మోసాలతో జాగ్రత్త
### సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంక్రాంతి పండుగ సీజన్‌ను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు. పండుగ సమయంలో జరిపే ఆన్‌లైన్ లావాదేవీలు, డిజిటల్ కొనుగోళ్లను లక్ష్యంగా చేసుకుని నకిలీ ఆఫర్లు, క్యాష్‌బ్యాక్ లింకులు, బహుమతుల పేరుతో మోసాలు పెరుగుతున్నాయని తెలిపారు. వాట్సాప్, ఎస్‌ఎంఎస్, సోషల్ మీడియా ద్వారా సంక్రాంతి ఆఫర్లు, డిస్కౌంట్లు, లక్కీ డ్రాలు, గిఫ్ట్ మనీ అంటూ వచ్చే నకిలీ లింకుల ద్వారా ప్రజలను మోసగాళ్లు బుట్టలో వేస్తున్నారని హెచ్చరించారు. అలాగే తక్కువ ధరలకు విమాన, బస్, రైలు టికెట్లు, క్రూయిజ్ బుకింగ్లు, ఫెస్టివల్ సేల్ పేరుతో వచ్చే నకిలీ వెబ్‌సైట్లు కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ లింకులపై క్లిక్ చేస్తే ఫేక్ వెబ్‌సైట్లకు మళ్లించి మాలిషియస్ ఎపికె ఫైళ్లను డౌన్‌లోడ్ చేయిస్తారని, తద్వారా ఒటిపిలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తున్నారని తెలిపారు. కొన్నిసార్లు బాధితుల ఖాతాలను ఉపయోగించి వారి కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా మోసం చేస్తున్న ఘటనలు నమోదవుతున్నాయని శిఖాగోయల్ వెల్లడించింది.



### కానిస్టేబుల్ కుటుంబానికి రూ. కోటి 31 లక్షల చెక్కు అందజేసిన డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కుటుంబానికి బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా అందాల్సిన బీమా మొత్తాన్ని డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్(డిజిపి) బి. శివధర్ రెడ్డి చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో గురువారం అందజేశారు. అంబర్‌పేట సిపిఎల్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన బోయ పాండు, ఆయన భార్య గత ఏడాది మార్చి 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.కోటి 31 లక్షల చెక్కును డిజిపి అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిఎం కె. మురళీకృష్ణ, సలహాదారు రిటైర్డ్ బ్రిగేడియర్ ఎస్.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నీళ్ల పోరాటంలో
# బిజెపిది ప్రేక్షకపాత్రే
### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కృష్ణా, గోదావరి బేసిన్లలో ప్రధాన ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ కట్టినవేనని, తెలంగాణ ఏర్పడిన ఈ 12 ఏళ్లలో బిజెపి కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితమైందని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ దోపిడీని అడ్డుకోవడంలో బిజెపి పూర్తిగా విఫలమైందన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నీళ్ల విషయంలో పోరాటం చేయడంలో బిజెపి పాత్ర ఉందనడం హాస్యాస్పదమన్నారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిని, సోర్స్ పాయింట్ల మార్పును కేవలం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ మాత్రమే ప్రశ్నించిందన్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతం తెలంగాణలో 71 శాతం ఉందని, ఆ ప్రాతిపదికన రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కోసం కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నదీ జలాల హక్కుల కోసం చేసే పోరాటంలో కాంగ్రెస్‌తో కలిసి రావాలన్నారు. 2023లో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందని, గత పదేళ్లలో బిఆర్‌ఎస్ అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఐటి, సిబిఐ, ఈడిలను ఎందుకు ప్రయోగించలేదో బిజెపి సమాధానం చెప్పాలన్నారు. కెసిఆర్ హయాంలో కృష్ణా జలాల దోపిడీ జరిగిందని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అడ్డుపడుతున్నారని జగన్ మోహన్ రెడ్డి చెప్పడమే తమ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. తెలంగాణలో సాగు, తాగు నీటికి వాడుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీశైలం, సింగూరు, కడెం వంటి ప్రాజెక్టుల పుణ్యమేనని ఆయన గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ పుణ్యంతోనే గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి 8 లోక్‌సభ సీట్లు గెలుచుకోగలిగిందని, బిఆర్‌ఎస్ పార్టీకి రాష్ట్రంలో రాజకీయ మనుగడ లేదని చామల విమర్శించారు.



### కంటోన్మెంట్ బోర్డులో కాంట్రాక్ట్ కార్మికులకు
## చట్ట ప్రకారం జీతాలు, సెలవులు
### ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్‌లో కాంట్రాక్ట్ కార్మికులకు చట్ట ప్రకారం జీతాలను, సెలవులను అమలు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం సెంట్రల్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేయగా,ఆయన స్పందిస్తూ చట్టాల ప్రకారమే కార్మికులకు వేతనాలను చెల్లించాలని సంబంధిత కాంట్రాక్టర్లకు, కంటోన్మెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు ఆదేశాలు ఇస్తామని యూనియన్ నాయకులకు హామీనిచ్చారు. అంతకుముందు ధర్నానుద్దేశించి ఎం.నరసింహ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో దాదాపు 1500 మంది కార్మికులు వివిధ కాంట్రాక్టర్ల కింద అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారని, వారికి కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం జీతాలు, సెలవులు అమలు చేయకుండా కాంట్రాక్టర్లు, యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహారిస్తోందని విమర్శించారు. పేమెంట్ అఫ్ వేజెస్ చట్టం ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెలా 7వ తేదీలోపు వేతనాలను చెల్లించాల్సి ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, చట్టాలను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. కొత్తగా ప్రవేశపెట్టిన లేబర్ కోడులలో కూడా కాంట్రాక్టు కార్మికులకు 7వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, పండగ, జాతీయ, ఆర్థిక సెలవులు అమలు చేయాలని, బోనస్ ఇవ్వాలని ఉన్నదని గుర్తు చేశారు. గత సంవత్సర కాలంగా ప్రతినెలా జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని, సంక్రాంతి పండుగ లోపు కార్మికులకు జీతాలు చెల్లించే విధంగా కాంట్రాక్టర్లను కంటోన్మెంట్ అధికారులను ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**ప్రొఫార్మా 10-01**
**బహిరంగ ప్రకటన**
PUB/1742

ఈ క్రింద పేర్కొన్న సెక్షన్‌లో నిర్మాణపనులు పూర్తయిన రైల్వే లైన్లను, రైల్వే ప్రాంగణాలను ఉపయోగించే వినియోగదారులందరికీ ఈ నోటీసు జారీ చేయడమైనది. విద్యుదీకరణ చేయనున్న సెక్షన్: దక్షిణమధ్య డివిజన్ ఎస్‌టిబి/ఎస్‌ఎస్‌పి నుండి సుల్తానాబాద్ వద్ద విద్యుత్ సరఫరాకు ఉద్దేశించిన వాహక పరికరాల ద్వారా విద్యుత్ ప్రవహింపజేయడానికి ప్రతిపాదిత ప్రాంగణం రూపాంతరీకరణ ఎల్‌ఓసి 11/8 (km/ch 11/421.80) నుండి 13/9 (km/ch 13/367.70). ప్రస్తుతం ఉన్న లూప్‌లైన్లు, బోగీలను సక్రమ వరుసలో పెట్టేందుకు ఉపయోగించే షంటింగ్ ప్రాంతం మరియు ఓవర్ షూట్ లైన్‌లు కూడా ఈ రూపాంతరీకరణ పరిధిలో ఉన్నవి.
దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో సుల్తానాబాద్ స్టేషన్ ఎల్‌ఓసి 11/8 (km/ch 11/421.80) నుండి 13/9 (km/ch 13/367.70) వరకూ పైన పేర్కొన్న రూపాంతరీకరణలో భాగంగా **27.01.2026**వ తేదీన గానీ ఆ తర్వాతగానీ 25 కిలోవాట్లు, 50 పౌనఃపుణ్యంతో A.C ఓవర్ హెడ్ ట్రాక్షన్ తీగలద్వారా విద్యుత్ సరఫరా ప్రారంభమగును, ఇక ఆనాటినుండీ ఈ ఓవర్‌హెచ్ ట్రాక్షన్ లైన్లలో రాత్రి పగలు తేడా లేకుండా అన్నివేళలా విద్యుత్ ప్రవాహం జరుగుతూ ఉండునని భావించవలెను. అందువల్ల అనధికార వ్యక్తులు ఎవరూ ఈ ప్రాంతం సమీపమునకు వెళ్ళరాదు. లేదా పైన చెప్పిన విధంగా ఆ ప్రాంతానికి దగ్గరగా ఎలాంటి పనులూ చేయకూడదు.

**ప్రొఫార్మా 10-2**
**ఎ.సి 25 కిలోవాట్ల ట్రాక్షన్ ప్రారంభం**
**"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"**

25 కిలోవాట్లు, 50 పౌనఃపుణ్యంతో A.C ఓవర్ హెడ్ ట్రాక్షన్ తీగలద్వారా విద్యుత్ సరఫరాను ప్రవేశపెడుతున్నందువల్ల ఈ క్రింద పేర్కొన్న సెక్షన్‌లో ప్రజలకు తెలియడంకోసం సమాచారం చెప్పడమైనది:
సెక్షన్: దక్షిణమధ్య డివిజన్‌లో ఎస్‌టిబి/ఎస్‌ఎస్‌పి నుండి సుల్తానాబాద్ వద్ద ప్రస్తుతం ఉన్న లూప్‌లైన్లు, బోగీలను సక్రమ వరుసలో పెట్టేందుకు ఉపయోగించే షంటింగ్ ప్రాంతం మరియు ఓవర్ షూట్ లైన్‌ల ప్రతిపాదిత ప్రాంగణం రూపాంతరీకరణసహా ప్రయాణికుల రవాణాకు సంబంధించి విద్యుత్ వాహక పరికరాలతో ఓవర్ హెడ్ ట్రాక్షన్ తీగలకు విద్యుత్‌శక్తి సమకూర్చబడును.
సుల్తానాబాద్ స్టేషన్ ఎల్‌ఓసి 11/8 (km/ch 11/421.80) నుండి 13/9 (km/ch 13/367.70) వరకూ.
**రోడ్డు మార్గంలో వెళ్ళేవారు రైలు పట్టాలు దాటే ప్రదేశం వద్ద ప్రస్తుతం తగిన కొలమానాలతో రోడ్డు స్థాయికి చాలా స్పష్టంగా 4.78 మీటర్లు ఎత్తులో నియంత్రణలు నిర్మించి ఉన్నవి.** మితిమీరిన లోడుతో వెళ్ళే వాహనాలు చాలా శక్తిమంతమైన విద్యుత్ తీగలను తాకకుండా ఉండటంకోసం లేదా ప్రమాదస్థాయిలో వాటికి చేరువ కాకుండా ఉండటం కోసం నియంత్రణలను ఏర్పాటు చేయడమైనది.
పైన పేర్కొన్న ప్రయోజనాల నిమిత్తం లోడుతో వెళ్ళే వాహనాలు నిర్దేశిత ఎత్తును గమనించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశించిన ఎత్తును అధిగమించి వాహనాలు సరుకు లోడును తీసుకువెళ్ళవద్దని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
**అధికమైన ఎత్తులో సరుకు తీసుకువెళ్ళడంవల్ల ప్రమాదాలు ఈ క్రిందివిధంగా ఉండును:**
**ఎత్తుగా నిర్మించిన ఇనుపస్తంభం నియంత్రణకు ప్రమాదం వాటిల్లును మరియు తద్వారా రహదారికి, రైల్వే లైనుకు కూడా ఆటంకం కలుగును.**
**వాహనంలో తీసుకువెళుతున్న సరుకులకు లేదా వాహనానికి ప్రమాదం వాటిల్లును.**
**మంటలు చెలరేగే ప్రమాదం ఉన్నది మరియు శక్తిమంతమైన విద్యుత్ వాహక తీగలకు సమీపంగా రావడంవల్ల లేదా వాటిని అంటుకోవడంవల్ల ప్రాణాలకు హాని కలుగును.**
**A2206** డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరు / గతిశక్తి / సికింద్రాబాద్.

## మధ్యంతర భరణం మంజూరు దశలో...
# భార్య సంపాదన పరిగణించలేము

### ఢిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ :** మధ్యంతర భరణం మంజూరు దశలో భార్య సంపాదిస్తున్నట్లు లేదా తనను తాను పోషించుకునే సామర్థ్యం కలిగి ఉందని భావించలేమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ కోర్టు నెల వారీ మధ్యంతర నిర్వహణ రూ.2,500 మంజూరు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఈ వ్యాఖ్యలు చేశారు. పిటిషనర్ భర్త తన భార్య నర్సరీ టీచర్‌గా పనిచేస్తున్నదని , కాబట్టి ఆమె సంపాదిస్తున్నదని పేర్కొన్నప్పటికీ ఆయన త ఆమె సంపాదనకు సంబంధించిన ఎలాంటి డాక్యుమెంటరీ రుజువును రికార్డులో ఉంచలేదు. ఆ మహిళ కేవలం 11వ తరగతి వరకు మాత్రమే చదువుకుందని గుర్తించిన ధర్మాసనం అతని వాదనను తోసిపుచ్చింది. ఎలాంటి రుజువు చూపకుండా భర్త చేసిన 'బట్టతల వాదన' ఈ దశలో సహాయపడదని ధర్మాసనం తెలియజేసింది. 'దీనిప్రకారం మధ్యంతర భరణం మంజూరు కోసం పిటిషనర్‌భార్య సంపాదిస్తున్నట్లు లేదా తనను తాను పోషించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు భావించలేమని ఈ కోర్టు అభిప్రాయపడింది' అని జనవరి 5న వెలువరించిన తీర్పులో కోర్టు పేర్కొంది. తన భార్య పనిచేస్తున్నదని, సంపాదిస్తున్నదని కేవలం 'బట్టతల ప్రకటన' వెల్లడించడం ప్రాథమికంగా ఈ వాదనకు ఎలాంటి ఆధారాలు కూడా లేకుండా ఈ దశలో ప్రతివాదిభర్తకు ఏవిధంగానూ సహాయపడదని జోడించింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 125 (భార్యలు, పిల్లలు, తల్లిదండ్రుల నిర్వహణ కోసం ఆర్డర్) కింద ఆ మహిళ చేసిన విజ్ఞప్తిపై ఫ్యామిలీ కోర్టు 2024 మార్చిలో ఆమెకు మధ్యంతర భరణంగా రూ.2,500 మంజూరు చేసింది.2021 జూన్‌లో ఈ జంట ముస్లిం ఆచారాలు, సాంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వెంటనే కట్నం కోసం తన ఇంటిలో తనను దారుణంగా హింసించారని భార్య ఆరోపించింది. 2022లో తనను వివాహ గృహంలోనుంచి బయటకు పంపించివేశారని ఆమె ఫిర్యాదు చేశారు. మధ్యంతర నిర్వహణ ఖర్చులను పెంచాలని కోరుతూ తన భర్త గ్రాడ్యుయేట్ అని, ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడని నెలకు సుమారు రూ.25,000 సంపాదిస్తున్నాడని బాధితురాలు వాదించారు. అంతేకాకుండా ఆయన ప్రైవేట్ ట్యూషన్లు చెబుతూ నెలకు రూ.15,000 అదనంగా సంపాదిస్తున్నాడని, దానికి తోడు కిరాణం దుకాణం నడుపుతున్నాడని, నెలకు దాదాపు రూ.33,000 రెంటల్ ఆదాయం పొందుతున్నాడని ఆరోపించింది. పిటిషనర్ మాట్లాడుతూ తనకు నెలకు రూ.2,500 అతి తక్కువ మొత్తం అని, ఏమాత్రం సరిపోదని చెప్పారు. భర్త తాను ఒక ఎన్‌జిఒలో టీచర్/ స్పెషల్ ఎడ్యుకేటర్‌గా నెలకు రూ.10,000 శాలరీకి పనిచేస్తున్నానని మధ్యంతర భరణంగా నెలకు రూ.2,500 మొత్తాన్ని సమర్థించుకున్నాడు. అయితే భర్త గ్రాడ్యుయేట్ అని ఒప్పుకున్నప్పటికీ, క్లెయిమ్ చేసిన ఆదాయం నైపుణ్యం కలిగిన వ్యక్తికి చెల్లించాల్సిన కనీస వేతనం కంటే తక్కువగా ఉన్నదని కోర్టు గమనించింది. భర్త తన పూర్తి ఖాతా స్టేట్‌మెంట్‌లను దాఖలు చేయలేదని, ఒక పరిమిత కాలానికి మాత్రమే స్టేట్‌మెంట్‌లను సమర్పించాడని, ఆ కాలానికి నెలకు రూ.10,000 జీతం రశీదును హైలెట్ చేసే నిర్దిష్ట లావాదేవీలు లేవని కూడా అది పేర్కొంది. అందువల్ల భర్త ఆదాయాన్ని రూ.13,200 కనీస వేతనాల ప్రాతిపదికన అంచనా వేయాలని, తదనుగుణంగా మధ్యంతర భరణాన్ని పెంచాలని కోర్టు పేర్కొంది. ప్రతివాది (భర్త) ఉత్తర్ ప్రదేశ్‌లో నివసిస్తున్నారని, అక్కడ పనిచేస్తున్నారని, అంగీకరించబడిన స్థానం, సంబంధిత సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో గ్రాడ్యుయేట్ / నైపుణ్యం కలిగిన కార్మికుడికి వర్తించే కనీస వేతనాలు నెలకు రూ. 13,200 అని కోర్టు పేర్కొంటూ భార్యకు ఇచ్చే తాత్కాలిక నిర్వహణను నెలకు రూ.3,500కు పెంచింది. మూడు నెలల వ్యవధిలో భార్యకు భరణం బకాయిలను చెల్లించాలని కోర్టు బాధితురాలి భర్తను ఆదేశించింది.

## వీధుల నుంచి ప్రతి కుక్కనూ తరలించాలని ఆదేశించలేదు: 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** వీధుల్లో ఉండే ప్రతి కుక్కను తరలించాలని తాము ఆదేశించలేదని, జంతువుల జనన నియంత్రణ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. కుక్కలు తమకు భయపడేవారిని లేదా గతంలో కుక్కకాటుకు గురైన వారిని వాసన చూసి వారిపై దాడి చేస్తాయని వీధికుక్కల కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. కేవలం సంస్థలు, కార్యాలయాల దగ్గరి నుంచి మాత్రమే వాటిని తరలించమన్నామని సుప్రీం ధర్మాసనం గుర్తుచేసింది. సున్నితమైన ప్రదేశాల్లో భద్రతపై ఆందోళన వ్యక్తంచేసిన సుప్రీం కోర్టు, ఆసుపత్రి వార్డుల్లో, రోగుల చుట్టూ కుక్కలు సంచరించడానికి అనుమతించాలా అని ప్రశ్నించింది. శునకాలను వీధుల నుంచి తరలించాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వి అంజారియాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వీధుల నుంచి ప్రతి కుక్కను తరలించాలని తాము ఆదేశించలేదని, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని మాత్రమే ఆదేశించినట్లు జస్టిస్ మెహతా పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో కుక్కకాటు వల్ల ముఖ్యంగా చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నట్లు మీడియా కథనాలు వెలువడటంతో గతేడాది జులై 28న సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు తదితర జనసమ్మర్ద బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు సంచరించకుండా చేయాలని గతేడాది నవంబర్ 7న కీలక ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయాలని ఆదేశించింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్న ప్రదేశంలోనే వదిలేయొద్దని స్పష్టంచేసింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. జాతీయ రహదారులపై తిరుగుతున్న పశువులను కూడా షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలని గుర్తుచేసింది. కుక్క కాటు ఘటనలు ఆందోళనకర రీతిలో పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల భద్రత, ఆరోగ్యం తమకు అత్యంత ప్రాధాన్యమని తేల్చి చెప్పింది. అంతకుముందు బుధవారం వీధి కుక్కల కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండటంపై అసహనం వ్యక్తం చేసిన సుప్రీం, కేవలం శునకాలపై ఆలోచిస్తుంటే ఇతర జంతువుల సంగతేంటని ప్రశ్నించింది. కరిచేందుకు సిద్ధమైన కుక్కల ప్రవర్తనను ముందుగా ఎవరూ అంచనా వేయలేరని పేర్కొంది. ఇలాంటి సందర్భాల్లో చికిత్స కంటే నివారణే ముఖ్యమని స్పష్టంచేసింది.

## 8 ఏండ్ల తర్వాత తన మొదటి లైన్ ఫిట్ డ్రీమ్‌లైనర్...
# 787-9 ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఎయిర్ ఇండియా డెలివరీ



**న్యూఢిల్లీ:**టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా ఫస్ట్ లైన్ ఫిట్ బోయింగ్ 7879 ఎయిర్‌క్రాఫ్ట్‌ను డెలివరీ తీసుకుంది. ఇది 8 సంవత్సరాలకు పైగా ఎయిర్‌లైన్ ఫ్లీట్‌లో చేరిన మొదటి డ్రీమ్‌లైనర్ కూడా. జనవరి 7న సియాటిల్ లోని బోయింగ్ ఎవరెట్ ఫ్యాక్టరీలో డ్రీమ్‌లైనర్ టైటిల్ బదిలీని ఎయిర్ ఇండియా పూర్తి చేసిందని గురువారం నాడు ఒక అధికారి తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) తనిఖీల తర్వాత 2022 జనవరిలో ప్రైవేటీకరణ తర్వాత ఎయిర్ ఇండియా తీసుకునే డ్రీమ్‌లైనర్‌కు సంబంధించిన మొదటి లైన్ విమానం కూడా రానున్న కొద్ది రోజుల్లో భారతదేశానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. కొత్త విమానంలో మూడు క్లాస్‌లు ఉన్నాయి. ఎకానమీ, ప్రీమియర్ ఎకానమీ, బిజినెస్ క్లాస్ సీట్స్ ఆ మూడు క్లాస్‌లుగా ఉన్నాయి. 2017 అక్టోబరులో ఆ క్యారియర్ ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నప్పుడు ఎయిర్ ఇండియా చివరిగా లాస్ట్ లైన్ ఫిట్ డ్రీమ్‌లైనర్‌ను కొనుగోలు చేసింది. సాధారణంగా లైన్ ఫిట్ అనేది ఒక నిర్దిష్ట విమానయాన సంస్థ కోసం ప్రత్యేకంగా తయారు చేయబడిన విమానాన్ని సూచిస్తుంది. ఒక అధికారి వెల్లడించిన ప్రకారం తాజా విమానం ఎయిర్‌లైన్ వైడ్‌బాడీ, 2023లో ఆర్డర్ చేసిన220 బోయింగ్ జెట్‌ల నుండి 52వ డెలివరీ. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఇప్పటికే 51వ నారోబాడీ బోయింగ్ 7378s విమానాలను డెలివరీ చేసింది. వీటిలో గడిచిన డిసెంబర్ చివరలో ప్రవేశపెట్టబడిన మొదటి లైన్ ఫిట్ విమానం కూడా ఉంది. జనవరి 2022లో టాటాస్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎయిర్ ఇండియా 350 ఎయిర్ బస్, 220 బోయింగ్ విమానాలకు ఆర్డర్ ఇచ్చింది. ఎయిర్ బస్ ఇచ్చిన 6 ఎ350ల ఆర్డర్‌లో ఇప్పటికే ఎయిర్ ఇండియా విమానంలో చేర్చబడ్డాయి. ఇదిలా ఉంటే ఎయిర్ ఇండియా వద్ద ఇప్పటికే 26 బి 787లు, 6బి 7879లు ఉన్నాయి. వీటిని ఎయిర్ లైన్‌లో విలీనం చేశారు. కాగా ప్రస్తుతం ఎయిర్ ఇండియా గ్రూప్ 300కు పైగా విమానాలను కలిగి ఉంది. వీటిలో 18విమానాలు ఎయిర్ ఇండియాతో మిగిలినవి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో ఉన్నాయి.

## 'సర్' విచారణ నోటీసు... 60 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్య



**కోల్‌కతా:** ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' కారణంగా పలువురు అధికాలతో పాటు జాబితాలో తన పేరు ఉంటుందో లేదా అన్న అనుమానంతో పలువురు మనస్తాపానికి గురై మత్యువాత పడుతున్నారు. కొందరు ఆత్మహత్య చేసుకుంటుండగా, మరి కొందరు గుండెపోటుకు గురవుతున్నారు. తాజాగా ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలో గురువారం అరవై ఏళ్ల వయసున్న వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని కనిపించాడు. 'సర్' విచారణకు సంబంధించిన నోటీసు అందిన తర్వాత అతను తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడని అతని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడిని రాయ్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్‌పారా ప్రాంతానికి చెందిన 64 ఏళ్ల బబ్లూ పాల్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 'ఈ రోజు తెల్లవారుజామున పాల్ తన ఇంట్లో ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందిన వెంటనే, అధికారులు అతని నివాసానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం పరీక్ష కోసం మృతదేహాన్ని రాయ్‌గంజ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు పంపించాం. దర్యాప్తు ప్రారంభించామని' అని పోలీసు అధికారి తెలిపారు. 'సర్' రెండవ దశకు సంబంధించిన విచారణ కోసం నోటీసు అందిన తర్వాత పాల్ మానసిక ఒత్తిడికి గురయ్యాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఓటర్ల జాబితా నుండి తన పేరు తొలగించబడుతుందేమోనని, తనను అక్రమ వలసదారుడిగా ప్రకటిస్తారేమోనని మృతుడు భయపడ్డాడని వారు పేర్కొన్నారు. గదిలో సూసైడ్ నోట్ లభించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే పోలీసులు అందులోని విషయాలను అధికారికంగా ధృవీకరించలేదు. వృత్తిరీత్యా స్క్రాప్ డీలర్ అయిన పాల్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. అతని కుమార్తె ఫిబ్రవరి 2 నుండి ప్రారంభమయ్యే తన మాధ్యమిక్ (10వ తరగతి) పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కృష్ణ కళ్యాణి పాల్ నివాసానికి వెళ్లి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ సంఘటనపై ఆయన ఎన్నికల సంఘాన్ని నిందించారు. సర్ ప్రక్రియ చుట్టూ ఉన్న భయం నివాసితులలో తీవ్ర ఆందోళనకు దారితీసిందని ఆయన ఆరోపించారు. పోస్ట్‌మార్టం నివేదిక అందిన తర్వాతే మరణానికి కచ్చితమైన కారణం నిర్ధారించబడుతుందని రాయ్‌గంజ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సోనోవానే కుల్దీప్ సురేష్ అన్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చే వరకు మరణానికి గల కారణాన్ని నిశ్చయంగా చెప్పడం సాధ్యం కాదని ఎస్పీ అన్నారు.

## 2023లో 49 లక్షల మందికి టైఫాయిడ్

### ఓ అధ్యయనం వెల్లడి




**న్యూఢిల్లీ:** దేశంలో 2023 సంవత్సరంలో సుమారు 49 లక్షల టైఫాయిడ్ జ్వ రం కేసులు నమోదు అయినట్లు ఓ నివేదికలో వెల్లడైంది. దీంట్లో 7850 మరణి ంచినట్లు పేర్కొన్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో టైఫాయిడ్ జ్వరం కే సులు అధికంగా ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో సుమారు 30 శాతం కేసులు నమోదు అయినట్లు నివేదిక ద్వారా తెలిసింది. ద లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఏషియాలో ఆ రిపోర్టును ప్రచురించారు. ది లాన్సెట్ రీజినల్ హెల్త్ ఆగ్నేయాసియా లో ప్రచురించబడిన పరిశోధనల ప్రకారం, దేశవ్యాప్తంగా 7.3 లక్షల ఆసుపత్రి లో చేరిన వారిలో ఆరు లక్షల మంది ఫ్లోరోక్వినోలోన్‌–నిరోధకత ఒక రకమైన యాంటీబయాటిక్ లేదా యాంటీమైక్రోబయల్, నిరోధకత కారణంగా ఉన్నారు. టైఫాయిడ్ జ్వరం అనేది బాక్టీరియల్ ఇన్ఫెక్షన్. ఇది కలుషితమైన ఆహారం. నీటి ద్వారా వ్యాపిస్తుంది. లక్షణాలు బహిర్గతం అయిన ఒకటి నుండి మూడు వా రాల తర్వాత ప్రారంభమవుతాయి. అధిక జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి, అలసట ఉంటాయి. చికిత్సలో యాంటీబయాటిక్స్, సహాయక సంరక్షణ ఉంటుంది. భారతదేశంలోని వెల్లూరులోని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్, క్రిస్టియన్ మెడికల్ కాలేజీ పరిశోధకులు సహా, పది అత్యధిక భారం ఉన్న రాష్ట్రాలలో ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కూడా ఫ్లోరోక్వినోలోన్‌–నిరోధక కేసులు, మరణాల రేటులో అత్యధికంగా ఉన్నాయని కనుగొన్నారు. '2023లో భారతదేశంలో 4.9 మిలియన్ టైఫాయిడ్ కేసులు, 7,850 మరణాలు సంభవించాయని రచయితలు అంచనా వేశారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక కలిసి జా తీయ భారంలో 29 శాతం వాటా కలిగి ఉన్నాయి. టైఫాయిడ్ జ్వరం సంభవం, మరణాలు, యాంటీబయాటిక్ నిరోధకతపై డేటాను కలిగి ఉన్న జూలై 2025 వరకు ప్రచురించబడిన అధ్యయనాలను పరిశోధకులు సమీక్షించారు.

## గ్రేటర్ నోయిడాలో తాగునీరు కలుషితం


### పలువురికి అస్వస్థత



**నోయిడా:** ఇటీవల మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో కలుషితి నీరు తాగి పలువురు మృతి చెందగా అనేకమంది అనారోగ్యానికి గురైన ఘటన మరవక ముందే గ్రేటర్ నోయిడాలోనూ ఇదే ఘటన చోటు చేసుకుంది. గ్రేటర్ నోయిడా డెల్టా 1 సెక్టార్‌లోని అనేక మంది నివాసితులు కలుషితమైన తాగునీటి అనారోగ్యానికి గురయ్యారు. దీంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తగా, సరఫరా లైన్‌లో మురుగునీరు కలిసినట్లు ఫిర్యాదులు వచ్చాయని అధికారులు, నివాసితులు తెలిపారు. మంగళ, బుధవారం సెక్టార్‌లోని కొన్ని ప్రాంతాల్లో కుళాయి నీటిని తాగిన తర్వాత వాంతులు, జ్వరం, కడుపునొప్పి, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని బాధిత నివాసితులు నివేదించారు. అయితే, గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ (గ్నిడా) అధికారులు తాగునీటి సరఫరాలో మురుగునీరు కలపడాన్ని ఖండించారు. ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో నీరు శుభ్రంగా ఉందని తేలిందని పేర్కొన్నారు. స్థానిక నివాసితుల సంక్షేమ సంఘం (ఆర్‌డబ్ల్యుఎ) మాజీ అధ్యక్షుడు, నివాసి రిషిపాల్ భాటి పిటిఐతో మాట్లాడుతూ, ముఖ్యంగా సి బ్లాక్‌లో పైపులైన్లలో మురుగునీరు పొంగి ప్రవహించడం, లీకేజీ ఈ సమస్యకు దారితీసిందని చెప్పారు. కలుషితమైన నీటిని తాగడంతో ఆరు నుండి ఏడు కుటుంబాలు వాంతులు, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలతో అనారోగ్యానికి గురయ్యారన్నారు. ఇతర బ్లాక్‌ల నుండి కూడా ఇలాంటి ఫిర్యాదులు గతంలోనే వచ్చాయని చెప్పారు. బుధవారం ఫిర్యాదులను అధికార యంత్రాంగం వెంటనే గమనించిందని, జలవనరుల శాఖ బృందం ప్రభావిత ఇళ్లను సందర్శించి నీటి నమూనాలను పరీక్షించిందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత నీటి వినియోగం వల్ల అనేక మరణాలు సంభవించాయి.

## బెంగాల్ వలస కార్మికుల కోసం
# ఆన్‌లైన్‌లో 'సర్' విచారణ

### ఎన్నికల సంఘం వెల్లడి




**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ వెలుపల పనిచేస్తున్న లేదా చదువుతున్న నివాసితులు ఇకపై ఓటర్ల జాబితా 'సర్' కింద విచారణలకు హాజరు కావాల్సిన అవసరం లేదని, త్వరలో ప్రారంభించబడే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పత్రాలను సమర్పించడానికి అనుమతిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. 'వారు స్వయంగా విచారణకు హాజరు కాలేకపోతే, వారి తరపున కుటుంబ సభ్యుడు వెళ్ళవచ్చు. ఆన్‌లైన్‌లో సమర్పించిన పత్రాలను కమిషన్ అంగీకరిస్తుంది' అని అధికారి పిటిఐకి తెలిపారు. రాష్ట్రం వెలుపల నివసిస్తున్న వలస కార్మికులు, విద్యార్థులు, నిపుణులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకే ఈ నిర్ణయమని వెసి వెల్లడిచింది. కాగా, కొంతమంది బూత్‌స్థాయి అధికారుల (బిఎల్‌ఒలు) ప్రవర్తనపై ఎన్నికల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. అనేక సందర్భాల్లో, వారు అధికారిక సూచనలను విస్మరించి స్వతంత్ర నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించింది. బిఎల్‌ఒలు ఉద్దేశపూర్వకంగా చేసే ఏవైనా తప్పులు జరిగితే ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల (ఇఆర్‌లు)పై బాధ్యతను బదిలీ చేయకుండా, ప్రత్యక్ష చట్టపరమైన చర్యలకు దారితీస్తాయని కమిషన్ హెచ్చరించింది. వారి రికార్డులలో వ్యత్యాసాల కారణంగా బుధవారం 9.4 మిలియన్ల మందికి ఇసి నోటీసులు జారీ చేయడం ప్రారంభించడంతో ఈ ప్రకటన చేసింది. పరిమిత కాలపరిమితిలో దాదాపు 10 మిలియన్ల విచారణలను నిర్వహించడం సాధ్యమేనా అనే దానిపై ఆ శాఖలోని అధికారులు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం.

## సిపిఐ(ఎం) నాయకుడి హత్య కేసులో...
## ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కార్యకర్తల ఏడుగురి జీవిత ఖైదు

### థలస్సేరి కోర్టు తీర్పు

**కన్నూర్ (కేరళ) :** 2008లో స్థానిక సిపిఐ(ఎం) నాయకుడి హత్య కేసుతో సంబంధం ఉన్న ఏడుగురు ఆర్‌ఎస్‌ఎస్‌బిజెపి కార్యకర్తలకు గురువారం థలస్సేరి కోర్టు జీవిత ఖైదు విధించింది. సుమిత్ అలియాస్ కుట్టన్, కె.కె.ప్రజేష్ బాబు, బి.నిధిన్, కె.సనల్, స్మిజోష్, సంజీష్, వి.జయేష్‌లను అదనపు జిల్లా, సెషన్స్ కోరు జడ్జి విమల్.జె దోషులుగా నిర్ధారించారు. ఈ హత్యకేసులో కోర్టు సంతోష్‌కుమార్, బి.సరత్, ఇ.కె.సనీష్, కునుంప్రథ్ అజేష్‌లను నిర్దోషులుగా ప్రకటించింది. కాగా 8వ నిందితుడిగా ఉన్న కె.అజిత్ విచారణ సమయంలో మరణించారు. నిందితులు, వారి న్యాయవాది, ప్రాసిక్యూషన్ వాదనలు విన్న తర్వాత కోర్టు మధ్యాహ్నం సమయంలో ఏడుగురు దోషులకు జీవిత ఖైదు విధించింది. 2008 డిసెంబర్ 31న థలస్సేరి సమీపంలోని తలాయి సమీపంలో జరిగిన సిపిఐ(ఎం) స్థానిక నాయకుడు లథీష్ హత్యకు సంబంధించిన కేసు ఇది. రాజకీయ వైరంలో భాగంగా జరిగిన ఈ దాడిలో లథీష్ స్నేహితుడు కూడా గాయపడ్డాడుకాగా నిందితులపై భారత శిక్షా స్మృతి (ఐపిసి)లోని అల్లర్లు, తప్పుడు నిర్బంధం, క్రిమినల్ బెదిరింపు, కుట్ర, హత్య, హత్యాయత్నానికి సంబంధించిన బహుళ సెక్షన్లు, అలాగే పేలుడు పదార్థాల చట్టంలోని 3, 5 కింద అభియోగాలు మోపబడ్డాయి. ఈ హత్య కేసుకు సంబంధించిన విచారణ 2020 జనవరి 7న పారంభమైంది. 30మంది ప్రాసిక్యూషన్ సాక్షులు, 90 డాక్యుమెంట్లు, 27 భౌతిక వస్తువులు పరిశీలించబడ్డాయి.

## 'అంబర్‌నాథ్'లో పొత్తుపై బిజెపి ద్వంద్వ వైఖరి

### తమ కౌన్సిలర్లను సస్పెండ్ చేస్తే... వారిని పార్టీలో చేర్చుకుందని కాంగ్రెస్ ఫైర్



**ముంబయి :** మహారాష్ట్రలోని అంబర్‌నాథ్ మున్సిపల్ కౌన్సిల్‌లో బిజెపితో పొత్తు పెట్టుకున్నందుకు తమ కౌన్సిలర్లను సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ గురువారం తెలిపింది. అయితే ఈ పొత్తును ప్రారంభించిన తమ సొంత నాయకులపై చర్య తీసుకోవడంలో కాషాయ పార్టీ విఫలమై, ద్వంద్వ విధానాలను ప్రదర్శించిందని మండిపడింది. డిసెంబర్ 20న జరిగిన స్థానిక ఎన్నికల తర్వాత, బిజెపి తన బద్ధ శత్రువైన కాంగ్రెస్‌తో 'అంబర్‌నాథ్ వికాస్ అఘాడి' (ఎవిఎ) బ్యానర్‌పై చేతులు కలిపి, (థానే జిల్లాలోని) అంబర్‌నాథ్ మున్సిపల్ కౌన్సిల్ నాయకత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన మిత్రపక్షం శివసేనను పక్కన పెట్టింది. ఈ అఘాడీలో అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) కూడా ఉంది. ఈ ఇబ్బందికరమైన ఏర్పాటుతో తీవ్ర ఇబ్బందికి గురైన కాంగ్రెస్, బుధవారం తన 12 మంది కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లను బ్లాక్ అధ్యక్షుడితో పాటు సస్పెండ్ చేసింది. సస్పెండ్ అయిన 12 మంది కౌన్సిలర్లు బుధవారం అర్ధరాత్రి బిజెపిలో చేరారని మహారాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రవీంద్ర చవాన్ తెలిపారు. 'కాంగ్రెస్ రహిత భారతదేశం' గురించి పదేపదే మాట్లాడే బిజెపి, ఎవిఎ ఏర్పాటుకు ప్రతిపాదన స్వయంగా కాషాయ పార్టీ నుంచే వచ్చిందని వెల్లడైనప్పటికీ, తమ కౌన్సిలర్లపై చర్య తీసుకోకుండా తన కపటత్వం, ద్వంద్వ ప్రమాణాలను బయటపెట్టిందని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి సచిన్ సావంత్ అన్నారు. అకోలా జిల్లాలోని అకోట్ మున్సిపల్ కౌన్సిల్‌లో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎఐఎంఐఎంతో బిజెపి చేతులు కలపడంపై, స్వాతంత్ర్యానికి పూర్వం హిందూ మహాసభ అనేక ప్రాంతాలలో ముస్లిం లీగ్‌తో అధికారాన్ని పంచుకున్న కాలాన్ని సావంత్ ప్రస్తావించారు. 'ఇది మరోసారి తీవ్రవాద శక్తుల ఎజెండాలు ఒకదానికొకటి పూరకంగా ఉంటాయని రుజువు చేస్తుంది' అని ఆయన ఆరోపించా రు. బిజెపి, ఎఐఎంఐఎం తెరవెనుక కలిసి పనిచేస్తున్నాయని కాంగ్రెస్ చాలా కాలంగా చెబుతోందని, ఇప్పుడు వారి రాజకీయ సాన్నిహిత్యం బహిరంగమైందని సావంత్ అన్నారు. అధికారం కో సం బిజెపి సూత్రాలు, నైతికత, సిద్ధాంతాలపై రా జీ పడటానికి సిద్ధంగా ఉందని పేర్కొంటూ, ధ్రువీకరణ ఎలా ఉద్దేశపూర్వకంగా సృష్టించబడుతుం దో ప్రజలు ఇప్పుడు అర్థం చేసుకున్నారని ఆయన అన్నారు. అకోట్ మున్సిపల్ కౌన్సిల్‌లో ఎఐఎంఐఎంతో పొత్తు పెట్టుకున్నందుకు అకోట్ ఎమ్మెల్యే ప్రకాష్ భర్సఖాలేకు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రవీంద్ర చవాన్ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

## కాంగ్రెస్ సహా ప్రాంతీయ పార్టీలన్నీ కలవాల్సిందే

### మరో ప్రత్యామ్నాయం లేదు : ఉద్ధవ్ థాక్రే



**ముంబయి :** కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలతో సహా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవ్వాల్సిన అవసరం ఉందని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే పేర్కొన్నారు. దీనికి మరో ప్రత్యామ్నాయం లేదన్నారు.'ఇండియా' కూటమి ఉనికిలో ఉందా అనే దానిపై పిటిఐ అడిగిన ప్రశ్నకు థాక్రే సమాధానమిస్తూ, 'కొంచెం పరిశోధించి, ఇండియా కూటమి ఉందో లేదో తనిఖీ చేయండి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాహుల్ జీ (గాంధీ) నివాసంలో ఒక్కసారి మాత్రమే కలిశామన్నది నిజం' అని అన్నారు. శివసేన (యుబిటి)తో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్ ఏకపక్షంగా ప్రకటించిందని, అయితే దానితో ఉన్నవారితో మాత్రం పొత్తు వద్దని చెప్పిందని ఆయన అన్నారు. అది వారి నిర్ణయం అని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అన్నారు. '(శరద్) పవార్ సాహెబ్ (ఎన్‌సిపిఎస్‌పి) మాతో ఉన్నారు (బిఎంసి ఎన్నికలలో). కాంగ్రెస్ మాతో లేదు. జాతీయ స్థాయిలో అందరూ కలిసి ఉండాలని మేము కోరుకుంటున్నాము. మేము, ఇతర ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ కలిసి ఉండాలి. (కలిసి రావడానికి) ప్రయత్నం జరగాలి. దీనికి మరో ప్రత్యామ్నాయం నాకు కనిపించడం లేదు' అని థాక్రే నొక్కి చెప్పారు. మహారాష్ట్రలోని ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, శివసేన (యుబిటి) మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్)తో పొత్తు పెట్టుకున్నందున, జనవరి 15న జరిగిన బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకుంది. అయితే, ప్రతిపక్ష ఓట్లు చీలిపోకుండా ఉండేందుకు కాంగ్రెస్‌ను కూడా పెద్ద కూటమిలో భాగం చేయాలని శివసేన (యుబిటి) ఆసక్తి చూపింది. భవిష్యత్తులో ఎంఎన్‌ఎస్ ఇండియా కూటమిలో భాగమవుతుందా అని అడిగినప్పుడు, థాక్రే కాంగ్రెస్‌ను పరోక్షంగా విమర్శిస్తూ, 'ప్రస్తుతం, శివసేన (యుబిటి), ఎంఎన్‌ఎస్ కలిసి వచ్చాయి. ఇంకా ఎవరైనా రావాలనుకుంటే మాతో చేరవచ్చు. అది వారి ఇష్టం. వారు మాతో రావాలనుకుంటున్నారా అని మేము వారిని అడగబోము' అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమిని ఎదుర్కోవడానికి అనేక ప్రతిపక్ష పార్టీలు కలిసి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా)ను ఏర్పాటు చేశాయి.

## మణిపూర్‌లో సాయుధ గ్రూపుల మధ్య కాల్పులు

**ఇంఫాల్:** మణిపూర్‌లోని కాంగ్పోక్పి జిల్లాలో గురువారం ఉదయం రెండు సాయుధ గ్రూపుల మధ్య కాల్పులు జరిగాయని అధికారులు తెలిపారు. ఖారం వైఫేలో జరుగుతున్న అక్రమ గసగసాల సాగును ధ్వంసం చేయడానికి వెళ్లిన నిషేధిత జెలియాంగ్రాంగ్ యునైటెడ్ ఫ్రంట్ (ఎస్ కామ్సన్)కు చెందిన అనుమానిత కార్యకర్తలు, సాయుధ కుకీ భూగర్భ గ్రూపులతో కాల్పులకు దిగారని వారు చెప్పారు.ఈ కాల్పుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదని అధికారులు తెలిపారు, కాల్పులు ఆగిపోయాయని కూడా పేర్కొన్నారు. అదనపు భద్రతా బలగాలను పరిసర ప్రాంతాలకు పంపించారు. కాంగ్పోక్పి జిల్లాతో సరిహద్దులను పంచుకునే, 2023, 2024 సంవత్సరాలలో కుకీ, మెయిటీ గ్రూపుల మధ్య పెద్ద ఎత్తున కాల్పుల ఘటనలు జరిగిన ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని సరిహద్దు గ్రామాలలో కాల్పుల శబ్దం ఉద్రిక్తత, భయాందోళనలను సృష్టించింది. ఇదిలా ఉండగా, జెడ్‌యుఎఫ్ ఎస్ కామ్సన్ ఒక ప్రకటనలో, ఖారం వైఫేలో ఉదయం 7.40 గంటల ప్రాంతంలో సాయుధ కుకీ గ్రూపులతో కాల్పులు జరిగాయని, అక్కడ అక్రమ గసగసాల సాగు, కుకీ సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ గ్రూపుల భూగర్భ శిబిరాల ఏర్పాటుతో సహా చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు నివేదికలు ఉన్నాయని పేర్కొంది. మే 2023 నుండి మణిపూర్‌లో జరిగిన జాతి హింసలో 260 మందికి పైగా మరణించారు. మెయిటీ సమాజానికి షెడ్యూల్ తెగ (ఎస్‌టి) హోదా కల్పించాలనే డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో 'గిరిజన సంఘీభావ యాత్ర'కుకీ వర్గాల మధ్య హింస ప్రారంభమైంది.

# తెలంగాణ ప్రాజెక్టులకు మోకాలడ్డు!


తెలంగాణ నీటి ప్రాజెక్టులను ముందుకుసాగనీయకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి ఆటంకాలు సృష్టిస్తున్నది. రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే, తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన నిర్లక్ష్యం ఇటీవల శాసనసభ సాక్షిగా 'పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం'పై జరిగిన చర్చ సందర్భంగా కళ్ళకు కట్టినట్లు స్పష్టమైంది. అదే అదునుగా తెలంగాణ వాటాను సైతం కబళించేలా శ్రీశైలం ప్రాజెక్టు ఎగువ నుంచి నీటిని తరలించుకుపోయేలా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా చేపట్టింది. దాదాపు 90 శాతానికి పైగా పనులను పూర్తి చేసినట్లు సమాచారం. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ జోక్యంతో పనులు నిలిచిపోయాయి. తాజాగా, పోలవరం నుంచి గోదావరి జలాలను సైతం మళ్ళించుకొని పోయేందుకు బనకచర్ల లింక్‌ను తలపెట్టింది. తెలంగాణ నుంచే అభ్యంతరాలే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో రూటు మార్చి నల్లమల సాగర్ పేరుతో ఆ ప్రక్రియను కొనసాగించే ఎత్తుగడకు నాంది పలికింది. అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు చోట్ల నీటిని నికర,మిగులు, వరద జలాల పేర్లతో శరవేగంగా తీసుకెళ్ళే ఎత్తులువేస్తోం ది.

> తెలంగాణ ప్రాజెక్టులకు తాము అడ్డం కాదంటూ చెబుతున్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరు 'నోటితో నవ్వి నొసటితో వెక్కిరించి'నట్లుగా ఉంది. ఆయన నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అందిస్తున్న ఆక్సిజన్‌తో కొనసాగుతున్న కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అన్ని విధాలుగా ఎపికే అండగా నిలబడుతున్నదనేది కప్పిపుచ్చలేని వాస్తవం.

నిజానికి ఉభయ నదులు తెలంగాణ మీదుగా ప్రవహిస్తున్నప్పటికీ, నీటిని ఒడిసిపట్టుకునే పెద్ద జలాశయాల నిర్మాణాన్ని ఉమ్మడి పాలకులు చేపట్టలేదు. ఇటు వైపు ఏవో సాకులతో ఆలస్యం చేస్తూ, తమ వైపు అనుమతులు లేకున్నా శరవేగంగా నీటిని భారీగా నింపుకునే రిజర్వాయర్లను వారు నిర్మించుకున్నారు. అత్యంత వెనుకబడిన రాయలసీమకు నీళ్ళు తరలించడం సబబే. అక్కడ 350 టిఎంసిలకు పైగా నీటిని నింపుకునే జలాశయాలు ఉన్నాయి. అదే సమయంలో, తలాపునే కృష్ణా నది జాలువారే నల్లగొండ జిల్లాలో ఫ్లోరిన్ భూతంతో తరాలు సతమతమైనప్పటికీ ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ ఇప్పటికీ పూర్తవలేదు. క్షామపీడిత పాలమూరులోని కల్వకుర్తి, నెట్టెంపాటు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలది అదే గతి. ఉమ్మడి పాలకులతో సమానంగా, తెలంగాణ ఏర్పడి 12 ఏళ్ళైనా కృష్ణా నది ప్రాజెక్టులను పూర్తి చేయడంలో స్వరాష్ట్ర పాలకుల వైఫల్యం ప్రజల పాలిట శాపంగా మారింది. అన్నిటికి ఒకే మందు జిందా తిలస్మాత్ అని ప్రచారం చేసుకొని, రూ.లక్ష కోట్లకుపైగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి మేడిగడ్డ బ్యారేజీ పగుళ్ళుబారి పడావుపడి ఉంది. దాని దిగువన అన్నారం, సుందిళ్ళలది దాదాపు అదే పరిస్థితి. గతం నుంచి ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టే గోదావరి జలాలు కిందకు తీసుకెళ్లేందుకు పెద్ద దిక్కుగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొన్ని రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు కొంత ఉపకరించినప్పటికీ, నల్లగొండ, పాలమూరు ప్రాజెక్టుల నిర్లక్ష్యం క్షమించరాని నేరమే.

కృష్ణా నది ప్రాజక్టులను దుమ్ము దులిపి, తిరిగి చేపట్టేందుకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం నీటి కేటాయింపులు ఉన్న కల్వకుర్తి, కోయిల్ సాగర్, ఎస్ఎల్‌బిసి సహా 16 ప్రాజెక్టుల డిపిఆర్‌లను సిద్ధం చేయాలని గత ఏడాది సెప్టెంబర్‌లో జిఒ నంబర్ 34ను జారీ చేసింది. ఆ ప్రాజెక్టులు కూడా అక్రమమైనవేనంటూ ఎపి ప్రభుత్వం అభ్యంతరపెడుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. తెలంగాణ ప్రాజెక్టులకు తాము అడ్డం కాదంటూ చెబుతున్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరు నోటితో నవ్వి నొసటితో వెక్కిరించినట్లుగా ఉంది. ఆయన నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అందిస్తున్న ఆక్సిజన్‌తో కొనసాగుతున్న కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అన్ని విధాలుగా ఎపికే అండగా నిలబడుతున్నదనేది కప్పిపుచ్చలేని వాస్తవం. ఇందుకు కృష్ణా జలాల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు రెండవ విడత టెలిమెట్రీల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకించడంతో వాటి ఏర్పాటు సాధ్యపడదని కృష్ణా నదీ జలాల నిర్వహణ బోర్డు తాజాగా నిరాకరించడమే ప్రత్యక్ష నిదర్శనం. ఎపి ప్రభుత్వం నిరాకరించినప్పటికీ, టెలీమెట్రీల ఏర్పాటుకు ఆ రాష్ట్రం వాటాను కూడా భరిస్తామని తెలంగాణ ప్రభుత్వం గతంలోనే రూ.4.18 కోట్లు బోర్డుకు దఖలు చేసింది. ఇప్పుడు ఎపి ఒత్తిడితోనే కేంద్ర జలశక్తి ఆదేశాలతో కెఆర్‌డబ్ల్యుఎంబి మనసు మార్చుకున్నదనేది వాస్తవం. అక్రమంగా నీటిని తరలించకపోతే, నీటి విడుదలను కొలిచే టెలీమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ఎందుకు అభ్యంతరం చెబుతుంది? చివరకు తెలంగాణ టెలిమెట్రీల ఏర్పాటుకు ఇచ్చిన నిధులను కూడా తిరిగి చెల్లించకుండా బోర్డు నిర్వహణ ఖర్చుల కోసం అట్టిపెట్టుకోవడం అత్యంత దారుణం.

కృష్ణా జలాలపై ప్రాజెక్టుల నిర్మాణాన్ని కొనసాగనీయకుండా, నీటి తరలింపు కొలత మీటర్లను ఏర్పాటు చేయనీయకుండా తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ మోకాలడ్డుతోంది. తాము మాత్రం కేంద్రం అండతో తమ ప్రాజెక్టుల విషయంలో ముందుకు సాగుతూనే ఉంది. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య సద్దుమణిగిన ఉద్రిక్తతలను తిరగదోడటానికి దారితీస్తుంది. కాకుండా, ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వాస్తవిక, ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో నీటి వినియోగ అంశాన్ని పరిష్కరించుకోవడం సబబు. ఆంధ్ర–తెలంగాణ మధ్య నదీజలాల పంపిణీని కేంద్రం సత్వరం తేల్చి ఇందుకు దోహదం చేయాలి. లేదంటే, ఇరు రాష్ట్రాల మధ్యే కాకుండా, ఎగువ రాష్ట్రాల మధ్య కూడా ఎడతెగని కయ్యాలు తప్పవు.



## కేంద్రం స్పందన బలహీనమైనది

**వెనిజులాలో అమెరికా చర్యకు బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రతిస్పందన 'బలహీనమైనది, విధేయమైనది' గా ఉంది. ప్రపంచం అసాధారణమైన, ప్రమాదకరమైన పరిణామాలను చూస్తోంది. అమెరికా వెనిజులా సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడం, ఆ దేశ అధిపతిని బందీగా తీసుకుంది. ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి, ఆర్థిక ఆంక్షల ద్వారా వెనిజులా ప్రజలను ఊపిరి ఆడకుండా చేయడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. వెనిజులాలో జరిగినది రేపు ఏ దేశానికైనా జరగవచ్చు. పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గామ్‌పై దాడి చేసినప్పుడు, భారతదేశం ప్రపంచ మద్దతును కోరింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సంఘీభావాన్ని నిర్మించడానికి విదేశాలకు ప్రత్యేక ప్రతినిధులను పంపింది. భారతదేశం అప్పట్లో కోరిన అదే అంతర్జాతీయ మద్దతు నేడు వెనిజులా ప్రజలకు అర్హమైనది.**

\- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్,



## సావిత్రిబాయి ఫూలే తోపాటు ఫాతిమా షేక్

మనదేశంలో ఆడపిల్ల చరిత్ర, వర్తమానం, భవిష్యత్ ను అక్షరాలతో వెలిగించిన జ్ఞానజ్యోతి సావిత్రిబాయి పూలే. ఆ జ్ఞానజ్యోతికి తోడైన మరో మహిళ ఫాతిమా షేక్. సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ 19వ శతాబ్దంలో మహారాష్ట్రలో మహిళల విద్యావ్యాప్తికి కృషి చేసిన తొలి మహిళా గురువులు. సావిత్రిబాయి భారతీయ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచింది. ఆమె విద్యా ఉద్యమంలో పాల్గొని ఆ కుటుంబానికి తోడుగా నిలిచిన దేశ తొలి ముస్లిం మహిళా టీచర్ ఫాతిమా షేక్. సావిత్రిబాయి పూలేతో కలిసి దళిత, ముస్లిం, బాలికల విద్యావ్యాప్తికి కృషి చేసింది. ఫాతిమా షేక్ 1831 జనవరి 9న పుణెలో జన్మించారు. సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావ్ పూలే ప్రోత్సాహంతో ఇంట్లోనే విద్యావంతురాలైనది. ఫాతిమా షేక్ ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ సహకారంతో విద్యనభ్యసించింది. సావిత్రిబాయి పూలేతో పాటు ఫాతిమా షేక్ అహ్మద్ నగర్‌లోని సింథియా ఫర్రార్ అమెరికన్ మిషనరీలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఫాతిమా సోదరుడు ఉస్మాన్ షేక్ ఇంట్లోనే పూలే దంపతులు 1848లో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. ఆ దంపతులు స్థాపించిన పాఠశాలల్లో ఫాతిమా షేక్ విద్య బోధించింది. భవిష్యత్ తరాల కోసం అవమానాలను, దాడులను సైతం భరించారు.

ఫాతిమా షేక్ సహకారం లేకుండా పూలే దంపతుల స్త్రీ, దళిత విద్యా ఉద్యమం పరిపూర్ణం కాదు. ముస్లిం మహిళగా కుల, మత భేదాలు వీడి సమానత్వ ఆలోచనలకు అండగా నిలబడి, భారతీయ స్త్రీవాదానికి పునాది వేశారు. సావిత్రిబాయి పూలే స్త్రీలను చైతన్యపరచడానికి 1852 లో 'మహిళా సేవ మండల్' సంఘాన్ని స్థాపించింది. లింగ వివక్షతకు, పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడింది.

కుల వ్యవస్థలో సామాజిక అణిచివేతను, మూఢత్వాన్ని పారద్రోలి 'సత్యాన్ని' శోధించడానికి 1873 లో భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి సత్యశోధక సమాజాన్ని ప్రారంభించినది. ఈ సంస్థ బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపింది. వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారు. బాల్యం లో వైధవ్యాన్ని అనుభవించే ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోశారు. సత్యశోధక్ సమాజ్ లోని 'మహిళా విభాగం' సావిత్రిబాయి నేతృత్వంలో పురోహితులు లేకుండానే వివాహాలను నిర్వహించారు. కరువు బారిన పడి అనాథలైన పిల్లలను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ రావు అనే అనాథ బాలుణ్ణి దత్తపుత్రుడిగా పెంచుకున్నారు. పూలే దంపతులు, ఫాతిమా షేక్ నుంచి అంబేద్కర్ వరకు బిసిలకు, దళితులకు, ముస్లింలకు చక్కటి అనుబంధం ఉండేదని స్పష్టమవుతుంది. నేడు ఆ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో బిసిల రిజర్వేషన్స్ కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో '42 శాతం రిజర్వేషన్ సాధన సమితి' పేరుతో ఉమ్మడి ఉద్యమం జరుగుతుంది.

**(మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి జనవరి 9)**

**సంపతి రమేష్ మహారాజ్**
7989579428

# రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతున్న కేంద్రం విధానాలు!



**ఉజ్జిని రత్నాకర్ రావు**
9490952646

కేంద్ర ప్రభుత్వం క్రమంగా ప్రాయోజిత పథకాల్లో తన వాటా నిధులను ఒక్కొక్క స్కీమ్ నుంచి మెల్లగా తగ్గించుకుంటున్నది. 2026 నూతన సంవత్సరమునుండి ఆ మేరకు రాష్ట్రాలపై పెను భారాలు మోపేందుకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్రాలకు అండగా నిలవాల్సిన కేంద్రం ప్రాయోజిత పథకాల్లో తన వాటా నిధులను భారీగా కోతలు పెట్టడం, నిబంధనల పేరుతో మొత్తం పథకాలను పక్కన పెట్టడం లాంటి చర్యలకు పూనుకుంటున్నది. గతంలో కొన్ని పథకాలకు ఉదారంగా నిధులు విడుదల చేసిన కేంద్రం ఇప్పుడు ప్రతి రూపాయికి లెక్కలు అడుగుతూ కఠిన నిబంధనలతో రాష్ట్రాల చేతులు కట్టేస్తున్నది. ఫలితంగా ఆయా పథకాల నిర్వహణ భారం అంతా రాష్ట్ర ప్రభుత్వాలపైనే పడుతున్నది. పలు సంక్షేమ అభివృద్ధి పథకాల్లో గతంలో 90:10 నిష్పత్తి, లేదంటే 75:25 నిష్పత్తిలో ఉన్న కేంద్రం, రాష్ట్రాల వాటాను.. ఇప్పుడు ఏకంగా 60:40 నిష్పత్తికి కేంద్రం మార్చేసింది. అంతేకాదు ఆయా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్రాలు తొలుత.. తన వాటా నిధులను చెల్లిస్తేనే ఆ తర్వాత కేంద్రం తాపీగా నిధులు ఇచ్చేలా రూల్స్ మార్చింది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను, స్థానిక అవసరాలను ఏమాత్రం పరిగణనలోనికి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో పథకాల స్వరూపాన్ని మార్చి వేయడంపై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. కేంద్రం తీరువల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్‌లో తెలంగాణ రాష్ట్రానికి దాదాపు రూ.3 వేల కోట్ల దాకా కోత పడే అవకాశం ఉన్నట్లు ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

**ఉపాధి నిధులలో భారీ కోత!**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ ఆజీవికా మిషన్'(వీబీ జీ రామ్ జీ)గా మార్చిన కేంద్ర ప్రభుత్వం.. కేవలం పేరులోనే కాదు పథకములోనూ సమూల మార్పులు చేసింది. గతంలో కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద 90% చెల్లిస్తే రాష్ట్రాలు కేవలం 10 శాతం దాకా భరించేవి. కూలీల వేతనాలు 100%, అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు 100% పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే చెల్లించేది. కేవలం మెటీరియల్ ఖర్చుల్లో మాత్రమే రాష్ట్రం 25% పెట్టుకునేది. కానీ కొత్తగా తెచ్చిన విబిజీ రాంజీ స్కీం కింద వేతనాలు, మెటీరియల్, అడ్మినిస్ట్రేషన్ అనే తేడా లేకుండా మొత్తం ఖర్చులు కేంద్రం రాష్ట్ర వాటా 60:40 నిష్పత్తిలో భరించాలని స్పష్టం చేసింది. కేంద్రం తెచ్చిన ఈ కొత్త విధానంతో రాష్ట్రానికి ఏటా రూ.1,300 కోట్ల దాకా భారం పడనుందని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు. నిజానికి ఏటా ఉపాధి హామీ పథకం కేటాయింపులను కేంద్రం తగ్గిస్తూ వస్తున్నది. కరోనా సమయంలో (2020–22) రాష్ట్రానికి ఏటా రూ.4,100 కోట్లకు పైగా నిధులు రాగా, ఆ తర్వాతికాలం లో ఇది రూ.2 వేల కోట్లకు పడిపోయింది. ఉపాధి నిధులను సరిగ్గా వినియోగించుకోవడంలేదని, పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొంటూ.. ఇలా రకరకాల సాకులతో కేంద్రం నిధులు నిలిపివేయడం రాష్ట్రానికి శాపంగా మారింది.

**ఆరోగ్య మిషన్ లోనూ అంతే..**

జాతీయ ఆరోగ్య మిషన్ అమలులోనూ కేంద్రం తీరు రాష్ట్రానికి శాపంగా మారింది. మొదట్లో ఈ పథకంలో కేంద్రం, రాష్ట్రాల నిధుల వాటా 75 : 25 ఉండగా ప్రస్తుతం 60:40 కి మార్చారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్ హెచ్ ఎం కింద కేంద్రం నుంచి రూ.985.34 కోట్లు విడుదల కావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ. 176.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లకు సంబంధించిన బ్రాండింగ్, లోగోల విషయంలో కేంద్రం విధించిన నిబంధనలను రాష్ట్రం పాటించలేదని సాకుతో వందల కోట్ల నిధులను కేంద్రం నిలిపివేసింది. దీంతో ఆసుపత్రుల నిర్వహణ, సిబ్బంది వేతనాల భారం అంతా రాష్ట్రం పైనే పడుతుంది. వాస్తవానికి ప్రజారోగ్యం రాష్ట్ర పరిధిలోని అంశమైనప్పటికీ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు కేంద్రం సూచించిన రంగులే వేయాలని, వాటికి 'ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్' అనే పేరు పెట్టాలని కేంద్రం జారీ చేసింది.

**అంగన్వాడీల భారం అంతా రాష్ట్రం పైనే:**

అంగన్వాడీ కేంద్రాల(ఐసిడిఎస్) పథకానికి వెన్నుదన్నుగా నిలిచిన కేంద్రం.. ఇప్పుడు నామమాత్రపు నిధులతో మమ అనిపిస్తోంది. గతంలో 90 శాతం నిధులను కేంద్రమే భరించగా, ఇప్పుడు ఆ వాటాను 60 శాతానికి తగ్గించుకుంది. కేంద్రం దృష్టిలో ఒక అంగన్వాడీ టీచర్ జీతం కేవలం రూ.4,500 మాత్రమే. ఇందులో కేంద్రము వాటా 60 శాతం అంటే రూ. 2,700 మాత్రమే. అంగన్వాడి హెల్పర్ కు కేంద్రం నిర్ణయించిన జీతం రూ.2,250లు. ఇందులో కేంద్రం ఇచ్చేది రూ.1,350 మాత్రమే. కానీ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు ప్రస్తుతం ప్రతినెల రూ.13,650 వేతనం ఇస్తుంది. ఇందులో కేంద్రం ఇచ్చేది రూ.2,700 మాత్రమే. మిగిలిన రూ.10,950 ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వం తమ ఖజానా నుంచి చెల్లిస్తుంది. అంటే టీచర్ల జీతాల్లో కేంద్రం వాటా 20 శాతం కూడా లేదు.



**సర్వ శిక్ష అభియాన్ :**

విద్యారంగానికి సంబంధించి సర్వ శిక్ష అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ వంటి పథకాలకు పూర్తిస్థాయి నిధులు కేంద్రం నుంచి వచ్చేవి. గతంలో ఆదర్శ పాఠశాలలు నిర్వహణకు కేంద్రమే చూసుకునేది. కానీ 2016 నుంచి కేంద్రం ఈ బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకోవడంతో రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్ ల నిర్వహణ టీచర్ల జీతాల భారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం పైనే పడింది. అలాగే సర్వ శిక్ష అభియాన్ కింద నిధులు పొందాలంటే రాష్ట్రం తన 40% వాటాను సకాలంలో జమ చేయాలని నిబంధన ఉంది. దీనివల్ల ఏటారు రూ. 600 నుంచి రూ.800 కోట్ల మేర రావాల్సిన నిధులు తరచూ నిలిచిపోతున్నాయి.

**మధ్యాహ్న భోజన పథకం:**

ఈ పథకానికి నిధులు 75 శాతం కేంద్రం నుంచి వచ్చేవి. నేడు 60: 40 కి తగ్గించడంతో రాష్ట్రం పైన అదనపు భారం పడుతుంది.

**గ్రామీణ సడక్ యోజన:** 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన' కింద గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి 90% నుంచి 100% నిధులను కేంద్రమే భరించేది. తాజా నిబంధనల ప్రకారం దీనిని 60:40 నిష్పత్తికి కుదించారు.

**'గ్రీన్ రెవల్యూషన్ కృషోన్నతి యోజన':** వ్యవసాయ రంగానికి అత్యంత కీలకమైన ఈ పథకానికి గతంలో 100% నిధులు కేంద్రమే ఇచ్చేది. ఇప్పుడు అది 60 శాతానికి పడిపోయింది.

**'పీఎం ఫసల్ బీమా యోజన' :** ఈ పథకానికి గతంలో 50:50 గా ఉన్న నిష్పత్తిని మరి దారుణంగా మార్చి, ఇప్పుడు కేవలం 25 శాతం మాత్రమే ఇస్తామని తేల్చిచెప్పింది.

**వరదలు వచ్చిన ఆదుకుంటలే :**

వరదలు, కరువు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులు ఇచ్చి రాష్ట్రాలకు అండగా నిలవాల్సిన కేంద్రం తీవ్ర వివక్షత చూపుతుంది. ఎస్‌టిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ నిధుల విడుదలలో రాజకీయ కోణంలో వ్యవహరిస్తూ, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు మొండి చేయి చూపుతోంది.

**వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి :**

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులను కూడా కేంద్రం నిలిపివేసింది. తెలంగాణలోని 9 వెనుకబడిన జిల్లాలకు ఏటా జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున కేంద్రం రూ 450 కోట్ల నిధులు ఇవ్వాలి. 2015–16 తర్వాత ఈ స్కీమును కేంద్రం రద్దు చేసింది. దీనివల్ల గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్రానికి రావలసిన నిధులు రూ. 2 వేలు కోట్లు నిలిచిపోయినవి.

**ఈ స్కీమ్స్ భారమంతా రాష్ట్రాలపైనే :**

దీనికి తోడు నేషనల్ ఈ గవర్నెన్స్ ప్లాన్, పోలీసుల ఆధునికీకరణ, ఫుడ్ ప్రాసెసింగ్ మిషన్ వంటి కేంద్ర ప్రాయోజత పథకాలను కేంద్రం పక్కన పెట్టింది. వీటి నిర్వహణకు గతంలో కేంద్రం నుంచి నిధులు వచ్చేవి. కానీ ఇప్పుడు ఈ పథకాలను కొనసాగించాలంటే రాష్ట్రమే సొంత నిధులను ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**హౌసింగ్ స్కీమ్:**

కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూల లో భాగంగా ఒక ఇంటికి అర్బన్ హౌసింగ్ కు రూ. 1.50 లక్షలు, రూరల్ హౌసింగ్ స్కీమ్ క్రింద రూ 0.75 లక్ష ఇస్తున్న నిధులను.. మెటీరియల్ కాస్ట్ పెరిగినందున ఇంటికి రూ. 2.5 లక్షలకు పెంచాలని కోరుతున్నా పెంచడం లేదు.

**కేంద్రం ఇచ్చే నిధుల్లో రాష్ట్రానికి భారీ కోత**

మొత్తంగా చూస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు క్రమంగా పడిపోతున్నాయి.

ఒక్క సెంట్రల్ సెక్టార్ స్కీమును చూస్తేనే 2022–23లో రూ. 25,830 కోట్లు ఉండగా, అది 2024–25 నాటికి సుమారు రూ. 17,595 కోట్లకు తగ్గింది. అదే సమయంలో కేంద్ర ప్రాయోజిత పథకాల వాటా 60:40 కి మారడంతో రాష్ట్రం తన వాటా కింద ఏటా అదనంగా రూ.3 వేల కోట్ల నుంచి రూ. 4 వేల కోట్లు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇది రాష్ట్ర అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కేంద్రం విధిస్తున్న ఈ ఆర్థిక ఆంక్షలు, నిధుల కోతలు రాష్ట్ర ప్రగతికి సంకెళ్లుగా మారుతున్నాయి.

ఫెడరలిజం స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్న ఈ విధానాలను మార్చాలని రాష్ట్రం ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడము అటుంచితే మొత్తం పథకాల తీరునే మార్చి వేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా పాలన సాగించాలి!

కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టిన తెలంగాణ ప్రభుత్వం ఈ సవాళ్లన్నింటిని ఎలా అధిగమిస్తుంది అనేది కూడా పెద్ద సవాలే. ఒకవైపు నిధులు, విధులు, అధికారం కోసం కేంద్రంపై పోరాడటం, మరోవైపు తన పరిపాలనలోని వైఫల్యాలను ఎప్పటికప్పుడు సరిచేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. తన పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంలో ఇంకా ఆత్మస్తుతి, పరనింద అనే మూస ధోరణిని పక్కనపెట్టి, ఇక నుంచైనా పాలనపై పూర్తి స్థాయిలో అది దృష్టి కేంద్రీకరించాలి.

# కవితకు ఏదీ రాజకీయ ప్రాతిపదిక?



**ఎస్.కె.జకీర్**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో కొత్త రాజకీయ పార్టీ పురుడు పోసుకోనుంది. పార్టీ ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణ అస్తిత్వం కోసం పనిచేసే పార్టీ అవసరం ఉందని, సామాజిక తెలంగాణ సాధన కోసం కలిసి నడుద్దామని కవిత పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే నిరంతరం తన పోరాటం ఉంటుందని, ప్రజాస్వామ్య పద్ధతిలో నడిచే తనకు అందరూ మద్దతివ్వాలని ఆమె కోరారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాలు 12 ఏళ్లలో ఏ మేరకు సాకారమయ్యాయి? ఇంకా ఏమేం చేయాలి? అనేది నిర్ధారించడానికి వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేశారు.ఆయా కమిటీలు ఈ నెల 17న స్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీ పదవికి కవిత చేసిన రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి శాసన మండలి సభ్యురాలిగా కవిత ఎన్నికయ్యారు. బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన రోజే ఆమె తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. చైర్మన్ అనుమతితో తన రాజీనామాకు దారితీసిన పరిస్థితు లు, ఇతర అంశాలను ఆమె మండలిలో వివరించారు. ఇష్టపూర్వకంగానే రాజీనామా చేశానని, దాన్ని ఆమోదించాలని కవిత కోరారు. కవిత అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని ఆమె రాజీనామాను ఆమోదించారు.

ఏదో ఒకరోజు తాను సిఎం అవుతానని కవిత భావిస్తున్నారు. ముఖ్యమంత్రి కావాలంటే తెలంగాణలో 60 సీట్లు కావాలి. కవిత ఏ రాజకీయ పార్టీ తరఫున అధికారంలోకి రావాలనుకుంటున్నారో తెలియదు. ఆమె ఎత్తుగడలు, వ్యూహరచన అయోమయంగా ఉన్నాయి. సొంత రాజకీయ పార్టీని కవిత ఏర్పాటు చేయగలరా? అలా ఏర్పాటు చేసినా ఆ పార్టీకి తెలంగాణలో స్పేస్ ఉందా? ఏ రాజకీయ పార్టీ ఏర్పాటుకు అయినా తప్పనిసరిగా ఒక భూమిక ఉండాలి. రాజకీయ ప్రాతిపదిక ఉండాలి. ప్రజల్లో ఆదరాభిమానులు లభించాలి. ప్రజల ఆమోదం లభిస్తే తప్ప ఆ పార్టీ హిట్ కాదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంతో ఏర్పడినందువల్ల టిఆర్ఎస్ కు 2001 నుంచి ప్రజలు కెసిఆర్ వెంట నడిచారు.

తెలంగాణ ఉద్యమం విజయవంతమైంది. ఎపి విభజన, తెలంగాణ రాష్ట్ర అవతరణ జరిగింది. కెసిఆర్‌కు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని ప్రజలిచ్చారు. ఎమ్మెల్సీ కవిత ఎలా సిఎం కాగలుగుతారో ఎవరికీ అంతుచిక్కడం లేదు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన భూ బాగోతాలు, ఫోన్ ట్యాపింగ్ వంటి నేరాలు ఘోరాల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు అసెంబ్లీ లోపలా, వెలుపలా రెండేండ్లుగా మాట్లాడుతూనే ఉన్నారు. ఇప్పుడు కొత్తగా కవిత గుప్పిస్తున్న ఆరోపణల గురించి మాట్లాడవలసి వస్తే,ఇక ఆమెకు బిఆర్ఎస్ దారులన్నీ మూసుకుపోతున్నట్లు



కనిపిస్తోంది. ఇక ఆమె కొత్త రాజకీయ పార్టీని స్థాపించడమో లేదా ఇప్పటికే ఉన్న ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరిపోవడమో తప్ప ప్రత్యామ్నాయమేదీ కనిపించడం లేదన్న విశ్లేషణలు వస్తున్నాయి. హిల్ట్ పాలసీ తెచ్చి భూములను ధారాదత్తం చేయడానికి బీజం వేసింది ఎవరు? డిస్టిలరీ భూములను ప్రైవేటుకు ఇవ్వలేదా? పలు సంస్థలను ఎంపిక చేసుకొని చేంజ్ ఆఫ్ ల్యాండ్ పేరిట ప్రభుత్వ భూములను మీరు ప్రైవేటుకు ధారాదత్తం చేయలేదా? దానిమీద సంతకం పెట్టింది కెటిఆర్ కాదా? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను డిఫెన్సులో పడవేశారు కవిత.

ఉద్యమ సమయంలో బిఆర్ఎస్ నాయకులు భారీ దోపిడీకి పాల్పడ్డారా? అలాగే కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతలు భూ కబ్జాలకు, దోపిడీకి పాల్పడ్డారా? ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఆరోపణలు ప్రకంపన లు రేపుతున్నవి.'' ఇంకో అడుగు ముందుకు వేసి ''ఏదో రోజు సిఎం నవుతా..మీ పని పడతా'' అని కూడా ఆమె హెచ్చరించారు. ఏడెనిమిది నెలలుగా కవిత వార్తల్లో ప్రధాన శీర్షికలో ఉంటున్నారు. పబ్లిసిటీ కోసం ఆమె ఇలా చేస్తున్నట్టు అనుకోలేం. ఆమెది ధర్మాగ్రహం అనికూడా అనుకోలేం. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అభియోగాల పై కవితను బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారు.

తెలంగాణ సాధించడంతోపాటు తొలిసారి తమ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో పార్టీ నాయకులు పెద్దఎత్తున అక్రమ సంపాదనకు పూనుకున్నట్టు సమాచారం ఆమె దగ్గర ఉన్నది.అయితే అదే సమయంలో కవిత సంపద వివరాలు కూడా బిఆర్ఎస్ నాయకులు సేకరించి పెట్టుకున్నారు.

కొందరు నాయకుల అక్రమాల చిట్టాను బయటపెడుతున్నందుకే వారు తన భర్త అనిల్ పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కవిత తెలిపారు.ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రెస్‌మీట్‌లో చేసిన ఆరోపణలను ప్రసారం చేసిన చానల్‌కు ఆమె లీగల్ నోటీస్ పంపించారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలతో బిఆర్ఎస్ పరువు బజారుకెక్కింది. కవిత ఎపిసోడ్ పై స్పందించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ 'ప్రతి ఇంట్లో ఉండే పంచాయతే'నని సింపుల్ గా తేల్చి పారేశారు. అయితే ఇంటి ముసలం అంత సులభంగా పోదు!

# చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

ఎస్పీ సునితారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి జిల్లా పరిధిలో చైనా మంజాను పూర్తిగా నిషేధించినట్లు జిల్లా ఎస్పీ సునితరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఉల్లంఘిస్తూ చైనా మంజాను విక్రయించినా, వినియోగించినా, లేదా దాని వల్ల ఎవరికైనా ప్రమాదం సంభవించినట్లయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని, జిల్లా వ్యాప్తంగా స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారయ్యే చైనా మంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగించడంతో పాటు, ప్రజలు, వాహనదారులు, వ్యక్తులకు ప్రాణాపాయం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గతంలో చైనా మంజాతో గాలిపటాలు ఎగురవేసే సమయంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, కొన్నిసార్లు గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా తీవ్రంగా గాయపడిన ఘటనలు నమోదయ్యాయని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యా నే చైనా మంజాపై సంపూర్ణ నిషేధం విధించబడిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

చైనా మంజా విక్రయాలు, వినియోగంపై పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఎక్కడా చైనా మంజా విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు చైనా మంజాను ఉపయోగించకుండా, ఎవరికీ హాని కలగని సాధారణ దారాలతో గాలిపటాలు ఎగురవేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గాలిపటాలు ఎగురవేసే వారు తప్పనిసరిగా కరెంటు స్థంభాలకు దూరంగా మైదానాలు వంటి సురక్షితమైన ప్రదేశాల్లోనే గాలిపటాలు ఎగురవేయాలని సూచించారు. అలాగే బిల్డింగులపై నుంచి గాలిపటాలు ఎగురవేసే వారు తగిన భద్రతా చర్యలు పాటించి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఎవరైనా చైనా మంజా విక్రయాలు లేదా వినియోగం గమనించినట్లయితే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.



## సేవ్ ఎన్విరాన్‌మెంట్.. సేవ్ పబ్లిక్‌స్కూల్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సేవ్ ఎన్విరాన్‌మెంట్‌సేవ్ పబ్లిక్‌స్కూల్ , యూత్‌ఫ‌ర్‌సేవా ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధరకాల పోటిలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12న స్వామి వివేకానంద జయంతి , జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణపరిధిలోని వివిధ పాఠశాలలకు 7,8తేదిలలో స్కూల్‌లెవల్ ఇంటర్మీడియట్ లెవల్, డిగ్రీస్థాయిలలో చిత్రలేఖన పోటిలు , వ్యాసరచన, ఉపన్యాస పోటిలను సేవ్ ఎన్విరాన్‌మెంట్, పబ్లిక్‌స్కూల్స్ యూత్‌ఫర్‌సేవ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈపోటిలలో ప్రతి పాఠశాలనుంచి ఒక్కొక్క కాంపిటిషన్‌లో ఇద్దరిని ఎంపిక చేయబడి 10వతేదిన స్థానిక శిశుమందిర్ పాఠశాలనందు సెలక్ట్‌కాబడినటువంటి విద్యార్థులకు ఫైనల్‌రౌండ్ ఈకాంఫిటిషన్స్ నిర్వహించబడును. కావున ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** ఆకలితో ఉన్నవారికి అన్నప్రసాదం పంపిణి చేయడం గొప్ప విషయమని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. గురువారం లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నప్రసాద పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జూలూరు రమేష్‌బాబు కుమారుడు జూలూరు రోహిత్ జన్మదినం సందర్భంగా అన్నప్రసాదం పంపిణీ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సామాజికసేవలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఎల్లప్పుడు అగ్రస్థానంలో ఉంటుందన్నారు. బస్టాండుకువచ్చిపోయే ప్రయాణికుల ఆకలి తీర్చేందుకు చేపట్టిన ఈకార్యక్రమం ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి కల్మిచర్ల గోపాల్, మెంబర్‌షిప్ కమిటిచైర్మన్ గుబ్బకిషన్, మాజీ కోశాధికారి గోవిందుశ్రీనివాస్, ప్రచార కార్యదర్శి దారమోనిగణేష్, శ్రీనివాస్, శివ, జగదీశ్వర్, మాచిపెద్ది అశోక్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ సమస్యల సాధన పిఆర్‌టియుతోనే సాధ్యం

పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షుడు వై.జనార్దన్ రెడ్డి

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముడుమాల నందు మండల విద్యాధికారి నిజాముద్దీన్ , గుడేబల్లూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్ పిఆర్‌టియుటిఎస్ 2026 డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పిఆర్‌టియు సంఘం అతి పెద్ద సంఘమని, అదే విధంగా పిఆర్టియు నాయకులు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం కృషి చేస్తూ పరిరక్షిస్తున్నారని కొనియాడారు. అనంతరం పిఆర్‌టియు టిఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు సంబంధించి పరిష్కరించబడ్డ ప్రతి సమస్య కూడా పిఆర్‌టియు తోనే సాధ్యమైంది అన్నారు. అత్యంత ప్రాధాన్య అంశం సాధ్యమైంది అన్నారు. అత్యంత ప్రాధాన్య అంశం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానము రద్దు కొరకు పిఆర్‌టియు ఉద్యమ బాట బట్టి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తుందని, త్వరలోనే సమస్యల సాధన కోసం రాష్ట్రం సంఘం పై జిల్లా శాఖ ఒత్తిడి తీసుకుని రావడానికి ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షులు దండు శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎంఆర్ అజయ్ కుమార్, ఉపాధ్యాయులు కార్యవర్గ సభ్యులు కురుమయ్య, శ్రీనివాస్, రమేష్, తిమ్మప్ప, మాధవి, హేమ, మీనా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## బిసిలు అందరం ఒకటవుదాం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో బిసి జాగృతి సేన నాయకుల సమావేశంలో బిసి జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత వార్షిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 11,405 కోట్లు కేటాయిందని గత ప్రభుత్వాలకంటే అధిక బడ్జెట్ కేటాయించమని గొప్పలు చెప్పిన బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిసిల సంక్షేమానికి 2426 కోట్ల రూపాయలను ఖర్చు చేశామని చెప్పడం బిసిల అభివృద్ధి పై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు. వార్షిక బడ్జెట్ కాలపరిమితి ముగుస్తున్న సమయానికి కేటాయించిన బడ్జెట్‌లో 25శాతం కూడా ఖర్చు చేయలేదని, ప్రతి వార్షిక బడ్జెట్‌లో అంకెలగారడి ఆర్భాటాలు తప్ప అభివృద్ధి శూన్యమని, బిసి విద్యార్థుల ఉపకార వేతనాలు, బకాయి ఫీజు రియంబర్సెమెంట్స్ నిధుల విడుదలకు, బిసి సంక్షేమ హాస్టళ్ల కు , బిసి గురుకులాలకు స్వంత భవనాల నిర్మాణానికి మిగిలిన బడ్జెట్ ను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జాగృతి సేన మండల అధ్యక్షులు గౌడుగు నర్సిములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, నియోజకవర్గం కార్యదర్శి రామస్వామి, మండల కార్యదర్శులు, సురభి, రఘు, చెన్నయ్య, శివ, శంకర్, కావాలి రమేష్ రామ్, అంజి తదితరులు పాల్గొన్నారు.




## సిఎం కప్ప క్రీడల్లో విద్యార్థులు, యువకులు భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/నర్వ :** సిఎం కప్పు క్రీడల్లో భాగంగా పాల్గొనేందుకు విద్యార్థులను గ్రామ యువకులను సన్నద్ధం చేసేందుకు గురువారం నర్వ మండల కేంద్రంలోని హై స్కూల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, హై స్కూల్ హెచ్ఎం నర్వ గ్రామ సర్పంచ్, టి హనుమంత రెడ్డి, నర్వ ఎంపీడీవో, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షులు శరణప్ప, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్దలి ఆంజనేయ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అశోక్ గౌడ్, ఎం. శశిందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నర్వ ప్రధాన కార్యదర్శి బోయపాటి నరసింహ పాల్గొన్నారు. ట్రైనీ కలెక్టర్ ప్రణాయ్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ సీఎం కప్పులో భాగంగా నిర్వహించే క్రీడల్లో పాల్గొని క్రీడల్లో ఆసక్తి కనబరిచి ఉల్లాసంతో చదువును చదవాలని దానితో మీరు అనుకునన లక్ష్యాలను చేరెందుకు ఇదోక సదవకాశమని దీనిని గ్రామంలోని యువకులు విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.



## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/కొత్తకోట :** గురువారం జిల్లా కలెక్టర్ కొత్తకోట మండల పరిధిలోని పామాపురం, అప్పరాల ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం సందర్శించి యూరియా విక్రయ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీ చేసే ప్రతి విక్రయ కేంద్రం వద్ద అక్కడికి వచ్చే రైతుల కోసం షామియానాతో పాటు కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా యూరియా కొనుగోలు కోసం వచ్చే రైతులను ఎక్కువ సేపు వేచి ఉంచనీయకుండా త్వరగా వారికి కావాల్సిన యూరియా ఇచ్చి పంపే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు యూరియా విక్రయించినప్పుడు సంబంధిత రిజిస్టర్లలో వారి పాస్ బుక్ వివరాలతో పాటు, ఎంత విక్రయిస్తూన్నారనే సమాచారాన్ని కూడా నమోదు చేయాలన్నారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకం ఆధారంగా పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి యూరియా సెల్ పాయింట్ వద్ద వ్యవసాయ శాఖ తరపున తప్పనిసరిగా ఒక ఏఈఓ ను కేటాయించి పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. అదే విధంగా ప్రతి యూరియా విక్రయ కేంద్రాల వద్ద అక్కడ యూరియా నిల్వకు సంబంధించిన బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. దాంతో పాటుగా సమీపంలోని ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలలో ఎక్కడ ఎంత స్టాకు ఉందని వివరాలను కూడా బోర్డుపై ఏర్పాటు చేయాలన్నారు.



## మంచినీటి సమస్యకు పరిష్కారం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల కేంద్రంలోని బెక్కెం రోడ్లో, చర్చి వద్ద తాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు ఆదేశాల మేరకు కొత్తగా బోరు వేయించారు. ఈ బోరు ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి రానుందని గ్రామ సర్పంచు మీసాల పర్వతమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య తెలిపారు. చర్చి వద్దకు వచ్చే ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రమవడంతో, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు తక్షణమే చర్యలు చేపట్టి, సంబంధిత అధికారులకు బోరే వేయించేలా ఆదేశాలు జారీ చేశారు. బోరులో పుష్కలంగా నీళ్లు రావడంతో చర్చి పరిసర ప్రాంత ప్రజలతో పాటు బెక్కెం రోడ్డులో ఉండే రైతులకు సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ముఖ్యంగా వేసవికాలంలో నీటికొరత సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రంలో గ్రామ ఉపసర్పంచు బాలపీర్, నాయకులు వెంకట్‌రెడ్డి, కావాలి మహేష్, భరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

**ప్రజాపక్షం/అయిజ :** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ స్మైల్ 12 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ మురళి, జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ తెలిపారు. అయిజ మండల కేంద్రంలో కిరాణం షాపులు, వెల్డింగ్ మరియు బైక్ మెకానిక్ షాపులు, హోటల్ తనిఖీ చేశారు. వివిధ పనులలో ఉన్న 18 సంవత్సరాలు లోపు 05 మంది బాలలను గుర్తించి రెస్క్యూ చేయడం జరిగింది. 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, ఎస్ఐ మురళి, కానిస్టేబుల్ భరత్, శిల్పా, చైల్డ్ లైన్ సిబ్బంది, పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/అడ్డాకుల :** 37వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా గురువారం పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో శాఖాపూర్ టోల్ ప్లాజా వారు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, అడ్డాకుల ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలని, హెల్మెంట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, సెల్‌ఫోన్ ఉపయోగించి వాహనాలు నడుపరాదని, అతివేగంతో ప్రయానించవద్దని, అధిక లోడ్ వేయవద్దని సూచించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణం చేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సేఫ్టీ ఇంచార్జి రఘునందన్ గౌడ్, షిఫ్ట్ ఇంచార్జి సురేందర్ రెడ్డి, రూట్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 3న జడ్చర్లకు సిఎం రాక

బాదేపల్లి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల లోగో ఆవిష్కరణలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఫిబ్రవరి 3న బాదేపల్లి హై స్కూల్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారని స్థానిక ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు. గురువారం హై స్కూల్ శతాబ్ది ఉత్సవ కమిటీ రూపొందించిన లోగోను ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 3న ట్రిపుల్ ఐటి శంకుస్థాపన కు సీఎం రానున్నారని, ముందుగా హై స్కూల్ ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఐఐఐటి శంకుస్థాపన చేస్తారన్నారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకుందామన్నారు. ఉత్సవాలు జయప్రదం చేసేందుకు తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని, ఉత్సవ కమిటీ, పాఠశాల ఉపాధ్యాయ బృందం సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. ఉత్సవాలకు సీఎంతో పాటు ముగింపు వేడుకలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ఆహ్వానిద్దామన్నారు.

సమీక్ష సమావేశంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి రమణాచార్యులు, ఆహ్వానకమిటీ సభ్యులు యంఈఓ మంజులాదేవి, గోవింద్ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, కమిటీ సభ్యులు జయప్రకాష్, ఆకుల వెంకటేశ్, సూరి, మేడిశెట్టి రామకృష్ణ, శ్రీహరి, సంతోష్, రాజు గౌడ్, టైటాస్, సునీల్, శంకర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## రూ.8లక్షల సొంత నిధులతో అంబులెన్స్ సౌకర్యం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గ్రామ సర్పంచ్ రాజేందర్ గౌడ్

**ప్రజాపక్షం/మక్తల్ :** మండలంలోని మంథన్ గోడ గ్రామానికి నూతనంగా సర్పంచ్ గా ఎన్నికైన రాజేందర్ గౌడ్. ఇచ్చిన మాట మేరకు 8 లక్షల రూపాయల సొంత నిధులతో అంబులెన్స్ వాహనాన్ని గురువారం కొనుగోలు చేశారు. పూర్తిగా తన సొంత నిధులతో గ్రామానికి అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన రాజేందర్ గౌడ్. సర్పంచ్ గా ఎన్నికైన తర్వాత తొలిగా అంబులెన్స్ వాహనాన్ని కొనుగోలు చేశారు. అయితే వాహనంలో వైద్య పరికరాలు, ఇతరత్రా అమిర్చ, ఈనెల 26 వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబులెన్స్ వాహనాన్ని అధికారికంగా గ్రామపంచాయితీకి అందజేస్తానని తెలిపారు. కొనుగోలులో



సర్పంచ్ రాజేందర్ గౌడ్ తో పాటు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల సాధన పిఆర్‌టియుతోనే సాధ్యం

పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముడుమాల నందు మండల విద్యాధికారి నిజాముద్దీన్ , గుడేబల్లూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్ పిఆర్‌టియుటిఎస్ 2026 డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పిఆర్‌టియు సంఘం అతిపెద్ద సంఘమని, అదే విధంగా పిఆర్టియు నాయకులు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం కృషి చేస్తూ పరిరక్షిస్తున్నారని కొనియాడారు. అనంతరం పిఆర్‌టియుటిఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపాధ్యాయులకు సంబంధించి పరిష్కరించబడ్డ ప్రతి సమస్య కూడా పిఆర్‌టియు తోనే సాధ్యమైంది అన్నారు. అత్యంత ప్రాధాన్య అంశం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానము రద్దు కొరకు పిఆర్‌టియు ఉద్యమ బాట పట్టి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తుందని, త్వరలోనే సమస్యల సాధన కోసం రాష్ట్ర సంఘంపై జిల్లా శాఖ ఒత్తిడి తీసుకుని రావడానికి ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షులుదండు శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎంఆర్ అజయ్ కుమార్, ఉపాధ్యాయులు కార్యవర్గ సభ్యులు కురుమయ్య, శ్రీనివాసు, రమేష్, తిమ్మప్ప, మాధవి, హేమ, మీనా కుమారి, తదితరులు పాల్గొన్నారు.



## 'ముడా' ద్వారా నగరంలో శాశ్వత అభివృద్ధి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ నగర అభివృద్ధి దిశానిర్దేశం చేసే కీలక ఘట్టంగా ముడా (మహబూబ్ నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) లోగోను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, పరిగి ఎమెల్యే రాంమోహన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ లోగో కేవలం ఒక గుర్తు మాత్రమే కాకుండా, ప్రణాళికాబద్ధమైన పట్టణ విస్తరణ, ఆధునిక మౌలిక వసతులు, పారదర్శక పాలన, ప్రజల అవసరాలకు అనుగుణమైన అభివృద్ధి అనే లక్ష్యాలకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ముడా ద్వారా మహబూబ్ నగర్ నగరాన్ని శాశ్వత అభివృద్ధి మార్గం లో నడిపించాలనే ప్రభుత్వ సంకల్పం ఈ ఆవిష్కరణలో ప్రతిఫలించిందన్నారు. ఈ కార్యక్రమంలో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/అడ్డాకుల :** వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జన్మదిన వేడుకలు మండల పరిధిలో బలీదుపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ సర్పంచు కోట్ల కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి సర్పంచు కరుణాకర్ రెడ్డి, ఉపసర్పంచు శివ రాధ వార్డు మెంబర్లు కలిసి కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు కోట్ల కరుణాకర్ రెడ్డి, ఉపసర్పంచు ఎర్రజమున, రాధ శివ, వార్డు మెంబర్లు ఎండి రసూల్ , ఎస్.రాములు, మందకృష్ణ, దేవరాజ్ యాదవ్, ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడ్డాకుల విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపిక

**ప్రజాపక్షం/అడ్డాకుల :** పిఎం శ్రీ ఉన్నత పాఠశాల 6,7న జరిగిన జిల్లా స్థాయి టోర్నమెంట్ పోటీలలో అడ్డాకుల పిఎం శ్రీ పాఠశాలకు ప్రథమ స్థానం దక్కించుకుని రాష్ట్రస్థాయికి ఎంపికయింది. లాంగ్ జంప్ అథ్లెటిక్ విభాగంలోకి పి.సందీప్ మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పిడి మంజుల తెలిపారు. షార్ట్ ఫుట్ విభాగంలో యశ్వంతు మూడవ స్థానం దక్కించుకున్నారు. ప్రధాన ఉపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## మక్తల్ డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించిన నిమ్స్ నెఫ్రాలజీ బృందం

**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ సెంబర్ ను నిమ్స్ నెఫ్రాలజీ బృందం గురువారం ఉదయం పరిశీలించింది. నిమ్స్ నేఫరాలజీ అసోసియేటెడ్ డాక్టర్ నిరంజన్ గణేష్, డాక్టర్ పార్వతి, సౌత్ డిజిఎన్ అసోసియేట్ మేనేజర్ సిబ్గతుల్లా.. డయాలసిస్ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పరికరాలను తనిఖీ చేయడం తో పాటు రోగులను కలిసి వారి ఇబ్బందుల గురించి ఆరా తీశారు. డయాలసిస్ పేషెంట్లకు పరిస్థితి విషమిస్తే నిమ్స్ పరిధిలో నెఫ్రాలజీ విభాగానికి రావాలని సూచించారు. వారితో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినుత, డయాలసిస్ సిబ్బంది లింగప్ప, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాపక్షం/ఐజ :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగ మాస్టర్ సూర్య ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సంకాపురం గ్రామంలో రామకృష్ణ ధ్యాన మందిరంలో చిన్నారులతో యోగా చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగ చేయాలని సూచించారు. యోగా ద్వారా మేధాశక్తి పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సేవాసమితి సభ్యులు సత్యనారాయణ, కృష్ణ,గోపాల్, తిమ్మప్ప, బజారి, తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్‌దిన్నే గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీలో పరిశీలన

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** గోపాల్ దీన్నే లోని ఎస్సీ కాలనీలో మురికి కాలువలు , చెత్తాచెదారం పేరుకుపోయిన ప్రాంతాలను గ్రామ సర్పంచు దొడ్ల కవిత, గ్రామ కార్యదర్శి కరుణాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.బాల్‌రెడ్డి గ్రామ పంచాయితీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న పారిశుధ్య పరిస్థితులపై ఆరా తీసిన సర్పంచు దొడ్ల కవిత, మురికి కాలువలను వెంటనే శుభ్రం చేయాలని, చెత్తాచెదారం పూర్తిగా తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమం లో వార్డు మెంబర్ చంద్రయ్య ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఎస్సీ కాలనీలో శుభ్రతను మెరుగుపరచాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. గ్రామపంచాయితీ సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఫిర్యాదుదారులకు, బాధితులకు భరోసా కల్పించాలి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** పోలీస్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు బాధితులకు పోలీసు అండగా ఉన్నారనే నమ్మకం, భరోసా కల్పిస్తూ వారి పట్ల అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని వనపర్తి డిఎస్పి వెంకటేశ్వర రావు అన్నారు. పోలీస్టేషన్ తనిఖీలలో భాగంగా వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వర్‌రావు వీపనగండ్ల పోలీస్ స్టేషన్ ను సందర్శించి తనిఖీ చేశారు. పోలీస్టేషన్లో రికార్డ్సును, పరిసరాలను తనిఖీ చేసి పోలీస్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారేజ్, టెక్నికల్ రూం. పరిసరాలను పరిశీలించారు. పోలీ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి. పెండింగులో ఎస్సై కె.రాణిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పోలీసు అధికారిని కేటాయించి విపిఓ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ, గ్రామాలకు సంబంధించిన విపిఓలు రోజు గ్రామాలను సందర్శించి అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని గ్రామాలలో ప్రజలతో స్నేహపూర్వకమైన సంబంధాలు కొనసాగించాలని, ముఖ్యంగా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా గస్తీ నిర్వహించాలన్నారు. పోలీస్టేషన్లో స్టేషన్ రైటర్స్, సెక్షన్ ఇంచార్జి, పెట్రోకార్, రిసెప్షన్ లాంటి వర్టికల్స్ కచ్చితంగా అమలు చేయాలని సూచించాలన్నారు. గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి అన్నారు. రాత్రి సమయాలలో మరింత పటిష్ఠంగా గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తు నందు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సరైన సమయంలో దర్యాప్తు చేసి కోర్టుల నందు చార్జిషీటు దాఖలు చేసినప్పుడు బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



## పచ్చలకట్ట సోమేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి పట్టణంలో ఎంతో పురాతన ప్రసిద్ధి చెందిన పచ్చలకట్ట సోమేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి చెయ్యడం జరుగుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ పచ్చలకట్ట సోమేశ్వర ఆలయం రోడ్డు విస్తరణ పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభించారు. సోమేశ్వరాలయం ప్రధాన అర్చకులు కప్పగంతుల నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎండి.అవేస్ చిస్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, తంగళ్ళపల్లి రవి కుమార్, కుక్కదువ్వు సోమయ్య, కూర వెంకటేష్ పాల్గొన్నారు.

## బహిరంగ సభను జయప్రదం చేద్దాం

### భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన



**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్లచెరువు)** : ఈనెల 18న లక్షలాది మందితో ఖమ్మం జిల్లాలో జరిగే సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన కోరారు. ఈ బహిరంగ సభను పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాలలో జిల్లా, మండల కేంద్రాలలో ప్రచారంలో భాగంగా మేళ్లచెరువు మండల కేంద్రంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు సిపిఐ నాయకుడు సోమగాని మల్లయ్య ఇంటి వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమాన పనికోసం, సమాన వేతనం కోసం వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినటువంటి మహిళా నాయకురాళ్ళ వారి యొక్క సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ముగ్గులపోటీలలో పాల్గొన్న వారికి మేళ్లచెరువు గ్రామ సర్పంచ్ బచ్చు పద్మ శ్రీనివాస్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గొంగరెడ్డి భద్రారెడ్డి, చీరాల ఎలమంద, సోమగాని మల్లయ్య, ఆడ శ్రీను, గంగారెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల సాధనకు సిపిఐ పోరాటం



**ప్రజాపక్షం/చిట్యాల:** జనవరి 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ పార్టీ శతాబ్ధి ఉత్సవాల ముగింపు బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు జిల్లా సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో గురువారం రోజున బహిరంగ సభ గోడ పత్రికను విడుదల చేసిన సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్ర్యానికి ముందు ఆవిర్భవించి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. గత 100 సంవత్సరాలుగా పేద ప్రజల అభ్యున్నతి కోసం, కార్మిక హక్కుల సాధన కోసం పోరాటం చేసిన పార్టీ అని అన్నారు. ప్రపంచంలోని 40 దేశాల ప్రతినిధులు హాజరయ్యే బహిరంగ సభలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, పట్టణ శాఖ అధ్యక్షులు షేక్ షరీఫ్, నాయకులు దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై బాల కార్మిక నిషేధ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అడిషనల్ ఎస్పి రమేష్ హెచ్చరించారు.జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ, లేబర్ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇటుకబట్టీల యాజమాన్యాలు, నిర్వాహులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి మాట్లాడుతూ ఇటుకబట్టీలలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు చదువు, ఆరోగ్యం, భద్రత కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని పిల్లలను పనిలో పెట్టకుండా ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.బాలకార్మికులను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం అందిన పక్షంలో పోలీస్ శాఖ,లేబర్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి సంబంధిత యాజమాన్యాలపై చైల్డ్ లేబర్ యాక్ట్, జువెనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ కృష్ణయ్య, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ అరుణ, వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారి హరిత, మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అరుంధతి, ఏ.హెచ్.టి.యూ ఎస్ఐ రంగారెడ్డి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ గణేష్,ఇటుకబట్టీల యాజమాన్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పేద ప్రజల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన 12, 50,000 రూపాయల విలువగ ల చెక్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# విద్యతో పాటు క్రీడలపై దృష్టి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ** : మానసికంగా,శారీరకంగా దృఢంగా ఉండేందుకు విద్యతోపాటు,క్రీడలు ముఖ్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.గురువారం ఆయనచర్లపల్లి వద్ద ఉన్న విపస్య పాఠశాలలో నిర్వహించనున్న 2రోజుల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మనిషి చురుకుగా ఉండడానికి క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. కొన్ని పాఠశాలలు అధిక జీపీఏలు సాధించాలన్న లక్ష్యంతో విద్య పైన దృష్టి సారిస్తున్నాయని, క్రీడల పట్ల కూడా దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో భాగంగా ఒక్కొక్కటి 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని,వచ్చే సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభం అవుతాయని మంత్రి తెలిపారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటవుతున్నందున భవిష్యత్‌లో నల్లగొండను స్మార్ట్ సిటీగా ఏర్పాటు చేస్తామని,ఆర్ అండ్‌బి ద్వారా 200 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని,రూ.700 కోట్లలతో పట్టణంలో భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తున్నామని,నల్లగొండను హైదరాబాద్ కు మోడల్ గా చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు మంత్రి తెలిపారు .ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 12 కోట్ల రూపాయలతో పట్టణంలోని బొట్టుగూడ ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం జరిగిందని, త్వరలోనే ఈ పాఠశాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో క్రీడలు చాలా అవసరమని, శారీరకంగా, మానసికంగా ఉండేందుకు క్రీడలు తోడ్పడతాయని అన్నారు. ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ , డిటిసి వాణి, పాఠశాల యాజమాన్యం, తదితరులు ఉన్నారు.

### సురక్షిత ప్రయాణమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/చిట్యాల:** జాతీయ రహదారిపై ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరుకోవాలని, దానికి కావల్సిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, ఎస్‌పి శరత్ చంద్రలతో కలిసి గురువారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పండుగకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లే వారే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, కోదాడ, సూర్యాపేట, మిర్యాలగూడ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్ళే వారి కోసం పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకునేలా ప్రణాళికలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సందర్భంగా రోడ్డు మరమ్మత్తులు జరుగుతున్న పలు ప్రదేశాలను ఆయన పరిశీలించి జిల్లా కలెక్టర్, ఎస్‌పికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నక్షా సర్వేకు ప్రజలు సహకరించాలి

### మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నక్షా అనేది భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మిర్యాలగూడ మున్సిపాలిటీలో చేపడుతున్న ఒక ఫ్లాగ్‌షిప్ పథకం అని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. ఈ పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లోని భూములు, ఆస్తులపై భౌగోలిక సమాచార ఆధారిత కడాస్ట్రల్ సర్వే నిర్వహించి, వ్యవసాయ భూముల తరహాలోనే పట్టణ భూములకు కూడా హక్కుల రికార్డు ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలో పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా పది మున్సిపాలిటీల్లో అమలు చేయడానికి ఎంపిక చేశారని, వాటిలో మిర్యాలగూడ మున్సిపాలిటి కూడా ఒకటన్నారు. ప్రాజెక్టు కింద మిర్యాలగూడ మున్సిపాలిటి పరిధిలోని అన్ని ఆస్తులపై వివరణాత్మక పట్టణ సర్వే నిర్వహించి కడాస్ట్రల్ రీసర్వే చేపడ్తారన్నారు. ఇందుకోసం సర్వే ఆఫ్ ఇండియా ద్వారా ఫిబ్రవరి నెలలో విమాన సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. పట్టణానికి సంబందించి 2డి ఆర్థో రెక్టిఫైడ్ చిత్రాలు, 3డి భౌగోలిక డేటా రూపొందించబడుతుందన్నారు. అనంతరం సర్వే డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు జీఎన్ఎస్ఈడీ రోవర్లు, డేటా సేకరణ టాబ్లెట్ల సహాయంతో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. పట్టణ ప్రజలు ఇంటికి సంబంధించిన వివరాలు తెలపాలన్నారు. కేంద్ర ప్రభు త్వం నిర్వహిస్తున్న నక్షాకి పట్టణ ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. సర్వేలో మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ అధికారులు వస్తారన్నారు.

## జగన్ సాక్షిగా కెసిఆర్ 'నీళ్ల దొంగతనం' బహిర్గతం

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి** : రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. జగన్ మాటలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జరిగిన నీళ్ల దోపిడీ, కేసీఆర్ జగన్ మధ్య సాగిన చీకటి ఒప్పందాలు బయటపడ్డాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాడు రాయలసీమ వెళ్లి జగన్ పెట్టిన రొయ్యల పులుసు విందులో పాల్గొన్న కేసీఆర్, ఆ సాన్నిహిత్యంతో తెలంగాణ రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన మండిపడ్డారు. తాను సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ సహకారంతోనే కృష్ణా జలాలను అక్రమంగా తరలించానని జగన్ స్వయంగా అంగీకరించడం కేసీఆర్ చేసిన ద్రోహానికి నిదర్శనమని చామల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలకు జగన్ మాటలే సమాధానమని ఎంపీ స్పష్టం చేశారు. కృష్ణా నదీ జలాల విషయంలో, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో రేవంత్ రెడ్డిని కార్నర్ చేయాలని చూసిన బీఆర్ఎస్ కుట్రలు నేడు భగ్నమయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రం కంటే ఎక్కువగా తెలంగాణ నీళ్లను బీఆర్ఎస్ హయాంలోనే ఏపీ దోచుకుందని జగన్ బాహాటంగా చెప్పడం చూస్తుంటే, కేసీఆర్ ఆశీర్వాదంతోనే తెలంగాణ రైతులను జగన్ మోసం చేశారనేది స్పష్టమవుతోందని అన్నారు. నాడు జగన్ కోసం దక్షిణ తెలంగాణ రైతులను ఎండబెట్టిన కేసీఆర్ పాపం నేడు బహిర్గతమైందని చామల విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీళ్ల విషయంలో గట్టిగా పట్టుబట్టడం వల్లే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడు వెనకడుగు వేయాల్సి వచ్చిందని జగన్ స్వయంగా క్లారిటీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ నీళ్ల వాటాల విషయంలో ఏమాత్రం రాజీ పడబోమని అసెంబ్లీలో రేవంత్ రెడ్డి గర్జించిన మాటలను జగన్ ఇప్పుడు అంగీకరించడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన కొనియాడారు. కేసీఆర్, జగన్ లాలూచీ పడి చేసిన అక్రమ నీళ్ల తరలింపుపై తెలంగాణ సమాజం ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.



## రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్

**ప్రజాపక్షం/నల్లగొండ** : రైతుల ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఏ. సురేంద్రమోహన్ అన్నారు .గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తో కలిసి వ్యవసాయ , హార్టికల్చర్, మార్కెటింగ్ .సహకార శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.రైతులకు అదనపు ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.2047 విజన్ డాక్యుమెంటరీ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి, ఆదాయం పెంచడానికి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ రంగంలో సాగు విస్తీర్ణం, పంటల దిగుబడి, నాణ్యమైన విత్తనాల సరఫరా, ఎరువులుపురుగుమందుల లభ్యతపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలను సమయానుకూలంగా అందించాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులదేనని అన్నారు.ఉద్యాన పంటల విస్తరణ, నర్సరీల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి పద్ధతుల అమలు, పంట అనంతర నిర్వహణపై ఉద్యాన శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ప్రభుత్వం స్థలం ఉంటే ప్రతి 50 కిలోమీటర్ల కు ఒక ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలని రైతులకు ఆదాయం పెరిగే విధంగా అవకాశం కల్పించాలని, అప్పుడే నల్లగొండ హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చెందుతుందన్నారు.జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని అంశాలపై క్షేత్రస్థాయిలో అధికారులు తో సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో యూరియ ఇతర అన్ని పథకాలపై అధికారులతో సమీక్షించి రైతులకు పూర్తి స్థాయిలో అందేలా పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్,డిసిఓ పత్య నాయక్ ,జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, హార్టికల్చర్ అధికారి సుభాషిని హాజరయ్యారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

**ప్రజాపక్షం/హాలియా:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని దానికి అనుమానంగా కష్టపడి చదవాలని జిల్లా విద్యాధికారి బిక్షపతి అన్నారు. గురువారం హాలియాలోని కేజీబీవీ, గురుకుల పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో స్టోర్ రూములను, వంట గదులను, భోజనము తయారు చేసే విధానాన్ని పరిశీలించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను బాలికలు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంట మండల విద్యాధికారి ముచ్చర్ల శ్రీను, కేజీబీవీ ఎస్ ఓ హైమావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత తదితరులు ఉన్నారు.

## భవిష్యత్ గురించి కలలు కనండి.. సాకారం చేసుకోండి

### సూర్యాపేట జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి లక్ష్మి శారద



**ప్రజాపక్షం/సూర్యాపేట** : విద్యార్థులు బంగారు భవిష్యత్ నిర్మించుకునేందుకు కలలను కని వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మి శారద అన్నారు. జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట పట్టణంలోని కోర్టు భవనం నుండి సంతోష్‌బాబు చౌరస్తా మీదుగా పిఎస్ఆర్ సెంటర్ నుండి పోస్టు ఆఫీస్ మీదుగా జూనియర్ కళాశాల వరకు డ్రగ్ ఫ్రీ ఇండియా అవగాహన ర్యాలీలో జిల్లా ఎస్‌పి కె నరసింహ, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌లతో కలిసి జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మి శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో జిల్లా జడ్జి మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి చాప కింద నీరులా వ్యాపించి యువత జీవితాలను నిర్వీర్యం చేస్తుందని వాటిని సమాజం నుండి నిర్మూలించేందుకు జిల్లాలోని పరిపాలన, పోలీస్, న్యాయ శాఖలు కృషి చేస్తున్నాయని అన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా భారతదేశంలో డ్రగ్స్‌ను దూరం చేయుటకు డ్రగ్ ఫ్రీ ఇండియా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని డ్రగ్స్ ఉపయోగించడం వల్ల జీవితాలు, కుటుంబాలు ఆగమవుతున్నాయని డ్రగ్స్ అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులు సమాజంలో కలహాలు సృష్టించి అభివృద్ధి చెందకుండా చేసేందుకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎస్‌పి కె నరసింహ మాట్లాడుతూ యువత భారతదేశ గొప్ప వనరులని, బావి భారత పౌరులని సమాజం నుండి గంజాయి, డ్రగ్స్ తొలగించేందుకు విద్యార్థులే ప్రచారకర్తలుగా, అంబాసిడర్‌గా మారాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం జిల్లా ఎస్‌పి అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. డ్రగ్స్ ఫ్రీ ఇండియా ర్యాలీకి విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సూర్యాపేట పట్టణ వీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు, ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ జడ్జి అపూర్వ రవళి, సెకండ్ ఎడిషనల్ జూనియర్ జడ్జి మంచాల మమత, బార్ అసోసియేషన్ చైర్మన్ లింగయ్య, సెక్రటరీ రాజు, ఆర్‌డిఓ వేణుమాధవ్, డిఎస్‌పి ప్రసన్నకుమార్, జిల్లా అధికారులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిటి రోడ్డుకు నిధులు మంజూరుకు కృతజ్ఞతగా పాలాభిషేకం

**ప్రజాపక్షం/నల్లగొండ (శాలిగౌరారం):** శాలిగౌరారం మండలం భైరవునిబండ నుండి నక్కలపల్లి గ్రామం వరకు 7 కిలోమీటర్లు బిటి రోడ్డుకు రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్‌అండ్‌బి శాఖ సినిమా ఆటోగ్రఫీ శాఖ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,పంచాయతీరాజ్ ,గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ దనసరి సీతక్క, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ,తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డిల చిత్రపటాలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఈ రోడ్డు వలన భైరవునిబండ, నక్కలపల్లి గ్రామాలతో పాటు ఈ రెండు గ్రామాల కింద ఉన్న మూడుకు గ్రామాలకు నూతనంగా బీటీ రోడ్డు ఏర్పడుతుంది. అలాగే మనం భైరవుని బండ నుండి నార్కట్‌పల్లి హైదరాబాదుకు పోవుటకు 15 కిలోమీటర్ల దూరం తగ్గి ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని సర్పంచ్ ఎన్. యాదయ్య సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి. రేణుక అశోక్ రెడ్డి,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పడాల శంకరయ్య, ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు ఉన్నారు.



## ప్రతి అక్షరం ప్రజలపక్షమే : ఎమ్మెల్యే వేముల



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రతి అక్షరం ప్రజల పక్షాన రాస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రజాపక్షం దినపత్రిక పనిచేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.గురువారం పట్టణంలోని తననివాసంలో ప్రజాపక్షం దినపత్రిక ముద్రించిన నూతన సంవత్సర 2026క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈసందర్భంగాఆయనమాట్లాడుతూ ప్రజాసమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న పత్రికగా ప్రజాపక్షం ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలాప్రజాపక్షం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుఫన్నాల రాఘవరెడ్డి, ప్రజాపక్షం నకిరేకల్ రిపోర్టర్ గడగోజు రవీంద్రాచారి,వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ చైర్మన్ మోపూరి చంద్రమౌళి,కార్పెంటర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గడగోజు విశ్వజ్ఞాచారి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై 'ప్రజాపక్షం' కథనాలు 'భేష్'

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజా సమస్యలపై ప్రజాపక్షం కథనాలు అద్భుతమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్టు ఖాజా హమీదొద్దీన్, ప్రముఖ వైద్యుడు జాడి రాజులు అన్నారు. ప్రజాపక్షం ముద్రించిన నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను గురువారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రజలు, ప్రభుత్వానికి పత్రికలు వారధిగా ఉండి ప్రజాభిమానాన్ని చూరగొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం డివిజన్ ఇన్‌చార్జి పుప్పాల యాదగిరి, మిర్యాలగూడ, వేములపల్లి మండలాల పార్టీ కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబోతు పద్మ, మధ్యాహ్న భక్షజన సంఘం జిల్లా కార్యదర్శి బంటు రాజేశ్వరి, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షమీం, బుచ్చయ్యలు పాల్గొన్నారు.





## క్వార్టర్స్‌లో పివి. సింధు, సాత్విక్ జోడీ..

### లక్ష్యసేన్ ఇంటికి

కొత్త ఏడాదిలో భారత షట్లర్ పీవీ సింధు గొప్పగా ఆడుతోంది. మలేషియా ఓపెన్ సూపర్ 1000లో దూకుడు కనబరుస్తున్న సింధు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అదిరే ఆటతో ప్రత్యర్థులకు చెక్ పెడుతున్న సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి ద్వయం క్వార్టర్స్ బెర్తు సాధించింది. అయితే.. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు లక్ష్యసేన్, ఆయుష్ శెట్టిల పోరాటం ముగిసింది. ఒలింపిక్ విజేతైన సింధు నిరుడు ఒక్క టైటిల్ కూడా గెలవలేదు. కానీ, కొత్త ఏడాదిలో తను అనూహ్యంగా పుంజుకుంది. మలేషియా ఓపెన్‌లో చెలరేగిపోతున్న భారత స్టార్ గురువారం ప్రీ క్వార్టర్స్‌లో జపాన్ షట్లర్ తొమొక మియాజకీని చిత్తు చేసింది. టాప్ గేర్‌లో రెచ్చిపోయిన తెలుగుతేజం తొలి సెట్‌ను 21–8తో సునాయసంగా గెలుచుకుంది. రెండో సెట్‌లనూ సింధు ధాటికి ఎనిమిదో సీడ్ తొమొకను 21–13తో అలవోకగా మట్టికరిపించింది. సెమీస్ బెర్తు కోసం తను జపాన్‌కే చెందిన మూడో సీడ్ అకనె యమగుజితో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ ముందే ఇంటిదారి పట్టారు. డబుల్స్‌లో సాత్విక్ – చిరాగ్ జోడీ తిరుగులేని ఆటతో క్వార్టర్స్ చేరింది. నిరుడు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుపొందిన ఈ జంట మలేషియా ఓపెన్‌లోనూ పతకానికి మరింత చేరువైంది. గురువారం జరిగిన 39 నిమిషాల పోరులో జునైదీ అరిఫ్ – రాయ్ కింగ్ యాప్(మలేషియా) జంటను 2118, 2112తో ఓడించింది సాత్విక్ – చిరాగ్ ద్వయం.

## ఒకే ఓవర్‌లో 30 రన్స్ కొట్టిన సర్ఫరాజ్..

### అయినా... ఒక్క రన్ తేడాతో ఓడిన ముంబయి



జైపూర్ : విజయ్ హజారే ట్రోఫీలో గురువారం ముంబై, పంజాబ్ మధ్య వన్డే మ్యాచ్ రసవత్తరంగా జరిగింది. ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో ఒక్క రన్ తేడాతో పంజాబ్ విజయం సాధించింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు కేవలం 216 పరుగులకే ఆలౌటైంది. అన్‌మోల్‌ప్రీత్, రమణ్‌దీప్ సింగ్‌లు హాఫ్ సెంచరీ చేశారు. అయితే స్వల్ప టార్గెట్‌తో బరిలోకి దిగిన ముంబై జట్టు అనూహ్య రీతిలో ఓటమి పాలైంది. ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. కానీ ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. విజయ్ హజారే ట్రోఫీ వన్డే చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పాడు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా రికార్డును సొంతం చేసుకున్నాడు. గతంలో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా అతిత్ సేథ్ పేరిట ఉన్నది. ఆ బరోడా బ్యాటర్ 16 బంతుల్లో చత్తీస్‌ఘడ్‌పై అర్థసెంచరీ చేశాడు. 2020–21 సీజన్‌లో ఆ రికార్డు నమోదు అయ్యింది. గురువారం పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో టాప్‌గేర్‌లో ఉన్న సర్ఫరాజ్ బౌలర్లను వణికించాడు. అభిషేక్ శర్మ వేసిన ఓ ఓవర్‌లో సర్ఫరాజ్ 30 రన్స్ రాబట్టాడు. అయితే 20 బంతుల్లో 62 రన్స్ చేసి సర్ఫరాజ్ ఔటయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, అయిదు సిక్సర్లు ఉన్నాయి. కానీ ఆ తర్వాత పకడ్బందీగా బౌలింగ్ చేసిన పంజాబీ జట్టు ముంబైని కట్టడి చేసింది. పంజాబీ బౌలర్లలో గురునూర్ బ్రార్, మయాంక్ మార్కండేలు చెరి నాలుగేసి వికెట్లు తీసుకున్నారు.

## సీనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్లో నిఖత్ జరీన్



సీనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ బిడ్డ నిఖత్ జరీన్ దుమ్మురేపుతోంది. ప్రత్యర్థులపై పంచ్‌లు కురిపిస్తూ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది.గ్రేటర్ నోయిడాలోని గౌతమ్ బుద్ధ యూనివర్సిటీ వేదిక గా జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టూ టైమ్ వరల్డ్ ఛాంపియన్ నిఖ త్ జరీన్‌తో పాటు వరల్డ్‌ప్ గోల్డ్ మెడలిస్ట్ హితేష్ గులియా, వరల్డ్ ఛాంపియన్ మీనాక్షి హుడా విజయం సాధించి సెమీఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. మహిళల 45–48 కేజీల విభాగంలో ఆలిండియా పోలీస్ తరఫున బరిలోకి దిగిన మీనాక్షి 5–0తో పంజాబ్ బాక్సర్ కాశిష్ మెహతాను ఓడించింది. మహిళల 48–51 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ 5–0తో మణిపూర్‌కు చెందిన లాంచెన్‌బీ చాను టోంగ్‌బ్రామ్‌ను చిత్తు చేసింది. మహిళల 51–54 కేజీల విభాగంలో ప్రీతి 5–0తో హర్మీత్ కౌర్‌పై, సాక్షి 4–1తో పూనమ్‌పై విజయం సాధించారు. పురుషుల 65–70 కేజీల కేటగిరిలో హితేష్ 5– 0 తో పంజాబ్ బాక్సర్ తేజస్విని ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. పురుషుల 50–55 కేజీల విభాగంలో వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్ సిల్వర్ మెడలిస్ట్ పవన్ భార్త్వాల్, అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన టైసన్‌ను ఓడించగా, జదుమణి సింగ్ (50–55 కేజీలు) పంజాబ్ బాక్సర్ నిఖిల్ పై విజయం సాధించాడు. 55–60 కేజీల విభాగంలో సచిన్.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కరణ్‌ను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు కనీసం కాంస్య పతకం ఖాయం కానుంది.




## వైకల్యంతోనూ సుఖమయ జీవితం సాధ్యం!

వైకల్యంతో జీవితం అలవాటు చేసుకోవడం ఎప్పుడూ సులభమైన పని కాదు. శరీరంలో లేదా మనస్సులో వచ్చిన మార్పు ఒక్కసారిగా మన దైనందిన జీవితాన్ని, మన కలలను, మన భవిష్యత్తు ఊహలను కుదిపేస్తుంది. ఆరోగ్యం సహజంగా ఉన్నంతకాలం దాని విలువ మనకు అంతగా అర్థం కాదు. అది కోల్పోయిన తర్వాతే, మనం కోల్పోయిన అవకాశాలు, అలవాట్లు, స్వేచ్ఛ గురించి ఎక్కువగా ఆలోచిస్తాము. అయితే గతాన్ని మార్చలేకపోయినా, ప్రస్తుతం ఎలా జీవించాలన్నది మన చేతుల్లోనే ఉంటుంది. వైకల్యం ఉన్నప్పటికీ, అర్థవంతమైన, సంతృప్తికరమైన జీవితం నిర్మించుకోవడం పూర్తిగా సాధ్యమే. వైకల్యం ఎదురైనప్పుడు మొదట కలిగే అనుభూతి షాక్. ఆ తర్వాత కోపం, నిరాశ, భయం, అపనమ్మకం లాంటి భావాలు ఒకదాని వెంట ఒకటి వస్తాయి. ఇక నా జీవితం ఎలా ఉంటుంది? నేను మళ్లీ సంతోషంగా ఉండగలనా? అనే ప్రశ్నలు మనసును వెంటాడుతాయి. ఈ దశలో గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే,ఈ భావోద్వేగాలన్నీ సహజమైనవే. వైకల్యం ఒక పెద్ద నష్టం. కాబట్టి దానిపై దుఃఖించడానికి మనకు హక్కు ఉంది. ఆ దుఃఖాన్ని అణచివేయకుండా, దానిని అనుభవించడానికి మనకు మనమే అనుమతి ఇవ్వాలి. బాధను తప్పించుకోవాలని ప్రయత్నిస్తే, అది లోపలే నిలిచిపోతుంది. కానీ దానిని అంగీకరించి ఎదుర్కొంటేనే ముందుకు సాగడం సాధ్యమవుతుంది. వైకల్యాన్ని అంగీకరించడం అంటే జీవితాన్ని వదిలేయడం కాదు. అంగీకారం అంటే పరిమితుల వాస్తవాన్ని గుర్తించి, ఆ వాస్తవంలోనే కొత్త మార్గాలను వెతకడం. మనం కోల్పోయిన దానిపైనే దృష్టి పెట్టుకుంటూ ఉంటే, మనం చేయగలిగిన వాటిని చూడలేము. గతంలో ఉన్న సాధారణ జీవితం తిరిగి వస్తుందనే ఆశతో జీవించడం కన్నా, ప్రస్తుతం ఉన్న పరిస్థితిని స్వీకరించి దానిలోనే అర్థం వెతకడం ఆరోగ్యకరం. నడవలేకపోయినా, చూడలేకపోయినా, వినలేకపోయినా..సంతోషం పూర్తిగా మాయమవ్వాల్సిన అవసరం లేదు. వైకల్యంతోనే ఎదిగి, తమ జీవితాలను ఇష్టపడేలా మలచుకున్న అనేకమంది కథలు మనకు ప్రేరణగా నిలుస్తాయి. వారి అనుభవాలు కష్టకాలంలో మనకు వెలుగురేఖలుగా మారుతాయి. వైకల్యంతో జీవించడంలో మరో కీలక అంశం, మన పరిస్థితి గురించి అవగాహన. ప్రతికూల వైద్య సమాచారంలో మునిగిపోవడం అవసరం లేదు, కానీ మన శరీరంలో ఏమి జరుగుతుందో, మనకు ఎలాంటి పరిమితులు ఉండవచ్చో తెలుసుకోవడం అవసరం. ఆ అవగాహనే మనల్ని సిద్ధం చేస్తుంది, భయాన్ని కొంత తగ్గిస్తుంది, నిర్ణయాలు తీసుకునే శక్తిని ఇస్తుంది. తెలియని దానికంటే తెలిసిన సవాల్‌ను ఎదుర్కోవడం సులభం. వైకల్యం మన జీవితాన్ని మార్చిందనేది నిజం. కానీ అది మన జీవితాన్ని పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం లేదు. సృజనాత్మకతతో, నిబద్ధతతో ఆ ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ఈ ప్రయాణంలో మనమే మనకు న్యాయవాదులుగా మారాలి. పని ప్రదేశాల్లో, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో, సమాజంలో.. మన హక్కులు ఏమిటో తెలుసుకుని వాటి కోసం నిలబడటం అవసరం. బాధ్యత తీసుకున్నప్పుడే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

## సంరక్షక సేవలకు పెరుగుతున్న ఆదరణ

చైనాలో వేగవంతమైన పట్టణీకరణ, వారు ఎంచుకునే సంరక్షణ విధానాలను ప్రభావితం చేసే అంశాలను ఈ అధ్యయనం పరిశీలించింది. ఇందుకోసం నిర్వహించిన చైనా హెల్త్ అండ్ లాంగిట్యూడినల్ సర్వే (సిఎల్‌హెచ్ఎల్ఎస్)లోని క్రాస్‌సెక్షనల్ డేటాను ఉపయోగించి, 60 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గల 15,854 మంది వృద్ధులను అధ్యయనంలో భాగంగా తీసుకున్నారు. కమ్యూనిటీ సంరక్షణ అవసరాల నమూనాలు, వాటిపై ప్రభావం చూపే కారకాలను విశ్లేషించడానికి లాజిస్టిక్ రిగ్రెషన్ పద్ధతి ఉపయోగించబడింది. మొత్తం నమూనాలో 43.60 శాతం పురుషులు, 56.40 శాతం మహిళలు ఉన్నారు. రోజువారీ జీవన కార్యకలాపాల (ఎడిఎల్) మూల్యాంకనం ప్రకారం సుమారు నాలుగో వంతు వృద్ధులు వికలాంగులుగా గుర్తించబడ్డారు. పట్టణ వృద్ధులు, గ్రామీణ వృద్ధులతో పోలిస్తే, రోజువారీ సంరక్షణ, భావోద్వేగ మద్దతు, సహవాసం, ఆరోగ్య పరిజ్ఞానం, కుటుంబ, పొరుగు వివాదాల పరిష్కారం వంటి కమ్యూనిటీ సామాజిక సేవలకు ఎక్కువ డిమాండ్ వ్యక్తం చేశారు. అయితే వైద్య సంరక్షణ కోసం గృహ సందర్శనలను తప్పిస్తే, పట్టణ మరియు గ్రామీణ వృద్ధులకు వాస్తవంగా అందుతున్న కమ్యూనిటీ సేవల స్థాయి దాదాపు సమానంగా ఉండగా, పట్టణ వృద్ధులకు అందుతున్న సేవల స్థాయి మాత్రం గణనీయంగా తక్కువగా ఉంది. వయస్సు పెరుగుదల, అవివాహిత స్థితి, నివాస ప్రాంతం, సాంస్కృతిక నేపథ్యం, ఆరోగ్య స్థితి, ఆదాయ వనరులు, నివాస అభిరుచులు వృద్ధులు ఎంచుకునే సంరక్షణ విధానాలపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయని అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా 70 సంవత్సరాల పైబడిన వృద్ధులు, అవివాహితులు మరియు మధ్యస్థం నుండి తీవ్రమైన వైకల్యం కలిగినవారు సామాజిక సంరక్షణ సేవలను ఎంచుకునే అవకాశం ఎక్కువగా ఉంది. పట్టణాల్లో నివసిస్తున్న వృద్ధులు కూడా గ్రామీణ వృద్ధుల మాదిరిగానే ఇప్పటికీ కుటుంబ ఆధారిత సంరక్షణకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఈ అధ్యయనం స్పష్టంచేసింది. ఈ పరిస్థితి కేవలం చైనాకు మాత్రమే పరిమితమని అనుకోవడానికి వీల్లేదు. క్రమంగా భారత్ వంటి దేశాల్లోనూ ఇదే పరిస్థితి కనపించవచ్చు.



## పోరాటాలకు ప్రతిరూపమే ఎర్రజెండా

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



ప్రజాపక్షం/చెన్నూరు : ప్రజా శ్రేయస్సు కోసం పోరాడే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని, పోరాటాలకు ప్రతిరూపం ఎర్రజెండా అని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం ఆయన చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో పర్యటించారు. అనంతరం చెన్నూరు పట్టణ కేంద్రంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. బ్రిటిష్ పాలనకు, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ఘనత సిపిఐదని తెలిపారు. దున్నేవాడికే భూమి అనే నినాదంతో 4500 మంది ప్రాణ త్యాగాలు చేసి పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. శతవసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 18న ఖమ్మం జిల్లాలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దాగ మల్లేష్, చెన్నూరు మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, బడికెల మధునయ్య, చెన్నూరు పట్టణ కార్యదర్శి సుంకరి చందు, నాయకులు సిద్రాల నారాయణ, శంకర్, తుమ్మ బానయ్య, తిరుపతి పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పార్టీలే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాయి

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి



ప్రజాపక్షం/కేసముద్రం : కమ్యూనిస్టు పార్టీలే ప్రత్యామ్నాయ శక్తులుగా ఎదుగుతాయని, ప్రజాసమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతారని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై విజయసారథి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేయడానికే పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తున్నారని, కార్పోరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెట్టడమే లక్ష్యంగా బ్యాంక్‌ల ప్రైవేటీకరణ, విమానాశ్రయాల ప్రైవేటీకరణకు కేంద్రప్రభుత్వం పూనుకుంటుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు, పోరాటాలు చేయాలన్నారు. జనవరి 18న ఖమ్మం పట్టణ కేంద్రంలో 5 లక్షల మంది కార్యకర్తలు, దేశ, విదేశీ నాయకులతో నిర్వహించే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు కేసముద్రం మండలం నుండి అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని విజయసారథికోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మంద భాస్కర్, పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే తత్వానికి ప్రతీక ఎర్రజెండా



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్ నరసింహ్మా

ప్రజాపక్షం/మహబూబ్ నగర్ : బాంచన్ అనే బానిస ప్రజలను తట్టిలేపి భూమి కోసం భుక్తి కోసం పీడిత జన విముక్తి కోసం అసమానతలు లేని కొత్త సమాజం కోసం ప్రజలలో చైతన్యం నింపిన పార్టీ సిపిఐ అని, ప్రశ్నించే తత్వానికి ప్రతిక ఎర్రజెండా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా అన్నారు. 18 న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగు సిపిఐ వంద సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ పోస్టర్, స్టిక్కర్, ఇతర ప్రచార సామాగ్రిని గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామారెడ్డి భవన్‌లో బాల నరసింహ్మా ఆవిష్కరించారు. అనంతరం ఖమ్మం సిపిఐ వందేళ్ళ సంబరాల బహిరంగ సభ విజయవంతానికి నిర్వహించిన సన్నాహక సమావేశంలో బాల్ నరసింహ్మా మాట్లాడుతూ వంద వసంతాల సుదీర్ఘ పోరబాటలో కార్మిక కర్షక మహిళ విద్యార్థి గిరిజన కవులు కళాకారులు ఉద్యోగ ప్రజా బహుల్యంతో ఎన్నో విజయాలు సాధించిందని చట్టాలకు రూపకల్పన చేసిన శ్రమజీవుల చెమట చుక్కలతో అమరవీరుల రక్తార్పణతో ఎరుపెక్కిన పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జాతీయస్థాయిలో 25 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ప్రారంభమై ఏడాది కాలంగా రాష్ట్ర, జిల్లా మండల గ్రామస్థాయిలలో వందేళ్ల ఎర్రజెండా సంబరాలు జరుపుకుంటూ ఈనెల 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభతో ఎర్ర కాంతులు ఎగజిమ్మత్తు భవిష్యత్తు పోరాటాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఖమ్మంలో జరిగే సిపిఐ భారీ బహిరంగ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు సిపిఐ అగ్ర నాయకులు జాతీయ కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు ప్రజా సంఘాల నాయకులు వామపక్ష పార్టీల అగ్ర నాయకులు తరలి రానున్నాని అన్నారు. జనవరి 19న జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తూ 21వరకు ఖమ్మంలో సిపిఐ జాతీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నదన్నారు. బహిరంగ సభకు మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, కొండికంటి పద్మావతి, పట్టణ కార్యదర్శి కోటకదిర నరసింహ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, మహేష్, గంటల శ్రీను, ఖలీం, లక్ష్మణ్, శివ, ఇందిర, భార్గవి, నవదీప్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ అక్షరం ప్రజల పక్షాన...



### 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణలో కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రజాపక్షం దిన పత్రికలో వచ్చే ప్రతీ అక్షరం ప్రజల పక్షాన నిలబడాలని, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజాపక్షం 2026 క్యాలెండర్‌ను బుధవారం రాత్రి సుజాతనగర్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషాతో కలిసి ఆవిష్కరించారు. సిపిఐ శత వసంత ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రచార జాత ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలు పతనమైపోతున్న ఈరోజుల్లో ఆ విలువలను కాపాడే నిలువుటద్దంగా, అన్యాయాన్ని ప్రశ్నించే పత్రికగా ప్రజాపక్షం నిలవాలన్నారు. పాలకులు చేసిన వాగ్ధానాలు అనుక్షణం అక్షరూపంలో గుర్తు చేస్తూ ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అర్హుల దరి చేరేందుకు, అధికారుల అలసత్వాన్ని నిలదీస్తూ, వారు ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండేలా అక్షర యుద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పిఎస్.ఆనంద్, సుజాతనగర్, పాల్వంచ రిపోర్టర్లు మేకల వెంకటేష్, వెంకటనారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, సలగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, భూక్య ధస్రు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, గనిగల వీరస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, కొమారి హన్మంతరావు, ఫహీం, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలు, కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటాలు

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

ప్రజాపక్షం/నిజామాబాద్ : పేద ప్రజల, కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేది సిపిఐ అని పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. సిపిఐ వంద సంవత్సరాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో బహిరంసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాలలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని దుబ్బ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిట్లర్స్ యూనియన్ ఎఐటియుసి కార్యాలయంలో ఖమ్మం సభ విజయవంతానికి సన్నాహక సమావేశంలో ఓమయ్య అధ్యక్షత నిర్వహించగా సుధాకర్ హాజరై మాట్లాడారు. వంద సంవత్సరాల సందర్భంగా ఖమ్మం పట్టణంలో 5 లక్షల మంది ప్రజలతో, పదివేల మంది రెడ్‌షర్ట్ వాలంటీర్లతో ఎర్రదండు కవాతు ఉంటుందన్నారు. బహిరంగ సభకు జిల్లా నుంచి కార్మికులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు అలీ ఇమ్రాన్, అనిల్, స్రవంతి, సాయమ్మ, రాధకుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.




## బకాయి బిల్లులను చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా




ప్రజాపక్షం/నిజామాబాద్ : బకాయి బిల్లును చెల్లించాలని ఎఐటియుసి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ గత ఆగస్టు నుండి మధ్యాహ్న భోజన కార్మికులు పిల్లలకు వంట చేసి పెట్టిన బిల్లులు జిల్లాకు దాదాపు 8 కోట్ల రూపాయలు బకాయిలున్నాయని వాటిని వెంటనే చెల్లించాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర ఎనిమిదిన్నర రూపాయలుంటే ప్రభుత్వం ఆరు రూపాయలకు ఇవ్వటం సరికాదని, కిందిస్థాయిలో హెడ్మాస్టర్లు ఎంఈఓలు కక్ష్య గట్టి మధ్యాహ్న భోజన కార్మికులను రాజకీయ కారణాలతో అకారణంగా తొలగిస్తున్నారన్నారు. సంక్రాంతి వరకైనా కార్మికులకు రావల్సిన బకాయి బిల్లులు చెల్లించాలని లేని యెడల సంక్రాంతి తర్వాత సమ్మెకు వెళుతామని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, అధ్యక్షురాలు స్రవంతి, నాయకులు సాయమ్మ, నరేష్, నాగలక్ష్మీ, గంగామణి, సుజాత, గంగాధర్, కార్మికులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ సిపిఐ సభ సందేశం

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్

ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరిగే బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఖమ్మంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డు సిపిఐ కార్యాలయం వద్ద ర్యాలీని సిపిఐ నగర కార్యదర్శి ఎసెకె జానిమియా జెండా ఊపి ప్రారంభించారు. సిపిఐ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ బైపాస్ రోడ్డు మీదుగా బస్‌డిపో, మయూరిసెంటర్, పాత బస్టాండ్, జెడ్పిసెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సిపిఐ కార్యాలయానికి చేరుకుంది. ర్యాలీని ఉద్దేశించి సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ వందేళ్ల ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగే ఈ సభ సందేశాన్ని ఇంటింటికి ప్రతి వ్యక్తికి తెలిపే కార్యక్రమంలో భాగంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని సురేష్ తెలిపారు. ర్యాలీలో సిపిఐ జిల్లా నాయకులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివ రెడ్డి, గాదె లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాన బాల రామకృష్ణ, వరదా నర్సింహారావు, తాటి నిర్మల, బోడా వీరన్న, జ్వాలా నర్సింహారావు, మమత, శంకర్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
09-01-2026
www.prajapaksham.in




## కారాగారంలో విద్యా నైపుణ్యాభివృద్ధి చర్యలు బాగున్నాయ్ : సివి. ఆనంద్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కారాగారంలో అమలవుతున్న ఉత్తమ విధానాలు, సంస్కరణాత్మక కార్యక్రమాలు విద్యా నైపుణ్యాభివృద్ధి చర్యలు, సంక్షేమ పథకాలు, ఆరోగ్య సేవలు బాగున్నాయని ప్రభుత్వ హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సివి. ఆనంద్ అన్నారు. గురువారం చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని ఆయన సందర్శించారు. తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఆనంద్‌కు స్వాగతం పలికి జైళ్లను శిక్షాకేంద్రాలుగా కాకుండా సంస్కరణ, పునరావస కేంద్రాలుగా మార్చే దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో చర్లపల్లి జైలు ప్రారంభమైన సమయంలో తాను హైదరాబాదు సెంట్రల్ జోన్ డిసిపిగా ఉన్నానని గుర్తుచేస్తూ దేశంలోనే అత్యాధునిక జైలుగా ప్రకటించగా గతంలో తన పర్యటనలు పరిమితంగా ఉండేవని అయితే ప్రస్తుతం లోతుగా పరిశీలించే అవకాశం లభించిదని తెలిపారు. కారాగారంలో ఆసుపత్రి, వంటశాల, పరిశ్రమలు, స్టీల్ తయారీ, ఫర్నిచర్‌లను పరిశీలించారు. ఈ సందర్శన తనకు మంచి అభ్యాస అనుభవంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో జైళ్ల శాఖ ఐజి ఎన్.మురళీ బాబు, డిఐజి శ్రీనివాస్, పర్యవేక్షణాధికారి శివకుమార్ గౌడ్, ఉప పర్యవేక్షణాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## చిన్న పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వొద్దు :మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** విద్యార్థులు, చిన్న పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వకూడదని వాటివల్ల అనేకమైన దుష్ఫలితాలు వస్తున్నాయని సినీ ఆర్టిస్ట్ మిమిక్రీ, నటులు శివారెడ్డి అన్నారు. కుషాయిగూడ చక్రీపురం శ్రీ చక్రీ విద్యానికేతన్ స్కూల్ 37వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను శ్రీ చక్రీ విద్యానికేతన్ వ్యవస్థాపకులు ఫౌండర్ ప్రతాపరెడ్డిలో కలసి ప్రారంభించారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 5వేల రూపాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ చక్రధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** దమ్మాయిగూడ సాయినగర్‌లో సాయిబాబా టెంపుల్ సమీపంలో కమలానగర్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్, కుషాయిగూడ నవోదయ సంక్షేమ వేదిక కలసి ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును సాయినగర కాలనీ కార్యదర్శి శ్రీదేవి ప్రారంభించి మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య పరీక్షలు అందించడం అభినందనీయమని, మరిన్ని పేదల కాలనీలలో క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇందులో పాల్గొనిన 176 మందికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, ఉదయభాస్కర్, జివి రావు, పురుషోత్తంరెడ్డి, రాజు, వెంకటేష్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధి దిశగా కృషి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యల పరిష్కారం, అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నానని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు.అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన ఆయనను బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బద్దం పరశురాంరెడ్డి, వినాయక నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణగుప్తా, పార్టీ శ్రేణులు పేపర్ శీను, ఉమేష్‌కుమార్, సంపత్ యాదవ్, తదితరులు గురువారం సన్మానించారు.



## ఫొటో, వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం మండల పోటో మరియు విడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం, నూతన కార్యవర్గ సభ్యత్వ నియమకం గురువారం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో బాగంగా మండల అధ్యక్షులుగా ఎస్ మోహన్ కూమార్, ఉపధ్యక్షులుగా ఆక్తర్‌ఖాన్, కార్యదర్శిగా జి ప్రశాంత్, ఉప కార్యదర్శి ఎం శ్రీనివాస్, కోశాధికారిగా శీకాంత్, సలహదారులుగా రఘు, ప్రకాష్, సోషల్ మీడియా సభ్యులుగా శ్రీకాంత్, నరేష్, నర్సిములు, శ్యామ్, రాధకృష్ణ, కమిటి సభ్యులు అందరు కలసి నూతనంగా ఏర్పడిన కార్యవర్గ సభ్యులను శాలువతో సన్మానించడం జరిగింది.

# చైనీస్ మాంజాపై పోలీసుల కొరడా

**రూ. 1.24కోట్ల విలువైన నిషేధిత మాంజా స్వాధీనం**
**మీడియా సమావేశంలో సిపి సజ్జనార్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంక్రాంతి పండుగ వేళ పర్యావరణానికి, పక్షులకు హాని కలిగించే నిషేధిత చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయాలను అరికట్టేందుకు హైదరాబాద్ నగర పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. నగర కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పెద్ద ఎత్తున నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నారు. టిజిఐసిసిసిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి.సజ్జనర్ మాట్లాడుతూ 'సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ, ఆనందాల హేళ. అయితే, మన సంతోషం మరొకరి ప్రాణానికి ముప్పుగా పరిణమించకూడదు. పర్యావరణానికి, మనుషుల ప్రాణాలకు హాని కలిగించే 'చైనీస్ మాంజా'పై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా వీటిని విక్రయిస్తున్నారు. నగరంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదు. నిబంధనలు అతిక్రమిస్తే తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం' అని హెచ్చరించారు.

**ఆన్‌లైన్ అమ్మకాలపై 24 గంటల నిఘా..**

దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో వ్యాపారులు ఆన్‌లైన్ బాట పట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈకామర్స్ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికగా సాగే క్రయ విక్రయాలపై 24 గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఆన్‌లైన్‌లో మాంజా కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే 'డయల్ 100' లేదా వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నగరవ్యాప్తంగా అన్ని జోన్లలో నిర్వహించిన దాడులలో ఇప్పటివరకు మొత్తం 103 కేసులు నమోదు కాగా, 143 మంది నిందితులను అరెస్టు చేయడం జరిగింది. వీరి నుంచి రూ. 1,24,52,000 (ఒక కోటి ఇరవై నాలుగు లక్షల యాభై రెండు వేలు) విలువైన 6,226 మాంజా బాబిన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి (క్రైమ్స్, సిట్) ఎం. శ్రీనివాసులు, డిసిపిలు కారె కిరణ్ ప్రభాకర్, జి. చంద్రమోహన్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ డిసిపి (టాస్క్ ఫోర్స్) అందె శ్రీనివాస్ రావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఒక్క అనుమతితో ఎక్కడ పడితే అక్కడ కళాశాలలు

**విద్యాపీఠ్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎఐవైఎఫ్ ధర్నా**




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** అనుమతులకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఫిసిక్స్‌వాలా విద్యాపీఠ్ పేరిట నిర్వహిస్తున్న జూనియర్ కాలేజి యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేసింది. హబ్సిగూడ ప్రధాన రహదారిలోని పుల్లారెడ్డి స్వీట్స్ భవంతిలో కాలేజి ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు తీసుకోకుం డా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను మోసగిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు లు నమోదు చేయాలన్న డిమాండ్‌తో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌ల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజి ఏర్పాటుకోసం ఇంటర్ బోర్డు వద్ద తీసుకొన్న అనుమతులతో నిర్దేశించిన ప్రాంతంతో పాటు యథేచ్ఛగా వ్యాపార దృక్పథంతో ఎక్కడపడితే అక్కడ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

ఒక చోట తీసుకొన్న అనుమతితో నగరంలో అనేక కళాశాలలు ఏర్పాటు చేయటం ఇంటర్ బోర్డును ధిక్కరించినట్లేనని, ఈ విషయం కళ్లెదుటే కనిపిస్తున్నా బోర్డు అధికారులు చర్యలు తీసుకోకపోవటం వల్ల ప్రజలకు ఆ శాఖాధికారులపై నమ్మకం పోతుందన్నారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిగా వ్యవహరిస్తున్న కిషన్ ఈ విషయంలో పరిశీలించి కాలేజీని సీజ్ చేయటంతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి కఠిన చర్యలకు సిఫార్సు చేయాలని, లేనిపక్షంలో కాలేజి యాజమాన్యంతో ఆయనకున్న లాలూచిపై అనుమానాలు రేకెత్తుతాయన్నారు.. లక్షలా ది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను వంచిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేని పక్షంలో తాము పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, సతీష్, ప్రవీణ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పిఎం విశ్వకర్మ పథకంతో ఆర్థికంగా ఎదగాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉత్పత్తులతో పాటు వ్యాపార మెళకువల పట్ల అవగాహన పెంపొందించుకొంటూ సరైన లాభాలను గడించి ఆర్థిక పురోగతి పొందాలని ఎన్ఎస్ఐసి జోనల్ కార్యాలయ జనరల్ మేనేజర్ వి.సురేష్ బాబు సూచించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అమలు అవుతున్న పిఎం విశ్వకర్మ పథకం లబ్దిదారులకు గురువారం ఈసిఐఎల్‌లోని ఎన్ఎస్ఐసి జోనల్ కార్యాలయంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఐసి వివిధ కార్యకలాపాలు, సహాయక సేవల గురించి జిఎం వివరించారు. పిఎం విశ్వకర్మ పథకం ప్రయోజనాలను లబ్దిదారులకు తెలియచేస్తూ తమ ఉత్పత్తుల బ్రాండింగ్, ప్రచారంపై జ్ఞానాన్ని పొందుతూ వాటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని కార్యాలయ జాయింట్ డైరెక్టర్ సిఎస్ఎస్ రావు తెలిపారు. లీడ్ జిల్లా మేనేజర్ (కెనరా బ్యాంకు) సి.శివప్రసాద్ బ్యాంకింగ్ విధానాలను వివరిస్తూ విశ్వకర్మ పథకం కింద అందించే రుణ ప్రయోజనాలు సక్రమంగా వినియోగించుకొంటూ ఆర్థికంగా ఎదగాలన్నారు. అలాగే లబ్దిదారులు ఎదుర్కొనే సవాళ్ల పరిష్కారానికి బహిరంగ చర్చ ఈ సదస్సులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 150 మంది లబ్దిదారుల్లో 110 మందికి క్యూ ఆర్ కోడ్ జనరేషన్ విజయవంతంగా పూర్తి చేసారు.

## రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్‌లో రూ. 13 లక్షల వ్యయంతో చేపట్టిన సంజయ్ నగర్ నుండి సత్యనారాయణ కేఫ్ రహదారి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించటంలో ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను ప్రజల సహకారంతో చేసానన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సర్కిల్ ఎఇ దివ్యజ్యోతితో పాటు బిఆర్ఎస్‌నేత రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దుప్పట్ల పంపిణీ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు జన్మదిన సందర్భంగా వినాయకనగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నేత పిట్టల నాగరాజు నేతృత్వంలో గురువారం నిరుపేద నిరాశ్రయులకు 160 మందికి దుప్పట్లను పంపిణీ చేసారు.



## సంక్రాంతికి ఊరెళ్తున్నారా...జరభద్రం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఊరెళ్లేవారు నగదు,బంగారం విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్‌లో లేదా సురక్షితమైన ప్రదేశం ఉంచాలని సిఐ సుధాకర్ తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లే ప్రజలకు అవగాహన కల్పిస్తూ చర్లపల్లి పోలీస్ స్టేషన్ సిఐ ఆధ్వర్యంలో ఆటోలకు మైకులు, బ్యానర్‌ను బిగించి ప్రచారం చేస్తున్నారు. పండుగకు ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు బయటికి వెళ్లేవారు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్‌వేసి బయట గొల్లెం పెట్టకండని, బయట గేటుకు లోపల నుండి తాళం చేయండని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ శేఖర్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఎంతో అవసరం



**ప్రజాపక్షం/బంట్వారం :** విద్యార్థులకు చట్టలపై అవగహన ఎంతో అవసరమని ఎస్ఐ విమల గురువారం అన్నారు. కార్యక్రమంలో బాగంగా బంట్వారం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ప్రతి ఒక్కరికి చట్టల పై అవగహన తప్పనిసరిగా ఉండాలన్నారు. సందర్భంగా అమె మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు ఒక ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని, ఉఫాది నైపుణ్యలు మరియు చట్టల పట్ల అవగహన కల్పించారు. రోడ్డు భద్రత నియామ నిబంధనల పట్లా విద్యార్థులకు తగు సూచనలు సలహాలు విద్యార్థులకు తేలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రినిపాల్ బ్యూలా, ఉపద్యాయబృందం, పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## 'తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్'ను ఏర్పాటు చేయండి

**సిఎంకు గ్రూప్-1 ఆఫీసర్స్ అసోసియేషన్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అనుభవం కలిగిన గ్రూప్ 1 అధికారులతో తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిండ్ల చంద్ర శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి హన్మంత్ నాయక్, గ్రూప్ 1 అధికారులు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థలలో అనుభవం ఉన్న పంచాయతి రాజ్, మున్సిపల్ శాఖలలో గ్రూప్ 1 అధికారులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు గా నియమించాలని, పాలనా అనుభవం ఉన్న సీనియర్ గ్రూప్ 1 అధికారులను కార్పొరేషన్ ఎండి లుగా, డైరెక్టర్లు గా నియమించాలని కోరారు. ఈ మేరకు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, హన్మంత్ నాయక్‌తో పాటు గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను సిఎంకు వివరించారు. 2015 లో తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఏర్పాటు అంశంపైన ఆరుగురు ఐ ఎ ఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారని, ఆ కమిటీ ప్రభుత్వానికి ఇప్పటి వరకు నివేదిక సమర్పించలేదన్నారు. స్టేట్ సివిల్ సర్వీస్ పరిధి లో అన్ని గ్రూప్ 1 పోస్టులను తీసుకురావాలని కోరారు. దీనిపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలం గా స్పందించి, అతి త్వరలోనే గ్రూప్ 1 అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని హామీనిచ్చినట్టు వారు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు శశికిరణా చారి,అరవింద్ రెడ్డి,నూతనకంటి వెంకట్, పద్మావతి,భరత్ రెడ్డి, ప్రశాంతి, మాధవ్, ఫణి గోపాల్, వినోద్. సోమ శేఖర్ తదితరులు ఉన్నారు.



## హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో.. పలువురు డిసిపిల బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పునర్వ్యవస్థీకరించిన హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చార్మినార్ జోన్ డిసిపిగా కారే కిరణ్ ప్రభాకర్, రాజేంద్రనగర్ జోన్ డిసిపిగా ఎస్.శ్రీనివాస్, గోల్కొండ జోన్ డిసిపిగా జి. చంద్రమోహన్, జూబ్లీహిల్స్ జోన్ డిసిపిగా ఎ.రమణారెడ్డి, శంషాబాద్ జోన్ డిసిపిగా బి.రాజేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీరంతా నగర పోలీసు కమిషనర్ విసి.సజ్జనర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులను కమిషనర్ సాదరంగా ఆహ్వానించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా సమర్థంగా పనిచేయాలని అధికారులకు ఈ సందర్భంగా సజ్జనర్ దిశానిర్దేశం చేశారు.



## 1039 మొబైల్ ఫోన్ల స్వాధీనం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గత ఆరు మాసాల వ్యవధిలో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో రూ.2 కోట్ల 8 లక్షల విలువైన చోరీ అయిన 1039 మొబైల్ ఫోన్లను నేరస్తుల నుండి పోలీసులు స్వాధీనం చేసుకొన్నామని క్రైమ్ విభాగానికి చెందిన డిసిపి గుణశేఖర్, అదనపు డిసిపి కరుణసాగర్‌లు తెలిపారు. . వీటిలో గుర్తించిన ఫోన్లను ఫిర్యాదస్తులకు గురువారం అందచేసారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో 4733 ఫోన్లు స్వాధీనమయ్యాయన్నారు. మొబైల్ ఫోన్ల వినియోగం పెరిగిన మాదిరిగానే ప్రజలు అప్రమత్తత లేక పోవటం వల్ల వాటి చోరీల సంఖ్య సైతం నానాటికి పెరిగి పోతోందన్నారు. సిసిఎస్, ప్రత్యేక బృందాలు ఐటి సెల్ అధికారుల సహకారంతో విశేష కృషి చేసారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు చోరీ అయిన సందర్భంలో వాటిలో నిక్షిప్తమైన సమాచారాన్ని రక్షించుకోవాలని, వీలైనంత తొందరగా సమీప పోలీస్‌స్టేషన్‌లో కానీ సిఐఐఆర్ పోర్టల్ ద్వారా కానీ పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. చవకగా లభిస్తున్నాయని చోరీ ఫోన్లను కొనుగోలు చేయవద్దని, వాటిని కొనుగోలు చేసినా, అమ్మినా నేరంగా పరిగణిస్తామని, అదే విధంగా అధీకృత బిల్లులు లేకుండా ఫోన్లను కొనవద్దన్నారు. ప్రతి మొబైల్ ఫోన్‌లో వినియోగదారుడి వ్యక్తిగత డేటా నిగూఢమై ఉంటుందని, ఫోన్లలో find my device సెట్టింగ్‌లలో ఏర్పాటు చేసుకోవటం వల్ల చోరీ అయితే సులభంగా దొరికే అవకాశాలుంటాయన్నారు.



## పేదలు సాగు భూములలో సీవరేజీ ప్లాటు ఏర్పాటుకు వ్యతిరేకం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పేద బడుగు బలహీన వర్గాలు 60 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిలో ప్రభుత్వం సీవరేజ్ ప్లాంటును ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.రాంపల్లి సర్వే నంబర్ 388లో గల 36 ఎకరాల దళితులు, బిసిలు 70 సంవత్సరాలు 150 కుటుంబాలు వ్యవసాయ చేసుకుని జీవనం సాగిస్తున్నాయని గుర్తు చేశారు. వ్యవసాయ భూమిపై రాష్ట్ర ప్రభుత్వం కన్నుపడడం సరియైనదికాదు. గతంలో ఇందిరాగాంధీ దళితులకు వేలాది ఎకారాలు పంపిణీ చేసిందని ప్రస్తుత ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల భూములను లాక్కుంటుందని అన్నారు. కీసర అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ పేదల భూములను లాక్కోవడాన్ని తీవ్రగా వ్యతిరేకిస్తున్నామని, సీవరేజ్ ప్లాంటుకు భూములను ఆక్రమించుకోవడం విరమించుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



## రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి జన్మదిన సందర్భం గా గురువారం ఆనంద్‌బాగ్ క్రాస్‌రోడ్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత లక్ష్మి కాంత్‌రెడ్డి పాల్గొనగా పలువురు పార్టీ శ్రేణులు, ప్రజలు రక్తదానం చేసారు.

## రాజేంద్రనగర్‌లో ఇంటింటికీ సిపిఐ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్‌లోని వివిధ కాలనీలలో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జె.ఆనంద్‌గౌడ్, మండల సహాయ కార్యదర్శి విజయానంద్ గౌడ్, మైలర్‌దేవ్‌పల్లి శాఖ కార్యదర్శి జె.సదానంద గౌడ్, లక్ష్మీగూడా సహాయ కార్యదర్శి మధు,రమేష్, సిపిఐ మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుక 'ప్రజాపక్షం'

ఇబ్రహీంపట్నం ఎంఎల్ఎ మల్ రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** అనునిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుకగా 'ప్రజాపక్షం' దినపత్రిక పనిచేస్తుందని ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజాపక్షం2026 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారినవర్గాల అభ్యున్నతి, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న ప్రజాపక్షం దినపత్రిక ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్టు మండలం మాజీ జడ్‌పిటిసి బింగి దేవదాస్ గౌడ్, ప్రజాపక్షం తుర్కయంజాల్ విలేకరి కొడిదల నాగార్జున, మెట్టు విలేకరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/కేశంపేట:** మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను గురువారం ఉప సర్పంచ్ ప్రమోద్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, యువకులు బషీద్, భరత్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, ఇంతియాజ్, పురుషోత్తం, హరిశంకర్‌లు పాల్గొన్నారు. కేశంపేట మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామంలో సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ ఆధ్వర్యంలో నర్సరీ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ హరీశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్, నేతలు వెంకటయ్య, బీరప్ప, నరేందర్, కిష్టయ్య పాల్గొన్నారు. మండల పరిధిలోని దేవునిగుడి తండాలో గ్రామస్తుడు బద్రునాయక్ సహకారంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. సిసి కెమెరాలను కేశంపేట పోలీస్ కానిస్టేబుల్ అశోక్ రెడ్డి, మల్లేష్‌లు గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.

## వినియోగదారుల మన్నన పొందాలి





**ప్రజాపక్షం/హయత్‌నగర్:** ది–విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ 59 నూతన శాఖ హయత్‌నగర్ బ్రాంచ్‌ని గురువారం మాజీ ఎమ్మెల్యే పూర్వ చైర్మెన్ మనం ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ సిబ్బంది సులభమైన సేవలు అందించి వినియోగదారుల మన్నన పొందాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ జెవి సత్యనారాయణమూర్తి, వేమారెడ్డి నర్సింహారెడ్డి, డైరెక్టర్లు జొన్నలగడ్డ ప్రసాద్, చిన్న కోటేశ్వర్‌రావు, పెద్ది ప్రసాద్, అవని ప్రసాద్, వెంకట దుర్గ పాల్గొన్నారు.

## తప్పు సరి చేయకపోతే ఉద్యమం



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** జిహెచ్‌ఎంసిలో విలీనమైన తుర్కయంజాల్ మున్సిపాలిటీని తప్పుల తడకగా డివిజన్ తయారు చేశారని, ప్రభుత్వం చొరవ తీసుకొని సరి చేయకపోతే ఉద్యమం చేపట్టుతాం అని జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజ్ భూపాల్ అన్నారు. గురువారం తుర్కయంజాల్ ను సర్కిల్ గా ప్రకటించి ఎల్బీనగర్ జోన్ లో కలపాలని తుర్కయంజాల్ బీజేపీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సాగర్ హై వే తుర్కయంజాల్ కూడలిలో ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో కొత్త రామ్‌రెడ్డి, కొంద్రు పురుషోత్తం, తుళ్ళ నరసింహ గౌడ్, నోముల కార్తిక్, కరాడి శ్రీలత అనిల్ కుమార్, మల్లెల ప్రేమ్ సాయి, కొంతం బల్ రెడ్డి, భరత్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజారంజక పాలనకు ఆకర్షితులై పలు పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణపురం డివిజన్ బిఆర్ఎస్ మహిళా జనరల్ సెక్రటరీ అనురాధ పలువురు నాయకులతో కలిసి దేప భాస్కర్‌రెడ్డి సమక్షంలో చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు భాస్కర్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, మధుసూదన్‌రావు, సురేష్, రమేష్‌నేత, లింగస్వామిగౌడ్, జ్ఞానేశ్వర్, పెద్దవూర సైదులు, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జొన్నబండలో పార్కును కాపాడిన హైడ్రా

1444 గజాల పార్కు చుట్టూ ఫెన్సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓల్డ్ ఆల్వాల్ పరిధి, జొన్నబండలోని ఎంహెచ్ఆర్ కాలనీలో పార్కును హైడ్రా కాపాడింది. 1444.40 గజాల పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసింది. లే ఔట్ ప్రకారం సర్వే నంబర్లు 575, 576 (పార్ట్), 577, 578 (పార్ట్), 598, 580 (పార్ట్)లలో మొత్తం 1444.40 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దీనిని ఆక్రమించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రాకమిషనర్ ఎవి.రంగనాథ్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి, పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. దీంతో గురువారం హైడ్రా అధికారులు పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పార్కును కాపాడిన హైడ్రాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. చెత్త వేయకుండా వెంటనే పార్కుగా అభివృద్ధి చేయాలని జిహెచ్ఎంసిని కోరుతామన్నారు.






పతంగుల పండగకు చెరువుల సుందరీకరణ

అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

హైడ్రా అభివృద్ధి చేసిన చెరువులను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ గురువారం సందర్శించారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత పతంగుల పండుగను పెద్దఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. కూకట్‌పల్లి నల్లచెరువుతో పాటు మాదాపూర్‌లోని తమ్మిడికుంట, పాతబస్తీలోని బమ్‌రుక్న్ ఉద్‌దౌలా చెరువులను సందర్శించారు. మూడు నాలుగు రోజుల్లో సుందరీకరణ పనులు పూర్తి చేసి వేడుకలకు వేదికలు సిద్ధం చేయాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. మొక్కలను విరివిగా నాటి చెరువులను సుందరీకరించాలని కోరారు. చెరువుల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చెరువుల పరిసరాలు ప్రజలకు ఆకర్షణీయంగా ఉండేలా అభివృద్ధి చేయాలని, నడక మార్గాలు, లైటింగ్, శుభ్రత పనులు, భద్రతా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. పండగ నాటికి చెరువులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

# వన్ టైమ్ సెటిల్‌మెంట్..

ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ

ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : జిహెచ్‌ఎంసి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటిఎస్) పథకం 2025–26ను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 90 శాతం రాయితీ లభించనుంది. ఈ పథకం ప్రకారం, పన్ను చెల్లింపుదారులు పూర్తి ప్రిన్సిపల్ ట్యాక్స్‌తో పాటు కేవలం 10 శాతం వడ్డీ మాత్రమే ఒక్కసారి చెల్లిస్తే, మిగిలిన 90 శాతం వడ్డీ పూర్తిగా మాఫీ అవుతుంది. దీని ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను సులభంగా పరిష్కరించుకునే అవకాశం కలుగుతుంది. పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నగరాభివృద్ధికి సహకరించాలని జిహెచ్‌ఎంసి విజ్ఞప్తి చేసింది. ఓటిఎస్ పథకం కింద చెల్లింపులు మై జిహెచ్‌ఎంసి యాప్, మీ సేవ కేంద్రాలు, జిహెచ్‌ఎంసి సిటిజన్ సర్వీస్ సెంటర్లు(సిఎస్‌సి), ఆన్‌లైన్ విధానాల ద్వారా చేయవచ్చు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించడం ద్వారా నగర మౌలిక సదుపాయాలు, పౌర సేవలు మరింత బలోపేతం అవుతాయని అధికారులు అన్నారు.

# 2027 డిసెంబర్ నాటికి గోదావరి ఫేజ్–2, 3 ప్రాజెక్ట్ పూర్తి

జలమండలి ఎండి అశోక్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరానికి అదనంగా 20 టిఎంసిల నీటిని అందించే గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్2, 3 పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రూ.7,360 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా అటు తాగునీటి అవసరాలు తీరడమే కాకుండా, మూసీ పునరుజ్జీవనం కోసం జంట జలాశయాలను నింపడం సాధ్యమవుతుందన్నారు. మూసీ పునరుజ్జీవనంకోసం జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి రూ. 7,360 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు జలమండలి చేపట్టింది. ఈపనులపై గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ఎండి.అశోక్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి. మాట్లాడుతూ మల్లన్న సాగర్ నుంచి ఘన్ పూర్ వరకు, అక్కడి నుంచి ఉస్మాన్ సాగర్ వరకు నిర్మించాల్సిన పైప్ లైన్ విస్తరణ పనులు, ఘన్ పూర్ వద్ద నిర్మించనున్న 80 మిలియన్ లీటర్ల మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఘన్ పూర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ల వద్ద నిర్మించే నీటి శుద్ధి కేంద్రాల పనులలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఏకకాలంలో నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులను, పైప్ లైన్ విస్తరణ పనులు, తదితర పనులను జరపాలన్నారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్ 2, 3 ద్వారా 300 ఎంజిడిల నీరు సరఫరా జరుగుతుందన్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి. శ్రీధర్, సిజిఎమ్ మహేష్ కుమార్‌లతో పాటు, సంబంచిన అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, మెనూ పాటించాలి

కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్:** నాంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత మోడల్ పాఠశాల(ఆలియా)ను జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి గురువారం సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం 'కర్మిక్ కనెక్షన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫ్లేవర్డ్ మిల్క్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.





క్రీడలతో సోదరభావం పెరుగుతుంది

క్రీడల ద్వారా సోదరభావం పెంపొందుతుందని కలెక్టర్ హరిచందన దాసరి పిలుపునిచ్చారు. జింఖానా గ్రౌండ్స్‌లో గురువారం అదనపు కలెక్టర్ జితేందర్‌రెడ్డితో కలిసి ఆమె 'సిఎం కప్' రెండో ఎడిషన్‌ను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ సాయిరాం, క్రీడల అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం





ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో రూ.40.50కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కమీషనర్ సునీత, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ చైర్మెన్ విశ్వం, నేతలు రఘునాయక్, జమృద్‌ఖాన్, మహ్మద్ ఇబ్రహీం, బస్వం, ఉప సర్పంచ్ అశోక్‌లు పాల్గొన్నారు.

శాసనసభలో జర్నలిస్టులు ప్రస్తావనపై హర్షం

**షాద్‌నగర్:** గురువారం క్యాంపు కార్యాలయంలో యూనియన్లకు అతీతంగా పలువురు జర్నలిస్టులు వీర్లపల్లి శంకర్‌కు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ షాద్‌నగర్ జర్నలిస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాసనసభలో ప్రస్తావించడం అభినంధనీయమన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎండి ఖాజాపాషా (కెపి), లట్టుపల్లి మోహన్ రెడ్డి, కస్తూరి రంగనాథ్, సంజయ్‌కుమార్, శరత్‌కుమార్, శ్రీశైలం, ధన్నారం రమేష్, భాస్కర్, జాకీర్, షకీల్, ఎస్పీబాలు, జగన్, రాకేష్, నర్సింహ్మారెడ్డి, 6టివి శ్రీను, ఇలియాస్, సమీ, రియాజ్, శివ పాల్గొన్నారు. **ఎమ్మెల్యేను సన్మానించిన తెలంగాణ ఉద్యమకారులు**...తెలంగాణ ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనసభలో మాట్లాడినందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు పి.వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మె సత్తయ్య, పాండురంగారెడ్డి, సుధాకర్, జాంగారి రవి, ఎల్లోజీ, జాంగారి నర్సింహులు, మేకల వెంకటేష్, రావుఫ్, రవికుమార్ గౌడ్ పాల్గొన్నారు.

రెండవ కెఏ పాల్‌గా వ్యవహరిస్తున్న కెటిఆర్

తెలంగాణ ఉద్యమకారుల శ్రేయస్సు.. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి.. రాష్ట్రాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసి రెండవ కెఏ పాల్‌గా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి కెటిఆర్‌కు తగిన గుణపాఠం ప్రజలు చెప్పడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. గురువారం క్యాంపు కార్యాలయంలోఉద్యమకారులతో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని, రాహుల్‌గాంధీని మరచిపోయి నోటికి వచ్చినట్లు మాట్లాడటం సంస్కారం కాదని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు పి.వెంకట్‌రాంరెడ్డి, ఎమ్మె సత్తయ్య, మంగులాల్‌నాయక్, జాంగారి, జాంగారి నర్సింలు, పాండురంగారెడ్డిలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రూ.6.3కోట్ల చెక్కుల పంపిణీ

ప్రజలందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులను విడుదల చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొందుర్గు మండలంలోని 30మంది లబ్దిదారులకు రూ.3.61లక్షలు, ఫరూక్‌నగర్ మండలంలోని 68మంది లబ్దిదారులకు రూ.27.35లక్షలు, పట్టణంలోని 48లబ్దిదారులకు 20.01లక్షలు, జిల్లేడు చౌదరిగూడ మండలంలోని 29మంది లబ్దిదారులకు 9.46లక్షలు, ఇతర మండలాలకు రూ.2.59లక్షల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి, 18వ వార్డు సభ్యులు తంగేళ్లపల్లి శంకర్, జమాల్పూర్ చందులాల్, కత్తి చంద్రశేఖర్ అప్ప, నవీన్‌రెడ్డిలు ఉన్నారు.

# బిసిలకు రక్షణ చట్టం తెచ్చేవరకు ఉద్యమం

రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బాల్‌రాజుగౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిసిలకు రక్షణ చట్టం తెచ్చేలా బిల్లు పెట్టాలని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బిసిల 42శాతం రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చిన తర్వాతే రాష్ట్రంలో మున్సిపాల్టీ, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా చిరంజీవులు, బాలగోని బాల్‌రాజుగౌడ్ విచ్చేసి, మాట్లాడారు. బిసిలపై వివక్షత, దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ తరహాలో బిసిల రక్షణకు చట్టం తేవాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని , బిసి సంఘాలను ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోదీతో సమావేశం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ, రాజకీయంగా అణచివేయబడుతున్న బిసిలకు ఆయా రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో బిసిల సబ్‌ప్లాన్ జాడ లేదని, ఏడాదికి రూ.20వేల కోట్ల నిధుల విడుదల అంశం ఊసే లేదని మండిపడ్డారు. బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్‌పార్టీలు బిసిలకు తీవ్రంగా నష్టం చేశాయన్నారు. సమావేశంలో ఫ్రంట్ వైస్‌చైర్మన్ ఎస్.దుర్గయ్యగౌడ్, కన్వీనర్లు బైరు శేఖర్, అంబాల నారాయణగౌడ్, యెలికట్టే విజయ కుమార్‌గౌడ్, ఎర్రమాదు వెంకన్న, గనం నరసింహ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు వరం సిఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొందుర్గు:** ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పేదలకు వరమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్ గ్రామంలో బొంతల రాజు, విజయలక్ష్మి, శ్రీరంగాపూర్‌లో బియ్యని పాండుయాదవ్, చిలుంబావి తండాకు చెందిన జరుపుల బద్రులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ పంపిణీ చేయించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ఉమ్మెంతాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్‌రెడ్డి, రేగడి చిల్కమర్రి సర్పంచ్ శ్వేత శివారెడ్డి, సర్పంచ్ శ్రీశైలం, ఉత్తరాస్‌పల్లి సర్పంచ్ నందు, నాయకులు రాజేష్ పటేల్, రామక్రిష్ట, రవీందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, యాదయ్య, గోపాల్‌నాయక్, నర్సింలు, గోపాల్, దర్గా రామచంద్రయ్య, హరిశ్వర్‌రెడ్డి, కుమార్, వేణు, సందీప్‌లు పాల్గొన్నారు.

# క్రీడలతో యువతలో నాయకత్వ లక్షణాలు

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుశీంద్ర రావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుశీంద్రరావు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డిలు అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ ఎడిషన్ చీఫ్ మినిస్టర్ కప్2025 లో భాగంగా టార్చ్ రిలే కార్యక్రమం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి ఘనంగా ప్రారంభమైంది. టార్చ్ రిలే కార్యక్రమాన్ని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుశీంద్రరావు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎర్రబెల్లి వెంకటేశ్వరరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. టార్చ్ రిలే సరూర్ నగర్ స్టేడియం నుండి ప్రారంభమై ఎల్‌బి నగర్ చౌరస్తా వరకు కొనసాగి, అక్కడి నుండి హయత్‌నగర్ జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలకు చేరుకుంది. అక్కడ స్థానిక తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారి, హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి టార్చ్ రిలే అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్ద అంబర్‌పేటకు చేరుకోగా మండల తహసీల్దార్, ఎంఈఓ,జెడ్ పి ఎచ్ఎస్ పెద్ద అంబర్‌పేట పాఠశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం టార్చ్ రిలే తుక్కుగూడకు చేరుకోగా, మహేశ్వరం ఎంఇఒ,హెడ్‌మాస్టర్,జెడ్‌పిహెచ్‌ఎస్ తుక్కుగూడ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు. చీఫ్ మినిస్టర్ కప్2025 టార్చ్ రిలే మొదటి రోజు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
09-01-2026
www.prajapaksham.in

మహాత్మ ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన సినిమా 'ఫూలే'. ఈ చిత్రంలో ప్రతీక్ గాంధీ, పత్రలేఖ పాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. అనంత్ మహదేవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా హిందీలో గతేడాది విడుదలై ఘన విజయం సాధించింది. ప్రముఖ జర్నలిస్ట్ పొత్తూరి రవిచంద్ర 'ఫూలే' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

రీల్



# సంక్రాంతి మొత్తం పరిశ్రమదవ్వాలి

- చిరంజీవి

ఏండీ వెంకీ సంగతి అంటే అదిరిపోద్ది సంక్రాంతి .... ఏండీ బస్సు సంగతి అంటే ఇరగ దీద్దాం సంక్రాంతి .. కేవలం మన శంకర వరప్రసాద్ గారికే కాదు ఈ సంక్రాంతి మొత్తం మన తెలుగు సినిమా పరిశ్రమదవ్వాలని మనస్ఫూర్తిగా నేను కోరుకుంటున్నాను. ప్రభాస్ రాజాసాబ్ గానీ, అన్నయ్య అంటూ ఆప్యాంగా పిలిచే నా తమ్ముడు రవితేజ సినిమా, అలాగే శర్వానంద్ నారి నారి నడుమ మురారి కానీ, గురువుగారు నన్ను భవిష్యత్ నా శిష్యుడుగా ఉన్న నవీన్ పొలిశెట్టి వీళ్ళందరి సినిమాలు కూడాను ఈ సంక్రాంతికి సూపర్ హిట్ అవ్వాలని, తెలుగు సినిమా పరిశ్రమకు, నిర్మాతలకు, బయ్యర్లకు వీళ్ళందరూ సుభిక్షంగా ఉన్నప్పుడే అదే నిజమైన సంక్రాంతి అని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. మన శంకర వరప్రసాద్ గారు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో పాటలకు వెంకటేష్, చిరంజీవి సైతం స్టెప్పులేసి ఫ్యాన్స్‌కు పండుగా తెచ్చారు. ఈ సినిమా చాలా వినోదాత్మకంగా ఉంటుందని ఈ సందర్భంగా మాట్లాడిన చిరంజీవి చెప్పారు. అనిల్ రావిపూడి తన వద్దకు వచ్చి కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చిందని అన్నారు. అయితే గతంలో చేసిన చంటబ్బాయ్, ఘరానా మొగుడు, వంటి పలు సినిమాల్లో అభిమానులు చూసి ఎంత ఎంజాయ్ చేశారో ఇప్పుడు ఇప్పటి తరం వారు కూడా ఆయా పాత్రలతో ఎంజాయ్ చేస్తారని చెప్పారు. ఈ సినిమా ఆల్ రెడీ హిట్ అయిందని అన్నారు. అనుకున్న సమయంలో, అనుకున్న బడ్జెట్‌లో సినిమా పూర్తి చెయ్యడమే ఈ రోజుల్లో మొదటి సక్సెస్ అని చెప్పారు. అనిల్ రావిపూడి ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో చక్కగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తప్పకుండా ఈ సినిమాను పెద్ద హిట్ చెయ్యడానికి మీరంతా సిద్ధంగా ఉన్నారా చిరంజీవి ఆశాభావం వ్యక్తం చేశారు. నయనతారను ఏం చెప్పి ఒప్పించారో కానీ ప్రమోషన్స్‌కు కూడా అనిల్ రావిపూడి ఆమెను తీసుకువచ్చారని అన్నారు. గతంలో రెండు సినిమాలు చేసినప్పటికీ, ఈ సినిమాతో మాత్రం ఒక ఫ్యామిలీ ఫ్రెండ్ లాగా ఉండని నయనతారను కొనియాడారు. ఈ సినిమాలో చిరంజీవితో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉందని హీరో వెంకటేష్ అన్నారు. చాలా సరదాగా షూటింగ్ పూర్తి చేశామన్నారు. సినిమా నడిచినంత సేపు నవ్వులే నవ్వులని చెప్పారు. అనిల్‌తో పని చెయ్యడం ఎప్పటికి రెడీ అని అన్నారు. ఎలాంటి దర్శకులు పరిశ్రమకు అవసరమని చెప్పారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ నిజానికి వెంకటేష్ తో తనకిది నాలుగో చిత్రమని చెప్పారు. చిరంజీవి తో ఈ సినిమా చెయ్యడం అద్భుతంగా భావిస్తున్నాను అని అన్నారు. ప్రతి సన్నివేశం చాలా కొత్తగా ఉంటుందని చెప్పారు. భీమ్స్ చాలా మంచి సంగీతం అందించారని, మీసాల పిల్ల వంటి పాటలు ఇప్పటికే హిట్ అయ్యాయని చెప్పారు. అయితే ఓవర్సీస్ కు పంపించాల్సిన పని ఉండటం వల్ల ఈ ఈవెంట్ కు భీమ్స్ రాలేకపోతాయని అనిల్ చెప్పారు. నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి ఈ ఈవెంట్ లో మాట్లాడారు.

# భర్త మహాశయులకు విజ్ఞప్తితో గోలగోల చేద్దాం



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్‌ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' జనవరి 13న గ్రాండ్గా విడుదల కానుంది. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్ర బృందం ఇప్పుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్ను లాంచ్ చేసింది. ట్రైలర్ రవితేజ యాక్షన్ సినిమాలు చాలు అనే ఆకట్టుకునే డైలాగ్తో ప్రారంభమవుతుంది. ఇది ప్రేక్షకులు చాలా కాలంగా మిస్ అవుతున్న ఫ్యామిలీ జోన్కు అతను తిరిగి వస్తున్నాడనే ఫన్ ఇండికేషన్. ఫారిన్ టూర్ లో ఆషిక రంగన్నా ప్రేమ కలగడంతో, డింపుల్ హయతితో అతని వైవాహిక జీవితం ఊహించని విధంగా మారడంతో కథ మొదలవుతుంది. ఇద్దరు మహిళల, రెండు విభిన్న ప్రశ్నల మధ్య నలిగిపోతున్న అతని ప్రయాణం హిలేరియస్ గా అదే సమయంలో ఎమోషనల్ సాగుతుంది.ఈ సందర్భంగా లో హీరో రవితేజ మాట్లాడుతూ ఈసారి పండక్కి సరదా సరదాగా గోల చేద్దాం. ఇదొక్కటే కాదు.వస్తున్న అన్ని సినిమాలు ఫుల్ ఎంటర్టైమెంట్. ఈసారి ఫుల్ ఎంటర్టైన్మెంట్ సంక్రాంతి అవుతుందని నా ప్రగాఢ నమ్మకం ఉంది అన్నారు. ఆషిక రంగనాథ్ మాట్లాడుతూ ఇది అద్భుతమైన జర్నీ. పాటలు టీజర్ కి సూపర్ రెస్పాన్స్ ఇచ్చారు. సినిమా అద్భుతంగా ఉంటుంది. జనవరి 13న సినిమా రిలీజ్ అవుతుంది. ఫ్యామిలీ, ఫ్రెండ్స్ చూడాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ ఇది అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఫన్ ఫిల్మ్. ఖచ్చితంగా అందరూ ఎంజాయ్ చేస్తారు. సంక్రాంతికి రిలీజ్ అవుతున్న అన్ని సినిమా సూపర్ హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. డింపుల్ హయాతి మాట్లాడుతూ రవితేజతో ఇది నాకు రెండో సినిమా. ఇది నా మొదటి సంక్రాంతి సినిమా. అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ జనవరి 13న సినిమా రిలీజ్ అవుతుంది. మంచి ఎంటర్టైన్మెంట్ సినిమా. చూసి ఆనందిస్తారని కోరుకుంటున్నాను.



## అనగనగా ఒక రాజు ట్రైలర్ రిలీజ్

హీరో నవీన్ పొలిశెట్టి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'తో ఈ సంక్రాంతికి అలరించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. 'అనగనగా ఒక రాజు' చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ వేడుక హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరో నవీన్ పొలిశెట్టి, హీరోయిన్ మీనాక్షి చౌదరి, దర్శకుడు మారి, నిర్మాత సూర్యదేవర నాగవంశీతో పాటు చిత్ర బృందం హాజరైంది. అసలు సిసలైన పండగ చిత్రంగా 2026, జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టనున్న 'అనగనగా ఒక రాజు'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దాదాపు మూడు నిమిషాల నిడివితో రూపొందిన 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ ఆద్యంతం వినోదభరితంగా సాగింది. కింగ్ నాగార్జున అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'అనగనగా ఒక రాజు.. ఆ రాజుకి చాలా పెద్ద మనసు. ఆ మనసులోకి ధగధగా మెరిసిపోయే నగలు వేసుకొని యువరాణి దిగింది' అంటూ నాగార్జున వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా ప్రారంభమైంది. ఊరి పెద్దమనిషిలా బుల్లెట్ బండి మీద నవీన్ పొలిశెట్టి పాత్రను పరిచయం చేసిన తీరు బాగుంది. నోట్ల కట్టను గుడిలోని హుండీలో వేయబోతూ 'కన్నాన్ని పెద్దది చేయండి' అని పూజారితో చెప్పడం భలే ఉంది. ట్రైలర్‌లోని ప్రతి సంభాషణ గిలిగింతలు పెడుతోంది. మంత్రాన్ని తిరిగి చెప్పమని పూజారి అంటే.. మీనాక్షి చౌదరి గుండ్రంగా తిరగడం నవ్వులు పూయించింది. నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పాత్రలను మలిచిన తీరు, ఆ పాత్రల నుంచి హాస్యాన్ని పుట్టించిన తీరు కట్టిపడేసింది. నవీన్, మీనాక్షి ప్రేమకథకు వచ్చిన సమస్య ఏంటి? ఆ సమస్య నుంచి ఎలా బయటపడ్డారు? అనే ఆసక్తిని కలిగిస్తూ ట్రైలర్‌ను రూపొందించారు. 'పండగకు అల్లుడు వస్తున్నాడు' అంటూ ఎద్దులబండిపై నవీన్‌ను చూపిస్తూ సంక్రాంతికి పండుగను ముందుగానే తీసుకొచ్చారు. నవీన్ పొలిశెట్టి తన కామెడీ టైమింగ్‌తో మరోసారి మెప్పించారు. నవీన్, మీనాక్షి మధ్య కెమిస్ట్రీ చక్కగా కుదిరింది. యువరాజు కెమెరా పనితనం, మిక్కీ జె మేయర్ నేపథ్య సంగీతం ట్రైలర్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ట్రైలర్‌తో అంచనాలు తారస్థాయికి చేరాయి అనడంలో సందేహం లేదు.'అనగనగా ఒక రాజు' చిత్రం సంక్రాంతి కానుకగా 2026, జనవరి 14న భారీ స్థాయిలో విడుదల కానుంది.

## ఆహా ఓహో... అందం నీదే అంటాడు



మల్టీ టాలెంటెడ్ నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో రాబోతున్న కొత్త సినిమా 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రలో నటించగా.. నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటిస్తున్నారు. అతని మేనల్లుడు ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా ఈ సినిమా నుంచి అస్సలు సినిమా అనే సాంగ్ రిలీజ్ చేశారు. ఆహా ఓహో అంటాడు.. అందం నీదే అంటాడు అనే పదాలతో మొదలైన ఈ సాంగ్ ఆకట్టుకుంటోంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను శ్రీయ ఘోషల్ పాడారు. ఈ పాటలో ఐశ్వర్య అర్జున్ అందాలు ఆరబోసింది. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కానుంది. జి బాలమురుగన్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు యాక్షన్ కింగ్ అర్జున్ కొరియోగ్రఫీ అందించగా, నృత్యాలకు శాస్త్రి కొరియోగ్రఫీ అందించారు.

## 23న ప్రైమ్ వీడియోలో.. చీకటిలో

చంద్ర పెమ్మరాజు రచనా సహకారంతో శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'చీకటిలో' . సురేష్ ప్రొడక్షన్ ప్రై.లి. బ్యానర్‌పై డి. సురేష్ బాబు నిర్మించగా ప్రైమ్ ఒరిజినల్ సినిమాగా రానుంది. ఈ సినిమా జనవరి 23ను ప్రీమియర్ చేయనున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్ నేపథ్యములో చిత్రీకరించబడిన ఈ క్రైమ్ సస్పెన్స్ సినిమా, సంధ్య అనే ఒక ట్రూ క్రైమ్ పాడ్కాస్టర్ చుట్టూ తిరుగుతుంది. సంధ్య పాత్రను శోభిత ధూళిపాల పోషించారు. ఆమె నగరములో జరిగే కొన్ని దారుణమైన చీకటి రహస్యాలను వెలికితీస్తుంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలలో శోభిత ధూళిపాలతో పాటు విశ్వదేవ్ రాచకొండ కనిపించనున్నారు. వెంట చైతన్య విశాలక్ష్మి, ఈషా చావ్లా, ఝాన్సీ, ఆమని, వడ్లమాని శ్రీనివాస్ ఇతరులు కీలక పాత్రలు పోషించారు. ఈ తెలుగు ఒరిజినల్ సినిమా ప్రైమ్ వీడియో భారతదేశములో అలాగే ప్రపంచవ్యాప్తంగా 240 పైగా దేశాలలో జనవరి 23న ప్రీమియర్ అవుతుంది. ఈ సందర్భంగా నిర్మాత డి. సురేష్ బాబు మాట్లాడుతూ 'చీకటిలో ఒక భావోద్వేగాలు నిండిన సస్పెన్స్ డ్రామా. చీకటిని ఎదుర్కోవడానికి, నిజాలు మాట్లాడటానికి కావలసిన ధైర్యాన్ని ఇది అన్వేషిస్తుం ది.




ఈనాటి సమాజములో ఇది మనకెంతో అవసరం. ఈ అమెజాన్ ఒరిజినల్ కోసం ప్రైమ్ వీడియోతో కలిసి పనిచేయడం ఒక అద్భుతమైన అనుభవాన్ని ఇచ్చింది. ఈ సినిమా దీర్ఘకాలంగా కొనసాగుతున్న మా భాగస్వామ్యములో మరొక మైలురాయి. తన ఉత్కంఠభరితమైన కథ, శక్తివంతమైన నటనతో చీకటిలో ఒక మరపురాని ఉత్తేజకరమైన ప్రయాణాన్ని అందిస్తుంది. భారతదేశముతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు జనవరి 23న ప్రైమ్ వీడియో పై చీకటిలో ప్రీమియర్ గా ప్రసారం అవుతుంది అని అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో జైపాల్ యాదవ్ విచారణ ముగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్ :రాష్ట్రాన్ని కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌పై జరిగిన విచారణను సిట్ అధికారులు ముగించారు. ఇదే సమయంలో ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎస్ఐబి మాజీ అడిషనల్ ఎస్‌పి తిరుపతన్నను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి విచారించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి కీలక అంశాలపై స్పష్టత కోసం సిట్ అధికారులు తిరుపతన్నతో పాటు జైపాల్ యాదవ్ ను ఒకేసారి కలిపి విచారించారు. ట్యాపింగ్ ఆదేశాలు, సమాచార మార్పిడి, రాజకీయ నేతల పాత్రపై సిట్ లోతుగా ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు సంకేతాలు ఇస్తున్నారు. సిట్ విచారణ కొనసాగుతోంది.

## రూ.10 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 138 మున్సిపాలిటీలకు పలు దఫాలుగా నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం, తాజాగా 2025–26 బడ్జెట్ అంచనాల (బిఇ) కింద ఈ నిధులను విడుదల చేసింది. ఆర్థిక శాఖ జారీ చేసిన బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బిఆర్ఓ) ఆధారంగా ఈ మొత్తాన్ని మున్సిపాలిటీలకు కేటాయించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రస్తుతం విడుదల చేసిన నిధులను మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తి, అత్యవసర మరమ్మతులు, మురుగునీటి కాలువల శుభ్రత, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల మరమ్మతుల కోసం వినియోగించనున్నారు. ఈ నిధుల విడుదలకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ అవసరమైన సర్దుబాట్లు చేయనుండగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ఖర్చుల వివరాలు, వినియోగ ధ్రువపత్రాలను అకౌంటెంట్ జనరల్‌కు సమర్పించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వాటా నిధులను ప్రభుత్వం నేరుగా మున్సిపాలిటీలకు మళ్లిస్తోందని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ జిఓతో పట్టణ స్థానిక సంస్థల్లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊపొస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 'ఎఐ'లో హైదరాబాద్ పరుగులు

### మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ :కృత్రిమ మేథ సాంకేతికత రంగంలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ పరుగులు పెడుతోందని రాష్ట్ర ఐటి పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఎయిడెన్ ఎఐలో ప్రస్తుతం 500 మంది నిపుణులు పనిచేస్తుండగా, వచ్చే రెండేళ్లలో మరో 500 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఎయిడెన్ ఎఐ ఇంజనీరింగ్ కేంద్రం విస్తరణ పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రెండేళ్లలో తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకో సిస్టం వల్ల ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ప్రస్తుతం తెలంగాణా వైపు చూస్తున్నాయన్నారు. న్యూజెర్సీలోని ప్రిన్స్ టన్ కేంద్రంగా పని చేస్తున్న ఈ సంస్థ కృత్రిమ మేథలో నూతన ఆవిష్కరణల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని వివరించారు. ఏఐని విస్తృత కార్యకలాపాలకు అభివృద్ధి చేసే సంస్థలను తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఇఓ కిరణ్ వెంట్రప్రగడ, సిఓఒ శ్రీని కమిడి, కవితా మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డిజిపి నియామకంపై గందరగోళం

యుపిఎస్‌సి నుంచి తిరిగి వచ్చిన జాబిత
సుప్రీంకోర్టు అనుమతి తప్పనిసరి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి పూర్తి స్థాయి డిజిపి నియామకం అంశంలో స్పష్టత లేకపోవడంతో వ్యవహారం మరో మలుపు తిరిగింది. డిజిపి నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ సంస్థ యూపీఎస్సీ (యుపిఎస్‌సి) తిరిగి రాష్ట్రానికి పంపించింది. ఈ నియామకానికి సుప్రీంకోర్టు అనుమతి తప్పనిసరిగా అవసరమని యుపిఎస్‌సి స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాలో ప్రస్తుత డిజిపి శివధర్ రెడ్డితో పాటు సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, ఆప్టే, సౌమ్య మిశ్రా, షికా గోయల్ పేర్లు ఉన్నాయి. అయితే ఈ జాబితా ఆలస్యంగా పంపబడినందున, సుప్రీం కోర్టు నుంచి ప్రత్యేక అనుమతి తీసుకురావాల్సి ఉంటుందని యుపిఎస్‌సి తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ, తొలిసారి తొమ్మిది నెలల క్రితమే డిజిపి ప్యానెల్ జాబితాను యుపిఎస్‌సికి పంపామని, తాజాగా గత నెల 31న రెండోసారి అదే జాబితాను పంపినట్లు పేర్కొంది. అయినప్పటికీ యుపిఎస్‌సి నుంచి సుప్రీం కోర్టు అనుమతి అవసరమన్న సమాధానం రావడంతో నియామక ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిజిపి నియామకంపై కొనసాగుతున్న ఈ అనిశ్చితి పోలీసు శాఖలోనూ, పరిపాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.



## స్వాగతిస్తాం (మొదటి పేజీ తరువాయి)

దిగుతున్నారని, ఇలాంటి విమర్శలు మానుకోవాలని చెప్పారు. ఎవరి సత్తా వారికి ఉంటుందని, తమ సత్తా ఏంటో పంచాయతీ ఎన్నికల్లో చూపించామని చెప్పుకొచ్చారు. ఎన్నికలు ఏవైనా సిపిఐదే హవా అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల సమర భేరి సభ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కూనంనేని మాట్లాడారు. కొద్దిరోజుల్లో కార్పోరేషన్ ఎన్నికలు జరగనున్నాయని, త్వరలో షెడ్యూల్ విడుదల కానుందని చెప్పారు. కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని చెప్పారు. 60 డివిజన్లలో పోటీ చేసేందుకు సిపిఐ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గడిచిన స్థానిక ఎన్నికల్లో మేజర్ గ్రామ పంచాయితీలను సిపిఐ కైవసం చేసుకుందని, అవాకులు చెవాకులు పేలే వారికి ఇది గుణపాఠం కాదా అన్నారు. కార్పోరేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వాన్ని ఒప్పించామని, ఆ నాటి నుండి నేటి వరకు కోట్లాది రూపాయ నిధుల తీసుకొచ్చి అభివృద్ధికి పాటుపడుతన్నామని అన్నారు. గత 20 సం.లుగా మున్సిపల్ ఎన్నికలు జరగకుండా కొందరు రాజకీయ నాయకులు అడ్డుకున్నారని, వారి స్వలాభం కోసం ఈ ప్రాంత ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, అభివృద్ధిని అడ్డుకున్నారని మండిపడ్డారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయానికి సైనికుల్లా పనిచేయాలని, అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు పాటుపడాలని సూచించారు. ఇందు కోసం ఇప్పటి నుండే ప్రణాళికలు రచించి డివిజన్లలో పని చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, వి పూర్ణ చంద్రరావు, సలిగంటి శ్రీనివాస్, కందుల భాస్కర్, రాహుల్, ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు, డివిజన్ల కార్యదర్శులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.

## వైదొలగిన అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యాన్ని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉపసంహరించుకున్నారు. వీటిల్లో శాంతి, ప్రజాస్వామ్యం, తల్లీ పిల్లల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, వివిధ సంఘర్షణల్లో లైంగిక హింస నియంత్రణ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో, ఈ సంస్థలకు నిధులు ఇవ్వడంవల్ల అమెరికా పౌరులు చెల్లించే డాలర్లు వృథా అవుతాయని నిర్ణయానికి వచ్చిన తర్వాత ఈ ఉత్తర్వుపై ఆయన సంతకం చేశారు. ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులద్వారా అమెరికా వ్యతిరేక సైద్ధాంతిక భావాల విస్తరణకు, అమెరికా సార్వభౌమాధికార, ఆర్థికశక్తికి విరుద్ధమైన ఆలోచనల ప్రోత్సాహానికి ఉపయోగపడ్డాయని ఉత్తర్వు పేర్కొంది. అమెరికా జాతీయ ప్రయోజనాలకు, భద్రతకు, ఆర్థిక పురోగతికి, సార్వభౌమత్వానికి భిన్నంగా నడిచే సంస్థలు ఇందులో ఉన్నాయని ఉత్తర్వు పేర్కొంది. ఈ 66 సంస్థలలో సగానికి సగం అంటే దాదాపు 33 సంస్థలు ప్రపంచ వాతావరణ సంరక్షణకోసం పాటుపడి వాతావరణ నియంత్రణ చర్యలకోసం పాటుపడే సంస్థలే ఉన్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణవేత్తలు, పర్యావరణ పరిరక్షణకోసం పాటుపడే అనేక సంసలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిని పూర్తిగా స్వార్థపూరిత చర్యగా అభివర్ణించాయి. ఇప్పుడు యుఎన్ఎఫ్‌సిసిసి నుండి వైదొలగి బయటకు వెళ్ళిపోయిన ఏకైకదేశంగా అమెరికా తన బాధ్యతారాహిత్యాన్ని నిరూపించుకుందని పర్యావరణవేత్తలు విమర్శించారు. అమెరికా వినాశకరమైన నిర్ణయం తీసుకుందని పర్యావరణవేత్తలు, స్వచ్ఛందసంస్థల అధిపతులు విమర్శించారు. భూగోళాన్ని సంరక్షించేందుకు, కర్బన విషవాయువుల బారినుండి భూగోళాన్ని రక్షించేందుకు తీవ్రమైన కృషి జరుగుతోంది. గత ఏడాదిలో ప్రకృతివైపరీత్యాలు పరాకాష్టకు చేరి జాగ్రత్తగా ఉండాలని ప్రపంచదేశాలకు హెచ్చరిక కూడా జారీచేశాయి. ఈ పరిస్థితుల్లో వాతావరణ నియంత్రణ చర్యలు అమలు చేయడానికి అంతర్జాతీయ సంస్థలు,ప్రపంచదేశాలు తీవ్ర నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. ప్రపంచానికి ఎన్నో ఉమ్మడి సవాళ్ళు ఉన్నాయని, వీటన్నింటినీ సమష్టిగా ప్రతిఘటించి పరిష్కరించుకోవాల్సిన తరుణంలో ప్రపంచంలో నే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న అమెరికా అంతర్జాతీయ సంస్థల నుండి వైదొలగడం పూర్తి బాధ్యతరాహిత్య చర్య అని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఏకపక్ష దాడులకు, వనరుల ఆక్రమణ కు, ఏకపక్ష చర్యలకు పూనుకుంటూ,తన రక్షణ బడ్జెట్‌ను 50 శాతానికి పెంచుకుంటూ మరోవైపు తన ఉమ్మడి కర్తవ్యాలను విస్మరిస్తోందని పలు వార్తా సంస్థల ద్వారా విశ్లేషకులు విమర్శించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన కొద్దివారాల్లోనే ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలి కార్యకలాపాలలో పాల్గొనబోమని ప్రకటించారు. యునెస్కో, యుఎన్‌ఆరోగ్య సంస్థలలో భాగస్వామ్యాన్ని కూడా సమీక్షిస్తామని ప్రకటించారు. 2015లో పారిస్ ఒప్పందం తర్వాత ఐఎస్ఏ (ఇంటర్నేషనల్ సోలార్ ఎలయెన్స్) కేంద్ర కార్యాలయాన్ని భారత్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఐఎస్ఎలో ప్రస్తుతం 100 దేశాలు సభ్యులుగా సంతకం చేశాయి. వీటిల్లో 90 దేశాలు శాశ్వత సభ్యత్వానికి అంగీకరించాయి. 2030 నాటికి సోలార్ పెట్టుబడులపై సాంకేతిక ఖర్చులు తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇప్పుడు దీనికి కూడా బ్రేకులు పడతాయి.

## సమస్యల్లో యూనివర్సిటీలు

(మొదటి పేజీ తరువాయి)

అట్టహాసంగా ఎఐఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ 10వ మహాసభ బొజ్జ జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధులుగా ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్ఎ స్టాలిన్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తూ భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని దానిలో కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం2020 పేరుతో విద్య కార్పొరేటికరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తుందని విమర్శించారు. దానిలో భాగంగానే ఇటీవల పార్లమెంట్ లో వికాసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఎ) బిల్లును తీసుకురావడం జరిగిందని, ఈ బిల్లు సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి, భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క లౌకిక, శాస్త్రీయ స్వభావాలను దెబ్బ తీసే విధంగా ఈ బిల్లు ఉందని, యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఇ)తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్‌ను రద్దు చేయాలని, విబిఎస్ఎ బిల్లు ప్రతిపాదిస్తుందని, దాని స్థానంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వంచే నియంత్రించబడే ఏకైక, అత్యంత కేంద్రీకృత ఒకే కమిషన్‌ను ఏర్పాటు చేస్తుందని, ఈ విధానం ద్వారా సిలబస్ పూర్తిగా రాజకీయ, మతపర, విద్య ఉద్యోగ నియామకాల్లో పూర్తిగా రాజకీయ జోక్యం పెరుగుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయడంతో పాటు విబిఎస్ఎ బిల్లుని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓయూ అభివృద్ధికి 1000 కోట్ల నిధులు కేటాయించడం మంచి పరిణామమే కానీ ఇతర విశ్వవిద్యాలయాల అభివృద్ధి పట్ల సవతి తల్లి ప్రేమను చూపటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఓయూ మాదిరిగానే ఒక్కోక్క యూనివర్సిటీకి 1000 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించాలని, విశ్వవిద్యాలయాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులంతా సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓయూకు కేటాయించిన మాదిరిగానే ఒక్కోక్క యూనివర్సిటీ కి 1000 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించాలని, యూనివర్సిటీ విద్యార్థుల మెస్ బకాయిలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను శాశ్వత ప్రతిపాదికన భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ కూడా మాట్లాడారు. ఈ మహాసభలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాను ప్రసాద్, జిల్లా నాయకులు సిపతి వినయ్, యూనివర్సిటీ కన్వీనర్ కొమ్ము సాయికృష్ణ, నాయకులు తాంద్ర రాజేష్, సిహెచ్ వంశీ, ఎస్ నవీన్, బండి లావణ్య, సారిక, మమత, అనూష, నీరజ, ధరణి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

### కాకతీయ యూనివర్సిటీ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షునిగా కొమ్ము సాయికృష్ణ, కార్యదర్శిగా బొజ్జ జ్యోతి, ఉపాధ్యక్షులుగా తాంద్ర రాజేష్, బండి లావణ్య, సహాయ కార్యదర్శులుగా సిహెచ్ వంశీ, సారిక, కోశాధికారిగా తేజ లతో పాటు 21 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 Editor : Makkena Subbarao, Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com